అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 7-9-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 200 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

ఎత్తుకు పైఎత్తు..

జనం దృష్టి ఏమార్చడమే లక్ష్యం.. పీక్‌స్టేజ్‌కి రాజకీయ ఆధిపత్యపోరు

- సెప్టెంబర్ 17పైనే 'పొలిటికల్' ఫోకస్
- అధికారం కోసం నానా అవస్థలు
- 'ఓటర్ దేవుడి' ప్రసన్నతే లక్ష్యం

బి. బసవపున్నయ్య



సెప్టెంబర్ 17 తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సెంటిమెంట్‌ను తమకు అనుకూలంగా మార్చుకొనేందుకు రాష్ట్రంలో ప్రధాన రాజకీయపార్టీలు నానాతంటాలు పడుతున్నాయి. దానికోసం ప్రజల దృష్టిని మళ్లించడమే లక్ష్యంగా ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ రాజకీయ వ్యూహాలు పన్నుతున్నాయి. అదే సమయంలో జనం తమ గురించి మాత్రమే మాట్లాడుకోవాలనే తాపత్రయాన్నీ కనబరుస్తున్నాయి. ఇందుకు భిన్నంగా సాయుధ పోరాట వారసత్వాన్ని, వాస్తవాలను ప్రజలకు అందించేందుకు వామపక్షాలు కృషి చేస్తున్నాయి.

రాష్ట్రంలో ప్రధాన రాజకీయపార్టీలన్నీ ఇప్పుడు అధికారం కోసం వెంపర్లాడుతున్నాయి. ప్రజలకు తామేం మంచి చేస్తామో చెప్పడం మానేసి, ప్రతిపక్షాల్ని ఎలా తక్కువ చేయాలి అని అధికారపార్టీ, అధికారపార్టీని ఎలా ఇరుకునపెట్టి జనం దృష్టిని తిప్పుకోవాలి అని ప్రతిపక్షాలు వ్యూహ ప్రతివ్యూహాల్లో బిజీగా ఉన్నాయి. ప్రతి ఏడాది మాదిరే ఇప్పుడు కూడా సెప్టెంబర్ 17 తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవం చుట్టూనే 'సెంటిమెంట్' రాజకీయం తిరుగుతున్నది. ఆరోజు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో 'విమోచన దినోత్సవాలు' నిర్వహిస్తామనీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొంటారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు జీ కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఇక దాదాపు 17 ఏండ్ల తర్వాత హైదరాబాద్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల్ని ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించి, 17వ తేదీన పదిలక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఓటర్లు వీరిద్దరి మాయలో పడి తమపై శీతకన్ను వేస్తారేమో అనే భయంతో అధికారపార్టీ ప్రభుత్వ సహకారంతో సెప్టెంబర్ 16న 'పాలమూరు-రంగారెడ్డి' ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రచారాలు జనం చెవికి చేరకూడదనుకున్నారో ఏమో కానీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఆ తర్వాతి రెండు రోజులు కృష్ణా జలాలతో గ్రామాల్లోని గుళ్లలో దేవుళ్ల పాదాలు కడగండని తన పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. దీనికోసం ఏకంగా మంత్రులకే బాధ్యతలు అప్పగించారు. సెప్టెంబర్ 17న ఏటా బీజేపీ చేసే రాజకీయ రచ్చ రెండేండ్లుగా పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర హోం మంత్రి సభతో సరిపుచ్చుతున్న విషయం తెలిసిందే. ఎటూ ఆపార్టీతో బీఆర్‌ఎస్‌కు లోపాయికారి ఒప్పందం ఉందనే విషయంపై జనంలో చర్చా జరుగుతున్నది.

అటుతిరిగి, ఇటుతిరిగి జనం కాంగ్రెస్ 'ఓటు ఉచ్చు'లో పడతారేమో అనే డౌట్ ఆ రెండు పార్టీల్లోనూ దడ పుట్టిస్తుంది. ఇప్పటికే కర్నాటకలో హస్తం హవా వీచి, అక్కడి బీజేపీ ప్రభుత్వం మట్టికరిచిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ కర్నాటక ఊపు సహజంగానే పొరుగురాష్ట్రం తెలంగాణలో కూడా ఉంటుందనే అంచనా బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల్లో ఉంది. దానితో పోటాపోటీగా సెప్టెంబర్ 17ను కేంద్రీకృతం చేసుకొని కార్యక్రమాల రూపకల్పనకు మూడు పార్టీలు నానా హైరానా పడుతున్నాయి.

అదే టైంలో అసలు తెలంగాణ సాయుధ పోరాటంతో సంబంధమే లేని బీజేపీ చరిత్రను వక్రీకరిస్తోందంటూ వామపక్షాలు వాస్తవాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. ఎలాంటి రాజకీయ ప్రచారం లేకుండా ఆనాటి పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్ళేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సాయుధపోరాటం నాటికి బీఆర్‌ఎస్‌పార్టీనే లేదు కాబట్టి చర్చే లేదు. ఎన్నికలు పూర్తయ్యేవరకు ఓటరు దృష్టి తమపై నుంచి మరలకుండా చూసుకోవడం కోసం రాష్ట్రంలో మూడుముక్కలాట రాజకీయం రసకందాయంలో పడింది. మొత్తానికి సెప్టెంబర్ 17న మీడియాను 'మాయ' చేసేదాన్ని బట్టి, జనం మూడ్ ఉంటుందని మూడు పార్టీలు భావిస్తున్నాయి. మరి 'ఓటరు దేవుడు' ఎలా కరుణిస్తాడో!?

బీజేపీది అపరిపక్వత

ఇండియా పేరును ఎందుకు ద్వేషిస్తోంది?

- ఆ పేరంటేనే భయపడుతోంది
- ఇది చాలా విచిత్రం...

రాజ్యాంగానికి అవమానం : ఏచూరి



నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఇండియా పేరును భారత్‌గా మార్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నం 'అపరిపక్వం'గా ఉన్నదని సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. జీ-20 సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పంపిన విందు ఆహ్వాన పత్రికలో ఆమెను 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని సంబోధించడంపై వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. దీనిపై ఏచూరి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష కూటమికి ఇండియా అని పేరు పెట్టడంతో బీజేపీ కలవరపడుతోందని చెప్పారు. "ఇది చాలా విచిత్రం. మనకు రాజ్యాంగం ఉంది. శతాబ్దాలుగా దేశం ఏ విధంగా పేరు ప్రఖ్యాతలు గడించిందో మనకు తెలుసు. స్వతంత్ర భారతదేశాన్ని మనం వారసత్వంగా పొందాము. రాజ్యాంగంలోని 1వ అధికరణలో ఇండియా... అంటే భారత్...రాష్ట్రాల సమాఖ్య అని స్పష్టంగా ఉంది' అని అన్నారు.

"వైవిధ్యం, బహుళత్వం... ఇలా ప్రతి విషయాన్నీ రాజ్యాంగంలో చేర్చారు. మరి దీనిని బీజేపీ ఎందుకు మారుస్తోంది? ఇండియా పేరిట లౌకిక ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడడం బిజెపి నేతలకు ఇష్టం లేదా? అది వారి సమస్యా? ఇండియా అనే పదాన్ని బీజేపీ ఎందుకు అంతగా ద్వేషిస్తోందో మాకు తెలియడం లేదు" అని ఏచూరి తెలిపారు. ఇస్రో, ఐఐటీ, ఐఐఎం సంస్థల పేర్లలో కూడా ఇండియా అనే పదం ఉన్నదని గుర్తు చేశారు. 'ప్రెసిడెంట్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండియా' అనే దానిని 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని మార్చడం వెనుక ఉద్దేశమేమిటని నిలదీశారు. ప్రతిపక్ష కూటమికి ఇండియా అని పేరు పెట్టడం వల్లనే బీజేపీలో ఈ ఆలోచన వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇండియా అనే పదాన్ని వింటేనే కేంద్ర ప్రభుత్వం రెచ్చిపోతోందని మండిపడ్డారు. "ప్రతిపక్షాలు,

...11లో

మీ అజెండా ఏంటి..?

ఆ తొమ్మిది అంశాలను అందులో చేర్చాలి



- వాటిపై పార్లమెంటులో చర్చ జరగాలి
- ప్రత్యేక సమావేశాలపై ప్రధానికి సోనియా లేఖ

న్యూఢిల్లీ: ఈనెల 18 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు కేంద్రం పిలుపునివ్వటం రాజకీయ వర్గాల్లో తీవ్రకు చర్చకు దారి తీసింది. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలకు మోడీ ప్రభుత్వం ఎలాంటి అజెండానూ ప్రకటించలేదు. దీంతో ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ విషయం పై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ స్పందించారు. ప్రధాని మోడీకి లేఖను రాశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల అజెండాను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అజెండాలో తొమ్మిది అంశాలను చేర్చాలని పేర్కొన్నారు. అదానీ గ్రూప్‌పై తాజా ఆరోపణలు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఎంఎస్‌పీ పెంపు కోసం రైతుల డిమాండ్లు, మణిపూర్ పరిస్థితి, మతపరమైన ఉద్రిక్తతలు పెరగడం, కుల గణన ఆవశ్యకత, భారత భూభాగం మరియు కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, పొరుగు దేశం ఆక్రమణ వంటి తొమ్మిది అంశాలను ఎజెండాలో చేర్చాల్సిందిగా లేఖలో పేర్కొన్నారు. రాజకీయ పార్టీలను సంప్రదించకుండానే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల తేదీలను ప్రకటించారనీ, ఈ సమావేశాల అజెండా ఏమిటో మాకెవరికీ సమాచారం లేదని సోనియా వివరించారు. వచ్చే ఈ ప్రత్యేక సమావేశాల్లో కొన్ని అంశాలను చర్చకు తీసుకురావాలని మేము కోరుతున్నామని పేర్కొన్నారు.

కాగా, పార్లమెంటులో అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలపై చర్చించడానికి ఇండియా కూటమిలోని పలు పార్టీలు మంగళవారం సమావేశమైన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఇంట్లో ఆయన అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కాంగ్రెస్, డీఎంకే, సీపీఐ(ఎం), ఎన్సీపీ, సీపీఐ, ఆప్, టీఎంసీ, ఆర్జేడీ,

...11లో

16న పాలమూరు-రంగారెడ్డి వెట్ రన్

ప్రపంచంలోనే భారీ ఎత్తిపోతల పథకం

- నార్లాపూర్‌లో స్విచ్ఛాన్ చేయనున్న సీఎం కేసీఆర్
- 17న దేవుళ్ల పాదాలు కడగాలంటూ పిలుపు
- సమీక్షలో పాల్గొన్న మంత్రులు, అధికారులు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఈనెల 16న ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఇందులో భాగంగా నార్లాపూర్ ఇన్‌టేక్ నుంచి బటన్ నొక్కి బాహుబలి పంపు ద్వారా

...11లో

మూడోవారంలో మొదటి జాబితా

ముగిసిన కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ భేటీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం వచ్చిన వెయ్యి దరఖాస్తులను పరిశీలించేందుకు మూడు రోజులుగా తెలంగాణ రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ అభిప్రాయ సేకరణ చేపట్టింది.ఇందుకోసం రెండు రోజులు గాంధీభవన్‌లో సమావేశమైన స్క్రీనింగ్ కమిటీ...బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ అధ్యక్షతన ఈ సమావేశమైంది. స్క్రీనింగ్ కమిటీ సభ్యులంతా హాజరయ్యారు. రాష్ట్ర స్థాయిలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు తుది దశకు చేరుకుంది. నేడు తుది నివేదిక రూపొందించడం జరగనుంది. సాయంత్రం సీల్డ్ కవర్లో కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీకి, స్క్రీనింగ్ కమిటీ నివేదికను అందించనుంది. ఇప్పటికే దాదాపు 30 మంది సభ్యుల పేర్లు సూత్రప్రాయంగా అంగీకరించినట్టు తెలిసింది. మిగిలిన నియోజకవర్గాల అభ్యర్థులపైనా చర్చించింది. త్వరలోనే అన్ని నియో జకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ పార్టీ వెలువరించనున్నట్టు సమాచారం. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ దరఖాస్తులపై ఇప్పటి వరకు తాము చర్చించిన అంశాలను స్క్రీనింగ్ కమిటీ ముందుంచింది. అయినా స్క్రీనింగ్ కమిటీ ప్రత్యేకంగా పీఈసీ సభ్యులతో మరోసారి అభిప్రాయాలు తీసుకుంది.కమిటీకి వచ్చిన అభిప్రాయాలపై సమగ్రంగా చర్చించింది. తుదకు ప్రతి నియోజకవర్గం నుంచి మూడు పేర్లను ఖరారు చేసేందుకు ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీకి

...11లో

అలిగిన ఎంపీ

- కీలక పదవుల్లో కోమటిరెడ్డికి మొండి చెయ్యి
- బుజ్జగిస్తున్న జాతీయ నేతలు




వివరాలు 2లో..

ఆచితూచి మాట్లాడండి

భారత్‌పై అతిగా స్పందించొద్దు

- జీ20 అతిథులకు లోటు రానీయొద్దు:

కేంద్రమంత్రివర్గ భేటీలో ప్రధాని మోడీ నిర్దేశం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

భారత్, సనాతన ధర్మంపై ఆచితూచి మాట్లాడాలని కేంద్ర మంత్రులకు ప్రధాని మోడీ సూచించారు. బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్రమంత్రివర్గ సమావేశం అయింది. బేటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్-ఎస్)ను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన వాయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) స్కీముకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా 4,000 ఎండబ్ల్యూహెచ్‌లతో కూడిన బీఈఎస్ఎస్ ప్రాజెక్టులను 2030-31నాటికి అభివృద్ధిచేయడం జరుగుతుంది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో పారిశ్రామిక అభివృద్ధి పథకం-2017 కింద అదనపు నిధులకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.1,164 కోట్ల అదనపు ఆర్థిక వ్యయానికి ఆమోద ముద్ర వేసింది. ఈ సందర్భంగా

...11లో

ఆస్తుల్లో బీజేపీ... అప్పుల్లో కాంగ్రెస్

కొండలా పెరుగుతున్న కమల దళం ఆస్తులు

- అప్పులు మాత్రం ఐదు కోట్లేనట



న్యూఢిల్లీ : బీజేపీ ఆస్తుల విలువ ప్రతి ఏటా కొండలా పెరిగిపోతోంది. మరే ఇతర జాతీయ పార్టీకీ అందనంత దూరంలో నిలిచింది. 2021-22వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ఆస్తుల విలువతో పోలిస్తే బీజేపీ ఆస్తుల విలువ ఏకంగా ఏడున్నర రెట్లు ఎక్కువ. గత సంవత్సరం బీజేపీ తన ఆస్తుల విలువను రూ.6,046.81 కోట్లుగా ప్రకటించింది. ఆ ఏడాది కాంగ్రెస్ ఆస్తుల విలువ రూ.805.68 కోట్లు మాత్రమే.

ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం మంగళవారం విడుదల చేసిన నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, ఎన్సీపీ, బీఎస్పీ, సీపీఐ, సీపీఐ (ఎం), తృణమూల్ కాంగ్రెస్, నేషనల్ పీపుల్స్ పార్టీలు ప్రకటించిన ఆస్తులు, అప్పుల వివరాలను ఈ సంఘం విశ్లేషించింది. 2020-21లో బీజేపీ ఆస్తుల విలువ రూ.4,990 కోట్లు కాగా గత సంవత్సరం ఆ విలువ

...11లో

తెలంగాణ ఎన్నారైలకు క్షమాభిక్ష..!

- ఖైదీల విడుదల కోసం మంత్రి కేటీఆర్ కృషి
- దుబాయ్ రాజుతో భేటీకి ప్రయత్నాలు



వివరాలు 11లో..


జమిలిపై ఏం చేద్దాం..!

- కోవింద్‌తో అమిత్ షా, న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్ భేటీ ..మొదటి సమావేశంపై చర్చ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జమిలి ఎన్నికలపై కమిటీకి నేతృత్వం వహిస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా, న్యాయ శాఖ మంత్రి

...11లో



కొత్త భవనంలో పార్లమెంట్ సమావేశాలు..!



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను 18 నుంచి 22 వరకు కొత్త పార్లమెంట్ భవనంలోనే నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. సెప్టెంబర్ 18న పార్లమెంట్ పాత భవనంలో

...11లో

కనీస వేతనాల సవరణ ఎప్పుడు?

2017 తర్వాత అతీగతీ లేదు

- కార్మికుల బతుకులపై ప్రతికూల ప్రభావం
- ఉలుకూ పలుకూ లేని మోడీ ప్రభుత్వం



న్యూఢిల్లీ : జాతీయ స్థాయిలో కార్మికుల కనీస వేతనాలను సవరించే విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోంది. చివరిసారిగా 2017లో కనీస వేతనాలను సవరించారు. ఆ తర్వాత ప్రభుత్వం దాని ఊసే ఎత్తడం లేదు. 1948వ సంవత్సరపు కనీస వేతనాల చట్టం ప్రకారం వివిధ కేటగిరీల పనులు చేసే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలను నోటిఫై చేయవచ్చు. అయితే కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జాతీయ స్థాయిలో కార్మికుల కనీస వేతనాలను సవరిస్తుంది. దాని కంటే తక్కువగా రాష్ట్రాలు కనీస వేతనాలను నిర్ణయించకూడదు.

కార్మిక మంత్రిత్వ శాఖ 2017 జూలైలో కార్మికుల కనీస వేతనాన్ని రోజుకు 176 రూపాయలుగా నిర్ణయించింది. ఆ తర్వాత దానిని సవరించే విషయమై ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ఆరు సంవత్సరాల క్రితం నిర్ణయించిన కనీస వేతనాన్నే ఇప్పుడు కూడా ఇస్తుండడంతో బీడీల తయారీ, మొక్కలు నాటడం, అగరుబత్తీల తయారీ వంటి పనులు చేసే కార్మికుల పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. ఈ రంగాలలో మహిళలే ఎక్కువగా పని చేస్తున్నారు. కార్మికుల కనీస వేతనాలను తరచూ సవరించాల్సిన అవసరం ఉన్నదని, రాష్ట్రాలు ఆ పని చేస్తుండగా కేంద్రం మాత్రం అలసత్వం ప్రదర్శిస్తోందని ఆర్థికవేత్త ఒకరు తెలిపారు.

1970లో అప్పటి ప్రణాళికా సంఘం తయారు చేసిన దారిద్ర్యరేఖ అంచనాలకు అనుగుణంగా రూపొందించిన ఫార్ములా ఆధారంగా జాతీయ స్థాయిలో సగటు కనీస వేతనాలను నిర్ణయిస్తున్నారు. ఓ వ్యక్తి ఖర్చు చేసే కేలరీలతో ముడిపెట్టి దారిద్ర్యరేఖ అంచనాలు రూపొందిస్తారు. అయితే ఆరోగ్యం, విద్య, రవాణా, కమ్యూనికేషన్ వంటి వాటిపై పెట్టే ఖర్చుకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వరు. ప్రభుత్వం కనీస వేతనాలను నిర్ణయిస్తే అది ద్రవ్యోల్బణానికి సూచిక అవుతుందని నిపుణులు చెబుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కార్మికుల అవసరాలు,

...11లో

చంద్రయాన్-3కి ముందే 'భారత్' ప్రయత్నాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశం పేరును 'ఇండియా'కు బదులుగా భారత్ అని పిలిచే చర్యలు చంద్రయాన్-3 విజయవంతమవడానికి ముందే ప్రారంభమయ్యాయి. ప్రధాని మోడీ దక్షిణాఫ్రికా, గ్రీస్ దేశాల్లో పర్యటించేందుకు వెళ్లినపుడే 'ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ భారత్' అని రాశారు. అయితే జీ20 దేశాధినేతలకు రాష్ట్రపతి భవన్ పంపించిన ఆహ్వాన పత్రికల్లో 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని కనిపించడంతో మాత్రమే ఈ అంశం వెలుగులోకి వచ్చింది. ప్రధాని మోడీ గత నెల 22 నుంచి 25 వరకు దక్షిణాఫ్రికా, గ్రీస్ దేశాల్లో పర్యటించారు. జొహెన్నస్‌బర్గ్‌లో 15వ బ్రిక్స్ సమావేశాలకు హాజరయ్యారు. దీనికి సంబంధించిన ప్రభుత్వ నోటిఫికేషన్‌లో 'ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ భారత్' అని రాశారు. చంద్రయాన్-3 గత నెల 23న విజయవంతం అయింది. ఇదిలావుండగా, జీ20 నేతల సమావేశంలో పాల్గొనే భారతీయ అధికారులకు జారీ చేసే గుర్తింపు కార్డుల్లో 'ఇండియన్ అఫిషియల్'కు బదులుగా 'భారత్ అఫిషియల్' అని రాశారు. మోడీ ఈ నెల 6, 7 తేదీల్లో ఇండోనేషియాలో పర్యటిస్తున్నారు. ఆసియన్ ఇండియా సమ్మిట్, ఈస్ట్ ఆసియా సమ్మిట్‌లలో ఆయన పాల్గొంటారు. దీనికి సంబంధించిన ప్రభుత్వ నోటిఫికేషన్‌లో కూడా ఆయనను 'ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ భారత్' గానే పేర్కొంది.

బొడ్రాయి పండుగలో దళితులకు అవమానం

- పట్టినాగులపల్లిలో అగ్రవర్ణాల దాడి
- పోలీస్ స్టేషన్‌లో దళితుల ఫిర్యాదు
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-గండిపేట్



హైదరాబాద్ నగరానికి కూత వేటు దూరంలో ఉన్న నార్సింగి మున్సిపాలిటీలోని వట్టినాగుల పల్లిలో బొడ్రాయి పండుగ సందర్భంగా దళితులకు అవమానం జరిగింది. దళితులు బోనాలు తీసుకెళ్తున్న సందర్భంగా అగ్రవర్ణాల వారు కొందరు దాడి చేశారు. దళిత మహిళలు బోనాలు తీసుకెళ్లేందుకు వీల్లేదంటూ అవమానించారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అగ్రకులస్తులు బోనాలు చేసిన తర్వాత మీరు చేసుకోవాలంటూ చెప్పడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమను కులం పేరుతో దూషించారని దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్టు బూతులు తిడుతూ కిందపడేశారని వాపోయారు. తమకు న్యాయం చేయాలంటూ దళితులందరూ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

హోంగార్డులను క్రమబద్ధీకరించండి

- సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హోంగార్డులను శాశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. వారి సేవలను గుర్తించడంతోపాటు సకాలంలో వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈమేరకు సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. ఇతర పోలీసులతో సమానంగా వారు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.

విధి నిర్వాహణలో మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామక అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కానిస్టేబుళ్లు పొందుతున్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏవీ కూడా హోంగార్డులకు వర్తించడం లేదని తెలిపారు. దీంతో పదవీ విరమణ తర్వాత ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. వేతన సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ప్రత్యేకంగా రూ. 10 లక్షలు ఇవ్వాలనీ, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

ఉపాధ్యాయ బదిలీలకు 81,069 దరఖాస్తులు

- కొత్తగా 6,968 మంది అప్లై
- అత్యధికంగా రంగారెడ్డి నుంచి 4,722 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు మంగళవారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 81,069 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొత్తగా 6,968 మంది ఉపాధ్యాయులున్నారు. అయితే గతంలో దరఖాస్తు చేసిన వారిలో 70,762 మంది అప్లికేషన్లను సవరించారు. 3,339 మంది దరఖాస్తులను సవరించలేదు. అయితే అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 4,722 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత నల్లగొండ నుంచి 4,416 మంది, నిజామాబాద్ నుంచి 4,088 మంది, సంగారెడ్డి నుంచి 4,038 మంది ఉపాధ్యాయులు అప్లై చేసిన వారిలో ఉన్నారు. బదిలీల కోసం అత్యల్పంగా ములుగు జిల్లాలో 781 మంది దరఖాస్తు చేశారు.

ఒకే పాఠశాలలో సెప్టెంబర్ ఒకటి నాటికి కనీసం రెండేండ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసేందుకు అర్హులుగా ఉన్న విషయం తెలిసిందే. ఒకే పాఠశాలలో గెజిటెడ్ హెచ్ఎంలు ఐదేండ్లపాటు మిగతా ఉపాధ్యాయులు ఎనిమిదేండ్లు పనిచేస్తే తప్పనిసరిగా బదిలీ అవుతారు. ఉద్యోగ విరమణకు మూడేండ్లలోపు సర్వీసు ఉన్న వారికి బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది.

చేదెక్కుతున్న చక్కెర

ఆరేండ్ల గరిష్ట స్థాయికి చేరిక • వర్షాభావ పరిస్థితులే కారణం



న్యూఢిల్లీ : చక్కెర చేదెక్కుతోంది. దేశంలో చక్కెర ధర మంగళవారం నాడు ఆరు సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరింది. రుతుపవనాలు బలహీనంగా ఉండడమే దీనికి కారణమని భావిస్తున్నారు. గత పక్షం రోజులలోనే చక్కెర ధరలు మూడు శాతం పెరిగాయి. 2017 అక్టోబర్ తర్వాత తొలిసారిగా మెట్రిక్ టన్ను పంచదార ధర రూ.37,760కి చేరింది. కాగా వచ్చే నెలలో పండుగల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా దేశంలో చాలినన్ని నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది.

చెరకు పంటను అత్యధికంగా సాగు చేసే మహారాష్ట్ర, కర్నాటక వంటి రాష్ట్రాలలో వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దీంతో అక్టోబర్ 1న ప్రారంభమయ్యే కొత్త సీజన్‌లో చక్కెర ఎగుమతులపై కేంద్రం నిషేధం విధిస్తుందని అంటున్నారు. 'కరువు పరిస్థితుల కారణంగా ఉత్పత్తి తగ్గిపోతుందని చక్కెర మిల్లుల యాజమాన్యాలు అందోళన చెందుతున్నాయి. దీంతో తక్కువ ధరకే పంటను విక్రయించేందుకు సిద్ధపడుతున్నాయి' అని బాంబే చక్కెర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు అశోక్ జైన్ చెప్పారు.

అలిగిన ఎంపీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇప్పుడిప్పుడే గాడిలో పడిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కీలక పదవుల్లో అధిష్టానం మొండి చెయ్యి చూపింది. దీంతో అలిగి ఏ సమావేశానికీ రావడం లేదు. స్క్రీనింగ్‌కి తన అభిప్రాయాన్ని చెప్పలేదు. తన దరఖాస్తును కూడా వ్యక్తిగత సహాయకునితో పంపించారు. ఏఐసీసీ నియమించిన కీలక పదవుల్లో ఆయనకు చోటు దక్కకపోవడంతో ఆవేదనకు గురయ్యారు. కొత్తగా పునర్ వ్యవస్థీకరించిన ఏఐసీసీలో, ఎన్నికల సమయంలో నియమించిన కీలకమైన కేంద్ర ఎన్నికల కమిటీ, రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీల్లో ఆయనకు చోటు దక్కలేదు. గత కొన్ని రోజులుగా ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అభ్యర్థుల ఎంపికపై స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్‌ను కూడా ఆయన కలవలేదు. కోమటిరెడ్డితో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కోమటిరెడ్డి ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాల పట్ల వారి వద్ద ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన్ను బుజ్జగించేందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ రంగంలోకి దిగారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామంటూ ఆయన హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది.

జూనియర్ లెక్చరర్ల వేతనాలు వెంటనే చెల్లించండి : సీఎం కేసీఆర్‌కు రేవంత్ లేఖ

తెలంగాణలో కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల వేతనాలు వెంటనే చెల్లించాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ కాంట్రాక్టు ఉద్యోగులు, జూనియర్ లెక్చరర్లు కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. బుధవారం ఈమేరకు సీఎంకు రేవంత్ లేఖ రాశారు. ప్రత్యేక రాష్ట్రం రాగానే ఒక్క సంతకంతో అందరినీ రెగ్యులర్ చేస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 2014 టీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోనూ ఈ అంశాన్ని చేర్చినట్టు తెలిపారు.

ఆశించినట్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందనీ, కానీ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను మాత్రం రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నా సకాలంలో జీతాలు లేక వందలాది మంది అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి జీతాలు రాక కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారింది. ఈఎంఐలు సకాలంలో కట్టలేక, ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో బాధాకరం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అసలు ఏ రోజు జీతం పడుతుందో కూడా తెలియని దుస్థితి వచ్చింది. ఇదేనా ఎంప్లాయి ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటే? అని ప్రశ్నించారు. ఇది ధనిక రాష్ట్రమని చెప్పుకోవడమే తప్ప కాంట్రాక్టు లెక్చరర్స్‌కు వేతనాలు చెల్లించలేని దుస్థితి ఏర్పడింది. వారికి సకాలంలో జీతాలు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేనిపక్షంలో వారి పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలవడమే కాక, వారి తరఫున ప్రత్యక్ష కార్యాచరణకు సైతం సిద్ధమవుతుంది' అని రేవంత్ హెచ్చరించారు.

నేడు పాదయాత్రలు చేయండి

పార్టీ శ్రేణులకు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతమై...ఏడాది గడిచిన సందర్భంగా గురువారం రాష్ట్రంలో పెద్ద ఎత్తున పాదయాత్రలు చేయాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ లేఖలో సూచించిన విధంగా జిల్లా కేంద్రాలలో సాయంత్రం 5 గంటల నుంచి 6గంటల వరకు పాదయాత్రలు, తర్వాత భారత్ జోడో బహిరంగ సభలు నిర్వహించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ విషయంలో ఏఐసీసీ సూచనలను కచ్చితంగా పాటిస్తూ పెద్దఎత్తున కార్యక్రమా లు నిర్వహించి, వాటికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు, పేపర్ క్లిప్స్ గాంధీభవన్ మెయిల్, వాట్సాప్‌కు పంపాలని విజ్ఞప్తి చేశారు.

17న తుక్కుగూడలో భారీ బహిరంగ సభ

హైదరాబాద్‌కు చేరుకున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ...బుధవారం సాయంత్రం పార్టీ నేతలతో కలిసి 17న నిర్వహించబోయే బహిరంగ సభ కోసం గచ్చిబౌలి స్టేడియాన్ని పరిశీలించారు. ఆ తర్వాత తుక్కుగూడలోని స్థలాన్ని సైతం పరిశీలించారు. అనంతరం పార్టీ సీనియర్లతో సమావేశమై తుక్కుగూడలో బహిరంగ సభను నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 16, 17 తేదీలలో జరిగే సీడబ్ల్యూసీ సమావేశాలు, ఏర్పాట్లపై సీనియర్ నాయకులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఇతర నేతలు ఉన్నారు. ఇప్పటికే పరేడ్ గ్రౌండ్, ఎల్బీ స్టేడియంలో సభ నిర్వహణ కోసం అనుమతి కోరిన టీపీసీసీ నేతలు... జాతీయ నేతల సూచనల ఆధారంగా సభా వేదికను నిర్ణయించనున్నారు. అంతకు ముందు శంషా బాద్ విమానాశ్రయంలో కేసీ వేణుగోపాల్‌కు రేవంత్ రెడ్డి, ఠాక్రే, భట్టి విక్రమార్క, నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

రాజ్యాంగంపై మోడీ సర్కార్ దాడి

- దళితుల సామాజిక భద్రత నిర్వీర్యం : సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలనరసింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాలనరసింహ విమర్శించారు. దేశంలోని దళితుల ఆర్థిక స్థితిని, సామాజిక భద్రతను నిర్వీర్యం చేస్తూ విద్వేషాలను రెచ్చగొడుతున్నదని చెప్పారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో రాజ్ బహదూర్‌గౌర్ హాల్‌లో బుధవారం అఖిల భారత దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమితి సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె రాజరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బాలనరసింహ మాట్లాడుతూ నాగ్‌పూర్ కేంద్రంగా రిజర్వేషన్ విధానాన్ని పూర్తిగా తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అందులోనే భాగంగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేట్ పరం చేస్తున్నారని చెప్పారు. దీంతో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు లేకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు.

దళిత, ఆదివాసీలను ఆర్థికంగా అణగదొక్కాలని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను కూడా రద్దు చేసిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో అణగారిన వర్గాల వాటా ఏటా తగ్గుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తొమ్మిదేండ్ల మోడీ పాలనలో దేశవ్యాప్తంగా దళితులపై అసమానతలు, అణచివేతలు, వివక్ష, దాడులు, నేరాలు రెట్టింపయ్యాయని అన్నారు. బలమైన పోరాటాలు, ఉద్యమాలు ద్వారానే రాజ్యాంగాన్ని రక్షించుకుంటామనీ, దళితుల హక్కులు పరిరక్షించబడతాయని చెప్పారు.

ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మారుపాక మాట్లాడుతూ వచ్చేనెల 20న హైదరాబాద్‌లో 'దళితుల అభివృద్ధి-ప్రభుత్వాలు'అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తామని అన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు కె యేసురత్నం, బి లక్ష్మీపతి, కె సహదేవ్, జె కుమారస్వామి, వై ఉషశ్రీ, కె రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాలో తెలంగాణ స్టూడెంట్స్‌కు నో ఎంట్రీ

- మంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకోవాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డెంటల్ సర్జన్ మాస్టర్ డిగ్రీ కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కోటాలో తెలంగాణ విద్యార్థులకు డాక్టర్ వైఎస్సాఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఒక్క సీటు కూడా కేటాయించకుండా అన్యాయం చేసిందని ఆల్ ఇండియా డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మహ్మద్ మంజూర్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావుకు ఒక వినతిపత్రం సమర్పించారు. బీ కేటగిరీ భర్తీని నీట్ పీజీ (ఎండీఎస్ 2023) ర్యాంకుల ప్రకారం భర్తీ చేస్తామని నోటిఫికేషన్ ఇచ్చిన సదరు యూనివర్సిటీ, మేనేజ్‌మెంట్ కోటా సీట్ల తుది మెరిట్ జాబితాలో ఉస్మానియా విద్యార్థులు మాత్రమే ఎస్1ఏ కేటగిరీకి అర్హులని తెలిపినట్టు గుర్తు చేశారు. అయితే ఆ కేటగిరీలో సీట్లు లేవని తిరిగి ప్రకటిస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పటికే తెలంగాణలో మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లను ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు కేటాయించినట్టు తెలిపారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ర్యాంకులు, ప్రతిభ ఆధారంగా కాకుండా తెలంగాణ విద్యార్థులను పక్కన పెడుతున్నారని చెప్పారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

13న ప్రభుత్వ వైద్యుల మహాధర్నా

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా ఆస్పత్రి ఆవరణలో ఈ నెల 13న మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం సెంట్రల్ కోర్ కమిటీ బుధవారం సమావేశమైంది. ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం, పీఆర్సీ ఎరియర్స్ పెండింగ్ విషయాలను కమిటీ ప్రతినిధులు చర్చించారు. అనంతరం ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వానికి నోటీసులిచ్చి నెల గడుస్తున్నా ఎలాంటి స్పందన లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల విడుదల చేసిన అవతవకలతో కూడుకున్న జీవో నెంబర్ 142ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ జీవోతో వైద్యులకు, వైద్య సిబ్బందికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయాలు రద్దు చేయడం, అందులో ఉన్న సిబ్బందిని ఇతర ప్రదేశాలకు పంపించడం ద్వారా అన్ని క్యాడర్లకు రాబోయే కాలంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. వైద్య విధాన పరిషత్‌లో పనిచేసే ఉద్యోగులందరికీ ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని, వారికి హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,000	▼	160
22 క్యారెట్లు	- 55,000	▼	150
కిలో వెండి	- 78,500	▼	500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 134
రిటైల్ (లైవ్)	రూ. 156
స్కిన్‌తో	రూ. 226
స్కిన్‌లెస్	రూ. 257

'గులాబీ'లో గుబులు

అధికార బీఆర్ఎస్ పార్టీలో అసమ్మతి గళం తారాస్థాయికి చేరింది. టికెట్ల కేటాయింపు పూర్తయిన నాటి నుంచి అసంతృప్తులు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇన్నాండ్లు టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఫలితంగా వారి అనుచరులు బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధమవుతున్నారు. మంచిర్యాలలో ఈ పరిస్థితి మరింత అధికమవుతోంది. తాజాగా హాజీపూర్ జడ్పీటీసీ శిల్ప, మాజీ జెడ్పీటీసీ ఆశాలత, దండేపల్లి ఎంపీపీ గడ్డం శ్రీనివాస్‌తో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం చర్చనీయాంశమైంది. వీరితోపాటు ఖానాపూర్ నియోజకవర్గంలోనూ గులాబీ పార్టీ ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరడం అధికార పార్టీలో అసమ్మతి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది.



టికెట్ల కేటాయింపుపై ఆశావహుల్లో అసంతృప్తి

- వేరే పార్టీలోకి అధికార పార్టీ నేతలు
- మంచిర్యాల టికెట్ బీసీలకివ్వాలని డిమాండ్
- స్వతంత్రంగా బీసీ అభ్యర్థిని బరిలో నిలిపేందుకు సమాయత్తం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా ఏడింటిలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే బీఆర్ఎస్ అధిష్టానం మళ్లీ టికెట్లు కేటాయించింది. ఖానాపూర్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లను మార్చి కొత్త వారికి టికెట్లు ఇచ్చింది. మార్చిన స్థానాలతోపాటు తాజాగా సిట్టింగ్‌లకు కేటాయించిన స్థానాల్లోనూ ఈసారి తమకు పార్టీ టికెట్లు వస్తాయని అనేక మంది ఆశావహులు ఆశలు పెట్టుకున్నారు. మూడు స్థానాల్లో మినహా మిగతా చోట్ల కొత్త వారిని అధిష్టానం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో ఆయా స్థానాలు ఆశించిన పలువురు నేతలు అసంతృప్తిలో ఉన్నారు. మంచిర్యాలలో సిట్టింగ్ ఎమ్మెల్యే దివాకర్‌రావుకు మరోసారి టికెట్ దక్కింది. ఈ స్థానం నుంచి మాజీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పుస్కూరి రామ్మోహన్‌రావు ఆశించారు. కానీ అధిష్టానం ఈయన పేరును పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో ఆయన అనుచరులు, ముఖ్య కార్యకర్తలు గులాబీ పార్టీని వీడి హస్తం పార్టీలో చేరిపోయారు. ఖానాపూర్ నియోజకవర్గంలోనూ పలువురు బీఆర్ఎస్ పార్టీనీ వీడారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు టికెట్ లభించకపోడంతో ఆమె అనుచరులు, నాయకులు కొందరు కాంగ్రెస్‌లో చేరారు. జన్నారం మాజీ ఎంపీపీ శంకరయ్య, అనుచరులు హస్తం పార్టీలో చేరిపోయారు. కడెం మండలంలోనూ పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముధోల్‌లోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి అసమ్మతి సెగ తగిలింది. అయనకు టికెట్ ఇవ్వకూడదని ఆ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఇలా పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ టికెట్లు దక్కని వారు అధిష్టానం తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉండగా.. మరికొందరు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది.

మంచిర్యాలలో ఏకతాటిపై బీసీలు..!

మంచిర్యాల నియోజకవర్గంలో 20ఏండ్లకు పైబడి అగ్రవర్ణాలే ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ప్రధాన పార్టీలన్నీ వారికే టికెట్లు కేటాయించడంతో ఇందులో ఎవరు గెలిచినా అగ్రవర్ణాల వ్యక్తే ఎమ్మెల్యేగా ఉంటున్నారని బీసీలు భావిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో బీసీల ఓట్లు గణనీయంగా ఉన్నప్పటికీ చట్టసభల్లో ప్రాతినిధ్యం లభించడం లేదు. గతంలో లక్షెట్టిపేట నియోజకవర్గం ఉన్న సమయంలో 1978లో జనతా పార్టీ నుంచి చుంచు లక్ష్మయ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ బీసీల ప్రాతినిధ్యం లేకుండా పోయింది. నియోజకవర్గాల పునర్విభజనలో మంచిర్యాల నియోజకవర్గ కేంద్రంగా మారినా.. పరిస్థితిలో మార్పులు రావడం లేదని బీసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మెజార్టీ సామాజిక తరగతులైన పెరిక, మున్నూరుకాపు, పద్మశాలి, ముదిరాజ్, యాదవులు, గౌడ్ తదితర బీసీ తరగతులందరూ ఏకమై మంచిర్యాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అధికార బీఆర్ఎస్ పార్టీ టికెట్ బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి సైతం బీసీలకు టికెట్ కేటాయించాలని డిమాండ్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రానున్న ఎన్నికల్లో బీసీ వ్యక్తిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపి మద్దతు తెలుపుతామని ప్రకటించారు.

గెలుపు గుర్రాలకే టికెట్

కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ పరిశీలన

- మొదటి లిస్టులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నలుగురి పేర్లు
- క్షేత్రస్థాయిలో పని చేసుకోవాలని అధిష్టానం నుంచి ఆదేశాలు
- ప్రచారానికి సమాయత్తం అవుతున్న ఆశావహులు



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను ఇప్పటికే ఎలక్షన్ కమిటీ పరిశీలించింది. మొదటి జాబితాలో 40 మంది పేర్లను ఏఐసీసీకి పంపింది. ఈ లిస్టులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కినట్టు సమాచారం. వీరిని క్షేత్రస్థాయిలో పని చేసుకోవాలని అధిష్టానం నుంచి సంకేతాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఆశావహులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ తమ పనిలో నిమగ్న ఎయ్యారు.

గతంలో ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోట. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, బీఆర్ఎస్ దూకుడుతో జిల్లాలో కాంగ్రెస్ చతికిల పడింది. ముఖ్య నేతలు గులాబీ గూటికి చేరడంతో ఆ పార్టీకి నాయకత్వం వహించేవారే లేకుండా పోయారు. అయితే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను నమ్ముకున్న కార్యకర్తలు మాత్రం పార్టీ జెండా వీడలేదు. ప్రస్తుతం మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో జిల్లాలో మళ్లీ కాంగ్రెస్ పుంజుకుంది. పార్టీ అగ్రనేత రాహుల్ చేపట్టిన జోడో యాత్రతో క్యాడర్‌లో జోష్ పెరిగింది. దీనికితోడు బీజేపీ నేత, మాజీ మంత్రి చంద్రశేఖర్‌తోపాటు పలువురు ముఖ్య నేతలు కాంగ్రెస్ గూటికి చేరడంతో పార్టీ పూర్వ వైభవం వైపు అడుగులు వేస్తోందన్న అభిప్రాయం ఆపార్టీలో వ్యక్తమవుతోంది. అలాగే చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభ విజయవంతం కావడం కూడా పార్టీకి కలిసొచ్చే అంశం. ఇదే క్రమంలో ఆశావహులు సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఒక్కో నియోజకవర్గం నుంచి పదుల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. అయితే బలమైన లీడర్‌కు టికెట్ ఇచ్చి ఉమ్మడి జిల్లాలో అత్యధిక సీట్లు గెలవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అడుగులు వేస్తోంది.

ప్రజాదరణ కలిగిన నాయకులకు టికెట్

క్షేత్రస్థాయిలో పట్టున్న నాయకులనే బరిలో నిలిపేందుకు కాంగ్రెస్ అధిష్టానం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఒక్కో నియోజకవర్గంలో పదుల సంఖ్యలో సర్వేలు చేయించింది. అభ్యర్థిత్వానికి దరఖాస్తులు చేసుకున్న నాయకులపై ఇటీవల మరోసారి సర్వేలు చేయించింది. అయితే సర్వే రిపోర్టుతో పాటు అధికార బీఆర్ఎస్ అభ్యర్థిని ఢీకొట్టేందుకు అంగబలం, అర్థబలం ఉన్న నాయకుడినే బరిలో నిలిపేందుకు అధిష్టానం మొగ్గు చూపుతోంది.

మొదటి లిస్టులో నలుగురి పేర్లు ఖరారు ?

రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా మొదటి లిస్టులో 40 మంది జాబితాను కాంగ్రెస్ రాష్ట్ర ఎలక్షన్ కమిటీ ఏఐసీసీకి పంపింది. ఈ 40 మంది జాబితాలో ఎలాంటి మార్పులు ఉండే అవకాశం లేదని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నారు. అయితే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వికారాబాద్ నియోజవకర్గం నుంచి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, పరిగి నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, షాద్‌నగర్ నుంచి వీర్లపల్లి శంకర్, ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్లు అధిష్టానం ఆమోదం కోసం పంపింది. వీరిని క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై ఎన్నికలకు సిద్ధం కావాలని గాంధీ భవన్ నుంచి సంకేతాలు పంపినట్టు సమాచారం.



కార్మికుల వేతన బకాయి చెల్లించాలి

- సిరిసిల్లలో డివైడర్, పార్కుల పారిశుధ్య సిబ్బంది నిరసన

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని డివైడర్, పార్కుల్లో పనిచేస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్ మాట్లాడుతూ.. నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. నెలనెలా వేతనాలు అందకపోవడంతో కార్మికులు పస్తులుండి పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగిన ప్రతిసారీ బిల్లులు రాలేదని, వచ్చిన తర్వాత అందిస్తామని కాంట్రాక్టర్లు చెప్పడం పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిలదీసే అడిగితే పని నుంచి తొలగిస్తామని బెదిరించడం దారుణమన్నారు. ఓ కార్మికురాలి భర్త వైద్యం కోసం డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఆమెకు రావలసిన వేతనం వస్తే భర్తకు వైద్యం చేయించాలని చూస్తోందని వాపోయారు. ఇప్పటికైనా కార్మికులకు బకాయి వేతనం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.



ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ ఉద్యోగుల ఆందోళన

- మోకాళ్లపై కూర్చొని నిరసన
- తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్

నవతెలంగాణ- విలేకరులు

ఎన్‌హెచ్‌ఎం స్కీములో పని చేస్తున్న అకౌంటెంట్స్, డీఈఓలు, సపోర్టింగ్ స్టాఫ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని హైదరాబాద్ కోఠి డీఎంహెచ్ఎస్ క్యాంపస్ ఆవరణలో బుధవారం ధర్నా చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 7వ రోజు ఆందోళన కొనసాగించారు. మోకాళ్ళ మీద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు బాల సుబ్రహ్మణ్యం శ్రీమణి, శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. ఉద్యోగులకు సమన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భార్గవి, లోకేష్, ప్రకాష్, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఎన్ఎహెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి కుమురంభీం చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు.

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి నుంచి ప్రాణహాని

- 20 ఎకరాల భూమిపై కన్నేసిన ఎమ్మెల్యే
- న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం
- నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ భూక్యా తిరుపతి నాయక్ ఆరోపణ
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ న్యాయం చేయాలని విజ్ఞప్తి

నవతెలంగాణ- హిమాయత్‌నగర్



జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని, ప్రభుత్వం తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని జనగామ జిల్లా, తరిగొప్పుల మండలం బొత్తలపర్రె గ్రామానికి చెందిన బాధితుడు, నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ భూక్యా తిరుపతి నాయక్, అతని భార్య మౌనిక అన్నారు. తమకు న్యాయం చేయాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. బొత్తలపర్రె గ్రామంలో సర్వే నెం.49లోని తమ 20 ఎకరాల వ్యవసాయ భూమిపై ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కన్నేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 30 ఏండ్ల కిందట భూమి అమ్ముకుని వెళ్లిన సమీప బంధువులను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తనపై, తన కుటుంబంపై ఉసిగొల్పి దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ 20 ఎకరాల భూమిని ఎమ్మెల్యే తన పలుకుబడితో అనుచరుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రికార్డుల్లో తన భూమి కనిపించకుండా పోయిందన్నారు. ఈ విషయమై జనగామ ఏసీపీ దేవేందర్ రెడ్డిని కలువగా "దున్నే వాడిదే భూమి" అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బెదిరింపులకు గురిచేశారని చెప్పారు. గతంలో తనపై మూడుసార్లు హత్యాయత్నం జరిగినట్టు చెప్పారు. వారం కిందట ఎమ్మెల్యే అనుచరులు తన వ్యవసాయ బావి దగ్గర మోటారు వైర్లు కట్ చేసి విద్యుత్ సరఫరా నిలిపేసి దాడికి పాల్పడ్డారన్నారు. తనపై, వృద్ధులైన తన తల్లిదండ్రులపై దాడులు జరుగుతున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, తన తల్లిదండ్రులకు ఏం జరిగినా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి బాధ్యత వహించాలని హెచ్చరించారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానన్నారు. ఈ విషయంపై త్వరలో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి.. అనంతరం గవర్నర్‌కు వినతిపత్రం సమర్పిస్తానని తిరుపతి నాయక్ తెలిపారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని, లేకపోతే కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుంటామని కన్నీటి పర్యంతమయ్యారు.

ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

- భయంతో ప్రయాణికుల పరుగులు
- మరమ్మతులు చేపట్టి, యథాతథంగా ప్రయాణం

నవతెలంగాణ-కురవి

సికింద్రాబాద్-విజయవాడ మీదుగా హౌరా వెళ్లే ఈస్ట్‌కోస్ట్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఉన్నట్టుండి పొగలు రావడంతో మరమ్మత్తులు చేయడంతో ప్రమాదం తప్పింది. ఈ రైలు మహబూబాబాద్ జిల్లా గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం 12:45 నిమిషాల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలులో బ్రేక్ లైనర్స్ పట్టివేయడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి రైలును వెంటనే నిలిపివేశారు. ప్రయాణికులు భయంతో రైల్లోంచి దిగి పరుగులు తీశారు. కాగా, రైలులో సాంకేతిక లోపాలను సరి చేయడంతో యథాతథంగా రైలు వెళ్ళిపోయినట్టు స్టేషన్ గార్డు తెలిపారు.



విడదీసి పాలిస్తున్న.. ఎమ్మెల్యే రెడ్యానాయక్ వైఖరి మారాలి

- మండిపడ్డ మంత్రి అనుచరులు

నవతెలంగాణ-మరిపెడ

డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ బీఆర్ఎస్ పార్టీని విడదీసి పాలిస్తున్నారని, ఇప్పటికైనా వారి వైఖరిలో మార్పు రావాలని మంత్రి సత్యవతి రాథోడ్ అనుచరులు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబరీష, మరిపెడ మేజర్ గ్రామ మాజీ సర్పంచ్ పానుగోతు రామ్ లాల్, మెంచు అశోక్, అబ్బల్ పాషాలతో కలిసి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ పర్యటించిన ప్రాంతంలో ఎక్కడ గొడవ జరిగినా మంత్రి సత్యవతి అనుచరులే గొడవలు చేస్తున్నారని ఆమెపై బహిరంగ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మంత్రి 2018 ఎమ్మెల్యే ఎన్నికల్లో తనకు సపోర్ట్ చేయలేదని ఎమ్మెల్యే ఆరోపించడం సరైంది కాదన్నారు. ఆమె లేకపోతే మీరు గెలిచే వారా.. అని ప్రశ్నించారు. వాళ్ల పాత తెలుగుదేశం పార్టీ వాళ్ళు, తాము పాత కాంగ్రెస్ పార్టీవాళ్లమంటూ రెండు గ్రూపుల మధ్య గెట్టుపెట్టి బీఆర్ఎస్ పార్టీని విభజించి పాలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆయన కింద కమిటీ వేసుకొని ఆ కమిటీ చెప్పిన వాళ్ళకే సంక్షేమ పథకాలు ఇస్తున్నారని, మంత్రి అనుచర గ్రామాలకు ఇవ్వడం లేదని విమర్శించారు. మా గ్రామాల ప్రజలు అర్హులు కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఏమొచ్చినా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, గ్రంథాలయ చైర్మెన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉన్న గ్రామాలకే పెడతారన్నారు. వారు చేసే తప్పిదాలపై ప్రభుత్వం దగ్గర నివేదిక ఉందని, ఇప్పటికైనా పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్తనూ కలుపుకొని పని చేయాలని కోరారు.

కవి, గాయకుడు జయరాజ్‌కు 'కాళోజీ' అవార్డు

- ఎంపిక చేసిన సీఎం కేసీఆర్
- 9న కాళోజీ జయంతి కార్యక్రమంలో ప్రదానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పద్మ విభూషణ్ ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా ప్రకటించే "కాళోజీ నారాయణ రావు అవార్డు"-2023 ప్రముఖ కవి, పాటల రచయిత, గాయకుడు జయరాజ్‌కు దక్కింది. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ కాళోజీ అవార్డు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫారసుల మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు కవి జయరాజ్‌ను ఎంపిక చేశారు. ఈనెల 9న శనివారం కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే అధికారిక కార్యక్రమంలో జయరాజ్‌కు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. దీని ద్వారా రూ.1,01,116 నగదు రివార్డు, జ్ఞాపికను అందించి దుశ్శాలువాతో సత్కరిస్తారు. ఉమ్మడి వరంగల్, నేటి మహబూబాబాద్ జిల్లాకు చెందిన జయరాజ్ (60) చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలను అధిగమించి కవిగా పేరు తెచ్చుకున్నారు. పేద దళిత కుటుంబానికి చెందిన ఆయన వివక్షత లేని సమసమాజం కోసం సాహిత్యాన్ని సృజించారు. బుద్ధుని బోధనలకు ప్రభావితమై అంబేద్కర్ రచనలతో ఆయన స్ఫూర్తి పొందారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పల్లె పల్లెనా తిరుగుతూ ఆయన ఆట, పాట, గానం ద్వారా ప్రజల్లో సాంస్కృతిక ఉద్యమ భావజాలాన్ని రగిలించారు. ప్రకృతి గొప్పతనాన్ని వర్ణిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం పలు పాటలు రచించారు. మనిషికీ ప్రకృతికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని ఆయన తన సాహిత్యం ద్వారా సున్నితంగా విశ్లేషించారు. ఆయన ముద్రించిన పలు పుస్తకాలు ప్రజాదరణ పొందాయి.

ఆ లేఖలో మహిళా బిల్లు ప్రస్తావన ఎందుకు లేదు?

- సోనియాగాంధీకి ఎమ్మెల్సీ కవిత ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో చర్చించేందుకు 9 అంశాలను ప్రతిపాదిస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి సోనియాగాంధీ లేఖ రాశారనీ, అందులో మహిళా బిల్లు ప్రస్తావన ఎందుకు చేయలేదని ఎమ్మెల్సీ కల్వకుంట కవిత సోనియాగాంధీని ప్రశ్నించారు. ఇదే అంశంపై బుధవారం ట్వీట్ చేశారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశం కాదా? అని అడిగారు. మహిళా బిల్లును కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా విస్మరిస్తున్నదని పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఇద్దరు విద్యార్థినులు మృతి

- శోకసంద్రంలో ఇరు కుటుంబాలు
- ఘటనపై పలు అనుమానాలు
- ఆకతాయిలు ఫొటోలను మార్ఫింగ్ చేయడం వల్లే..?

నవ తెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరు డిగ్రీ విద్యార్థినులు పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన ఎనగతుల మనిషా(20), నక్కలపల్లి గ్రామానికి చెందిన దంతరబోయిన శివాని(20) నలగొండలోని మహిళా డిగ్రీ కళాశాలలో బిజెడ్‌సి సెకండ్ ఇయర్ చదువుతున్నారు. ఇద్దరూ నార్కట్‌పల్లిలోని ఒకే కాలేజీలో కలిసి ఇంటర్ చదివారు. అప్పటి నుంచి స్నేహితులు. కాగా ఇద్దరికీ నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాలలోనే సీటు లభించడంతో అదే స్నేహాన్ని కొనసాగిస్తూ ఓ హాస్టల్‌లో కలిసి ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. అయితే, 20 రోజుల కిందట ఇరువురూ ఇంటికి వెళ్లారు. కళాశాలలో పరీక్షలు ఉండటంతో మంగళవారం ఇద్దరూ తిరిగి నల్లగొండకు వచ్చారు. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల వెనకాల ఉన్న రాజీవ్ పార్క్‌లో గడ్డి మందు తాగారు. పార్కు బయటకు వచ్చి ఇద్దరూ స్పృహ తప్పి పడిపోవడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని 108 ద్వారా వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరూ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. అయితే, వాట్సప్ అకౌంట్‌కు వారు డీపీగా పెట్టుకున్న ఫొటోలను గుర్తుతెలియని వ్యక్తులు అశ్లీలంగా మార్చి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతోపాటు బెదిరించడం వల్లే విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



(ఫైల్)

మిన్నంటిన రోదనలు

ఉన్నత విద్యాభ్యాసం చదువుతున్న తమ పిల్లలు ఉన్నతంగా ఎదుగుతారని ఆశించిన తరుణంలో ఆత్మహత్య చేసుకోవడం ఆ కుటుంబాలను కలిచి వేసింది. కుటుంబ సభ్యుల రోదనలతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణమంతా శోకసంద్రంలో మునిగిపోయింది.

విద్యార్థినుల మృతిపై అనుమానాలు

డిగ్రీ విద్యార్థినుల ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మనిషా, శివాని నాలుగేండ్లుగా కలిసి చదువుకుంటున్నారు. అయితే, ఇద్దరూ ప్రణాళిక ప్రకారమే ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇద్దరి చాటింగ్‌ను గమనిస్తే.. ముందుగానే ఆత్మహత్యకు ప్లాన్ వేసుకున్నట్టు గుర్తించారు. శివాని ఓ ఫర్టిలైజర్ షాపు వద్దకు వెళ్లి గడ్డి మందు అడగ్గా.. వారు అమ్మనని చెప్పడంతో మా అమ్మ ఇమ్మంటుందని మనిషాకు ఫోన్ చేసి తల్లి, బిడ్డల్లాగా ఫోన్ మాట్లాడుకోవడంతో ఆ షాపు యజమాని నమ్మి మందు విక్రయించినట్టు తెలిసింది. చాటింగ్‌లో కూడా తెల్లవారుజామున ఇద్దరు మెసేజ్ చేసుకుని.. ఇంత పొద్దుగాల షాపులు తీయరు కదా అని మాట్లాడుకుని షాపులు తీసిన తర్వాత మందు కొనుగోలు చేసి ఆత్మహత్యాయత్నం చేసినట్టు తెలుస్తోంది. వారి మృతికి కారణాలపై పోలీసులు పలు కోణాల్లో విచారిస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

విద్యార్థినుల ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు వరలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసన్న మాట్లాడారు. ఉమెన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు శివాని, మనిషా ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. ఇన్‌స్టాగ్రాంలో ఫొటోలను అశ్లీలకరంగా మార్ఫింగ్ చేసి రూ.15 లక్షలు ఇవ్వాలంటూ విద్యార్థినులను బ్లాక్‌మెయిల్ చేసిన వారిపై సమగ్ర విచారణ చేపట్టి శిక్షించాలని డిమాండ్ చేశారు.

రేపటినుంచి సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు



తొలిరోజు విద్యార్థుల ప్రదర్శన, బహిరంగసభ

- ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను
- బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం సంక్షోభం
- సమస్యల పరిష్కారానికి భవిష్యత్ పోరాటాల రూపకల్పన : రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, నాగరాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు సంగారెడ్డిలో జరగనున్నాయి. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ ప్లీనరీ సమావేశాల తొలి రోజు విద్యార్థుల ప్రదర్శన, బహిరంగ సభను నిర్వహిస్తున్నామనీ, దీనికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను హాజరవుతారని చెప్పారు. రెండోరోజు శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతినిధులతో సభ జరుగుతుందన్నారు. మూడోరోజు ఆదివారం విద్యారంగం, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి భవిష్యత్ పోరాటాలను రూపకల్పన చేస్తామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగం సమస్యల వలయంలో చిక్కుకుందని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు అభివృద్ధి లేదన్నారు. పాఠశాలల్లో 24 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 5,089 పోస్టులనే భర్తీ చేయడం సరైంది కాదని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో 5,552 అధ్యాపక పోస్టులు, బోధనేతర సిబ్బంది ఖాళీలు న్నాయని వివరించారు. ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందలేదని విమర్శించారు. విద్యారంగంలో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలున్నాయనీ, మెరుగైన సౌకర్యాలు కల్పించడం లేదని చెప్పారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సైకిల్ జాతాలు, పాదయాత్రలు, జీపు జాతాల ద్వారా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. పూర్తిస్థాయిలో సర్వేలు చేశామనీ, ప్రభుత్వ విద్యా సంస్థలు సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు, ప్రహరీగోడలు, కరెంటు, రన్నింగ్ వాటర్, సైకిల్ స్టాండ్లు, రవాణా సౌకర్యం, హాస్టళ్ల లేక అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కంప్యూటర్లు లేవనీ, స్కావెంజర్లను నియమించలేదని అన్నారు. మన ఊరు-మనబడి ద్వారా పాఠశాలలు బాగుపడకుండా కాంట్రాక్టర్లు నిధులను దండుకుంటున్నారని విమర్శించారు. మెస్‌చార్జీలను పెంచామంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికీ వాటిని అమలు చేయడం లేదన్నారు. పరోక్షంగా నూతన విద్యావిధానానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలియజేస్తున్నదని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో సంక్షేమం కరువైందనీ, అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాలున్నాయని అన్నారు. గురుకులాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని కోరారు. ఆ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె రమేష్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీమాన్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫేస్ రికగ్నిషన్ హాజరు

- వారంరోజుల్లో అమలు చేసే అవకాశం
- ప్రత్యేక యాప్ రూపకల్పనలో విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉన్న ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులందరికీ ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానం (ఎఫ్ఆర్ఏఎస్) అమలు కానుంది. ఈ కొత్త విధానాన్ని వారం రోజుల్లో అమల్లోకి తేవాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపకల్పన చేసే పనిలో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. అయితే ప్రభుత్వ, పంచాయతీరాజ్, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, తెలంగాణ గురుకుల విద్యాసంస్థల్లోని విద్యార్థులందరికీ ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని అమలు చేయనున్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వారి మొబైల్ ఫోన్లలో ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. దాని ఆధారంగా హాజరును విద్యాశాఖకు పంపించాల్సి ఉంటుంది. అయితే ప్రతి పీరియెడ్‌కు కాకుండా మొదటి పీరియెడ్‌కే ప్రస్తుతానికి ఈ హాజరును వర్తింపచేయనున్నారు. భవిష్యత్తులో అన్ని పీరియెడ్లకు వర్తించే అవకాశమున్నది. రాష్ట్రంలో 26,815 ప్రభుత్వ పాఠశాలల్లో 23,35,952 మంది విద్యార్థులు చదువుతున్నారు.

సంపాదకీయం

వైఖరేంటి మహాశయా..?

జమిలీ ఎన్నికలు, ఇండియా పేరును, భారత్‌గా మార్చటం తదితర అంశాలతో కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రజా సమస్యలను పూర్తిగా పక్కదోవ పట్టిస్తోంది. వాటికి సంబంధించి దూకుడుగా వ్యవహరిస్తూ దేశాన్ని, ప్రజలను ప్రతీరోజూ అయోమయానికి, గందరగోళానికి గురిచేస్తోంది. ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతం ద్వారా తయారు చేసిన కొంగొత్త ఇంజక్షన్లను, విషపుచుక్కలను ప్రజల మెదళ్లలోకి ఎక్కించటం ద్వారా వాటిని మరోసారి మొద్దుబార్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. తద్వారా 2024 పార్లమెంటు ఎన్నికల్లో తేలిగ్గా గట్టెక్కేందుకు దారుణమైన దారులను కాషాయదళం సిద్ధం చేసుకుంటోంది. ఈ విషయాలన్నింటిపై యావత్ దేశం గళమెత్తుతోంది. బీజేపీని ఓడిచేందుకు 'ఇండియా' తన సర్వశక్తులనూ ఒడ్డుతోంది. కానీ దేశంలో సమూల మార్పులు రావాలంటూ పదే పదే చెప్పే బీఆర్ఎస్ వైఖరి మాత్రం ఇందుకు భిన్నంగా ఉండటం గమనార్హం.

> 'ఊరందరిదీ ఒక దారి... ఉలిపి కట్టెది మరో దారన్నట్టు' ఇప్పుడు జమిలి ఎన్నికలు, దేశ పేరు మార్పుపై సర్వత్రా చర్చ కొనసాగుతున్న తరుణంలోనూ బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నోరు మెదపక పోవటం గమనార్హం. పైగా వారి తర్వాత అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ కీలక పాత్ర పోషించే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి స్థాయి వ్యక్తులు జమిలి మంచిదే... కానీ దానిపై లోతుగా చర్చ జరగాలంటూ ప్రకటించటం మరో వింత. ఇదే బీఆర్ఎస్ వైఖరిలోని డొల్లతనాన్ని తెలియజేస్తోంది.

ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి కమ్యూనిస్టుల వరకూ... డీఎంకే నుంచి ఎన్సీపీ దాకా ముక్తకంఠంతో కమలనాథుల దుర్నీతిని ఎండగడుతున్నాయి. కానీ ఘనత వహించిన మన బీఆర్ఎస్ బాస్ మాత్రం 'గప్‌చుప్ సాంబారు బుడ్డీ...' అనుకుంటూ గమ్మున కూకుండి పోయారు. ఆ మధ్య మహారాష్ట్ర పర్యటనలో నేను అధికార ఎన్డీయే కూటమికి, ప్రతిపక్ష ఇండియా కూటమికి సమదూరం పాటిస్తానంటూ ఆయన నొక్కి వక్కాణించిన విషయం సర్వ జనులందరికీ ఎరుకే. ఈ రెంటికీ సమదూరం పాటిస్తానంటూ బీరాలు పలికిన గులాబీ అధినేత... క్రమక్రమంగా కమల దళానికి దగ్గరవుతున్నారనేది సుస్పష్టం. అయితే ఎన్నికలు, రాజకీయ ప్రయోజనాలు, ఓట్లు, సీట్లు, కేసులు, కమీషన్ల కక్కుర్తిలో బూర్జువా పార్టీలు తమ తమ సిద్ధాంతాలను, విధానాలను గాలికొదిలేసిన దృష్టాంతాలు కోకొల్లలు. అలా విధానాలు, వైఖరులకు తిలోదకాలివ్వటంలో గులాబీ పార్టీది అందెవేసిన చెయ్యి. కానీ గతంలో ఫెడరల్ ఫ్రంట్ అనీ, ఇప్పుడు భారత రాష్ట్ర సమితి అంటూ బీరాలు పలుకుతూ... యావత్ దేశాన్నే మార్చేస్తానంటూ సవాళ్లు విసురుతున్న కారు పార్టీ, దాని సారు అత్యంత కీలకమైన సందర్భాల్లో తోక ముడుస్తుండటం విస్తుగొలిపే అంశం.



గతంలో పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ మొదలుకుని అనేక విషయాల్లో కేంద్రానికి మొట్టమొదటగా బీజేపీకి మద్దతిచ్చింది బీఆర్ఎస్సే. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామమందిరం తదితర సందర్భాల్లో సైతం ఆ పార్టీ గోడమీది పిల్లి వాటాన్ని ప్రదర్శించిందే తప్ప తన వైఖరిని ఎక్కడా వెల్లడించలేదు. రైతు చట్టాల విషయంలో ఇదే తంతు నడిచింది. వాటిని వెనక్కు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తూ ఆ పార్టీ ఆధ్వర్యాన రాస్తారోకోలు, రహదారుల దిగ్బంధనాలను చేపట్టారు. ఆ తర్వాత ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అన్నదాతలతో ఆందోళన సాగిస్తానంటూ ప్రకటించిన అధినేత... ఆ తర్వాత ఆ సంగతే మరిచారు. ఆందోళన స్థానంలో బాధిత రైతు కుటుంబాలకు చెక్కులనివ్వటం ద్వారా తాను 'రైతు బాంధవుడి'ననే పేరు తెచ్చుకోవటం కోసం తెగ తాపత్రయపడ్డారు. దేశ శ్రేయస్సు, ప్రజలకు మంచి జరగాలన్న ఉద్దేశంతోనే 'పెద్ద నోట్ల రద్దు... జీఎస్టీ'కి జై కొట్టామంటూ చిన్న సారు కేటీఆర్ పలుమార్లు మీడియాకు సర్ది చెప్పుకొచ్చారు. దేశం కోసం, ధర్మం కోసం అంటూ యావత్ భారతాన్నే కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీ సర్కార్ తీరు తెన్నులు తెలిసి కూడా మొదట జై కొట్టటం... ఆ తర్వాత నాలుక్కరుచుకోవటం, అలా నటించడాన్ని గులాబీ పార్టీ బాగా ఒంటపట్టించుకున్నది.

'ఊరందరిదీ ఒక దారి... ఉలిపి కట్టెది మరో దారన్నట్టు' ఇప్పుడు జమిలి ఎన్నికలు, దేశ పేరు మార్పుపై సర్వత్రా చర్చ కొనసాగుతున్న తరుణంలోనూ బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నోరు మెదపక పోవటం గమనార్హం. పైగా వారి తర్వాత అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ కీలక పాత్ర పోషించే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి స్థాయి వ్యక్తులు జమిలి మంచిదే... కానీ దానిపై లోతుగా చర్చ జరగాలంటూ ప్రకటించటం మరో వింత. ఇదే బీఆర్ఎస్ వైఖరిలోని డొల్లతనాన్ని తెలియజేస్తోంది. భారత రాష్ట్ర సమితి అని చెప్పుకుంటూ... ఆ పేరుతో దేశాన్ని ఉద్ధరిస్తానని తిరుగుతూ జాతీయ స్థాయిలో ప్రభావితం చేసే అంశాలపట్ల, ప్రజలకు, ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతున్న సమయాల్లో స్పందించకపోవటమంటే అది పరోక్షంగా ఢిల్లీలోని పాలకపక్షానికి సహకరించటమే. అంతిమంగా అది కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణకు, ఇక్కడి కోట్లాది మంది ప్రజలకు శాపమే... శరాఘాతమే. 'అందుకే ఓ మహాశయా...' మీ వైఖరేంటో తెలంగాణ ప్రజలకు ఇకనైనా జర చెప్పండి.

స్టాండ్ విత్ స్టాలిన్

> కుల దురహంకారులు నాడు నేడు కూడా తమ క్రూరత్వం కనపడకుండా ఉండటానికి ఈ సనాతన ధర్మం అనే పదాన్ని చాకచక్యంగా వాడుకుంటూనే ఉన్నారు. అందువలన ఈ చర్చ కొత్తది కాదు, తేడా ఏమంటే గతంతో పోల్చినప్పుడు ఈ మనువాద శక్తులు అనేక రెట్లు బలం పుంజుకున్నాయి. కేంద్రంలో అధికారంలోకి వచ్చాయి. అనేక ప్రభుత్వ సంస్థలని, పరిపాలన వ్యవస్థలని ఆక్రమించుకుంటున్నాయి. ఈ స్థితి నుంచి వారు చేసే దాడి బలంగా, విస్తారంగా ఉంటుంది. అందువలన ఈ శక్తులకు వ్యతిరేకంగా సామాజిక, లౌకిక, ప్రజాతంత్ర శక్తులన్నీ ఒక తాటి మీదకు రావాలి.

> హిందూత్వ శక్తుల దాడి తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు ప్రతి దాడి కూడా అన్ని పార్శ్వాలలో తీవ్రంగా ఉండాలి. అందుకు కావలసినంత సాహిత్యం, సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం మన కున్నాయి. బీజేపీ ముందుకు తెస్తున్న అనేక వాదనలను, చరిత్ర వక్రీకరణను అనేక మంది మేధావులు పూర్వపక్షం చేస్తున్నారు. అన్నింటినీ మించి కుల దురభిమానాన్ని భరించలేని జనం వున్నారు. అందువలన హిందూత్వ శక్తుల విషప్రచారాన్ని స్టాలిన్ వంటి వారే, కాదు, ప్రతి భారతీయుడు నిలబడేటట్లు చేయాల్సిన బాధ్యత వామపక్ష ప్రజాతంత్రశక్తుల మీద వుంటుంది.

తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు, ఆ రాష్ట్ర మంత్రి ఉదయ నిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే లేపాయి. సాంఘిక మాధ్యమాన్ని ఊపేస్తున్నాయి. హిందుత్వశక్తులు, వీరందరి రాజకీయ ముఖమైన బీజేపీ దాని నాయకులు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. అనేక లౌకిక పార్టీలు, లౌకిక మేధావులు రకరకాలుగా స్పందిస్తున్నారు. కొందరు ఆయన వాదనలను బలపరుస్తుంటే, మరికొందరు స్టాలిన్ వ్యాఖ్యలు ఇప్పుడిప్పుడే బీజేపీకి వ్యతిరేకంగా అఖిల భారత స్థాయిలో కూడుతున్న ఇండియా కూటమిపైకి దాడి చేసే అవకాశం బీజేపీకి ఇచ్చినట్లు అయిందని బాధ వ్యక్తం చేస్తున్నారు. నిజానికి స్టాలిన్ అన్న మాటలు కొత్తవేమీ కాదు. గతంలో అనేక మంది తత్వవేత్తలు, సామాజిక ఉద్యమ కారులు పదేపదే చెప్పిన విషయాల్ని ఆయన చెప్పారు. తమిళనాడు అభ్యుదయ రచయితలు, కళాకారుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ దోమలు, డెంగ్యూ, మలేరియా లేక కరోనా వైరస్ వంటి వాటిని తుడిచిపెట్టినట్లుగానే సనాతన ధర్మాన్ని కూడా తుడిచి పెట్టాలని, కేవలం వ్యతిరేకిస్తే సరిపోదని వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ సోషల్ మీడియా దాడి ప్రారంభించింది. రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా, జెపీ నడ్డా స్థాయి నాయకులు స్టాలిన్ మీద, ఆయన పార్టీ అయిన డీఎంకే మీద, దాని భాగస్వామ్యపక్షమైన కాంగ్రెస్ మీద, వీరందరూ కలిసి నిర్మిస్తున్న ఇండియా కూటమి మీద తీవ్రమైన ఆక్రోషం వెలిబుచ్చారు. ఇండియా కూటమిని ఎలా ఎదుర్కోవాలి అని మల్లగుల్లాలు పడుతున్న బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ హిందుత్వశక్తులు ఈ అంశాన్ని వినియోగించుకోవాలని ఆరాటపడుతున్నాయి.



ఆర్. రఘు
9490098422

ఇది అనాదిగా ఉన్న చర్చ

హిందూమతానికి తొలి రూపమైన బ్రాహ్మణ, వైదిక మతాలపైన గౌతమ బుద్ధుడు మూడువేల సంవత్సరాల క్రితమే ఈ పోరాటం ప్రారంభించాడు. బ్రాహ్మణ మత సిద్ధాంతాన్ని చార్వాకులు, లోకాయతులు, సాంఖ్యులు ఇటువంటి అనేకమంది తాత్వికులు తీవ్రంగా వ్యతిరేకించారు. వీరందరినీ భౌతికంగా అణిచివేస్తూ వారి అమూల్యమైన సాహిత్యాన్ని ధ్వంసం చేస్తున్న క్రమంలో హిందూ మతం అనేది రూపం తీసుకుంది. హిందూమతానికి కుల వ్యవస్థకు విడదీయరాని సంబంధం ఉంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధంపై బ్రాహ్మణాధిక్యతను ప్రేరేపించే హిందూ మతం సాగించిన ప్రతీఘాత విప్లవం నుండే పురాతన సమాజాన్ని అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నాడు. ఈ వాదనతో ప్రముఖ మార్క్సిస్టు చరిత్రకారులు రొమిల్లా థాపర్, డిఎన్ ఝా, జైస్వాల్ వంటి వారు ఏకీభవిస్తున్నారు. క్రీస్తు శకం 14వ శతాబ్దం నుండి ఈ బ్రాహ్మణాధిక్య సమాజం సృష్టిస్తున్న మతాధిక్యవాదంపై మరోసారి కెరటంలా వ్యతిరేకత పెల్లుబుకింది. యోగివేమన, పోతులూరి వీరబ్రహ్మం వంటి వారు మన రాష్ట్రంలో, బసవన్న వంటి వారు కర్నాటకలో, రవిదాసు, గురునానక్ వంటి వారు పంజాబ్ ప్రాంతంలో, ఆ తరువాత కేరళలో నారాయణ గురు వంటి వారు కులవ్యవస్థ మీద, దానికి అండగా నిలిచే హిందూ మత భావజాలం పైన పోరాడారు. గురునానక్ కొత్తగా సిక్కు మతాన్ని ప్రారంభించాడు. వీరందరి పోరాటంలో మనకి కనపడేది సనాతన ధర్మాన్ని తెగనాడటమే. ఆ తరువాత 19, 20 శతాబ్దాలలో బ్రిటిష్ పరిపాలనా కాలంలో మరల మరో కెరటంలా సాంఘిక ఉద్యమాలు వెలువత్తాయి. మహారాష్ట్రలో జ్యోతిబాపూలే, తమిళనాడులో పెరియార్ రామస్వామి, ఆంధ్ర రాష్ట్రంలో త్రిపురనేని రామస్వామి చౌదరి వంటి వారు అనేకమంది కుల వ్యవస్థ పైన, అందుకు ప్రతిరూపంగా ఉన్న బ్రాహ్మణాధిక్యతపైన బలమైన ఉద్యమాలు నడిపారు. కేరళలో అయ్యంకాళి, దేశవ్యాప్తంగా చూసినప్పుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లాంటి వాళ్లు కుల వ్యవస్థను నిర్మూలించడానికి చేసిన కృషి మన గమనంలో ఉండాలి. క్రీస్తుపూర్వమైనా, మధ్య యుగాలలోనైనా, ఆధునిక కాలంలోనైనా భారత తాత్విక చింతనలో ప్రధాన ఘర్షణ ఈ బ్రాహ్మణాధిక్య మనువాదానికి, నిమ్నజాతుల (శూద్రులు, అతిశూద్రులు) అభ్యున్నతి కోసం నిలబడ్డ తత్వవేత్తలు, సామాజిక ఉద్యమకారుల మధ్యే. కుల దురహంకారులు నాడు నేడు కూడా తమ క్రూరత్వం కనపడకుండా ఉండటానికి ఈ సనాతన ధర్మమనే పదాన్ని చాకచక్యంగా వాడుకుంటూనే ఉన్నారు. అందువలన ఈ చర్చ కొత్తది కాదు, తేడా ఏమంటే గతంతో పోల్చినప్పుడు ఈ మనువాద శక్తులు అనేక రెట్లు బలం పుంజుకున్నాయి. కేంద్రంలో అధికారంలోకి వచ్చాయి. అనేక ప్రభుత్వ సంస్థలని, పరిపాలన వ్యవస్థలని ఆక్రమించుకుంటున్నాయి. ఈ స్థితి నుంచి వారు చేసే దాడి బలంగా, విస్తారంగా ఉంటుంది. అందువలన ఈ శక్తులకు వ్యతిరేకంగా సామాజిక, లౌకిక, ప్రజాతంత్ర శక్తులన్నీ ఒక తాటి మీదకు రావాలి.




హిందుత్వ సిద్ధాంతానికి ఆయువుపట్టు కులమే

అనాదిగా భారతదేశంలో ఉన్నవి హిందూ పురాణాలు, హిందు ఉపనిషత్తులు, హిందూ ధర్మ శాస్త్రాలు తప్ప కుల సాహిత్యం కనపడదు. ఈ హిందూ శాస్త్రాలన్నింటా కుల వ్యవస్థ ప్రస్తావన స్పష్టంగా ఉంటుంది. మనుస్మృతిలో అయితే అచ్చంగా కుల వ్యవస్థ గురించి ప్రస్తావన ఉంటుంది. హిందూత్వ సిద్ధాంతకారులు ఎవరూ మనుస్మృతిని వ్యతిరేకించరు, అడపాదడపా కుల వివక్ష గురించి, అంటరానితనం గురించి మాట్లాడినా మొత్తంగా చూసినప్పుడు. వారికి మనుస్మృతితో విభేదాలు ఉండవు. మనుస్మృతిలో శూద్రుల గురించి, స్త్రీల గురించి ఎంత అమానుషంగా వివరణ ఉంటుందో చూస్తే మన పోరాటం ఎక్కడ మొదలెట్టాలి. దాని దాడి ఎటు ఉండాలి అనేది అర్థమవుతుంది. "న: శూద్రమతి దద్యత్" అంటే శూద్రులకు (శ్రామికులు) విద్య అందించకూడదు. "స్త్రీ హి మూల దూషణం" అంటే అన్ని పాపాలకి స్త్రీయే కారణం. "న: స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అంటే స్త్రీలకు స్వేచ్ఛ ఉండకూడదు. ఇటువంటివి కోకోల్లలుగా కనపడతాయి. ఇవి క్రీస్తు పూర్వం నాటి వాదనలు. నేటి ఆర్ఎస్ఎస్ హిందుత్వ శక్తులు ఈ మనువాద సిద్ధాంతాన్నే నెత్తికెత్తుకున్నాయి. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దాడి తీవ్రంగా పెంచారు. వారు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పాఠ్యాంశాలని మార్చేస్తున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్‌లో బిఎస్సీ నర్సింగ్ కోర్సులో బి.కే. ఇంద్రాణి అనే ఆమె రాసిన పుస్తకాన్ని పాఠ్యాంశంగా పెట్టారు. అందులో వరకట్నం ఇవ్వటం వలన తల్లిదండ్రుల ఆస్తిలో కూతురికి వాటా దొరుకుతుందని, అంద వికారంగా ఉన్న అమ్మాయిలకి ఈ వరకట్నం లేకపోతే పెళ్లిళ్లు అయ్యేవి కావని ఉంది. ఇక అశాస్త్రీయ భావజాలాన్ని... ఆవు మూత్రంలో ఔషధాలు ఉన్నాయని, ఆవు పాలలో బంగారం ఉందని, ఇప్పుడు సైన్సు సాధిస్తున్న విజయాలన్నీ వేల సంవత్సరాల క్రితమే మన రుషులు సాధించేశారని... ఇలాంటి కల్పితాలను బహిరంగంగానే చాటుతున్నారు. ఇంత పచ్చిగా కుల వ్యవస్థని, కులాధిపత్యాన్ని, కుల దురహంకారాన్ని, అశాస్త్రీయతను మతతత్వ శక్తులు పెంచిపోషిస్తుంటే, వాటికి బీజేపీ సర్కార్లు అండదండలిస్తుంటే, ఈ దాడిని తిప్పి కొట్టకపోతే భారతదేశ మనుగడకే ప్రమాదం ముంచుకొస్తుంది.

తాడోపేడో తేల్చుకోవాలి

ఓ పక్క బీజేపీ ప్రమాదాన్ని చెబుతూనే మరోపక్క దానికి ప్రాణవాయువు అయిన హిందుత్వ సిద్ధాంత ప్రచార ప్రమాదాన్ని విస్మరిస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. బీజేపీని ఎన్నికల్లో ఓడించడమే కాదు, విషపూరితమైన, అభివృద్ధి నిరోధకమైన, అసమానతలకు పుట్టినిల్లు అయిన హిందుత్వ సిద్ధాంతాన్ని తిప్పికొట్టాలి. వేల సంవత్సరాల నుంచి జరుగుతున్న ఈ ఘర్షణ నేడు తారాస్థాయికి చేరుకుంది. ఒకనాడు బ్రాహ్మణాధిక్యతను, కుల వివక్షను ఎదుర్కోవడానికి బలం సరిపోని కబీర్ "ఓ దేవా మనుషుల్లో కొందరిని ఉన్నతులుగా, కొందరిని హీనులుగా పుట్టించిన వాడివి నువ్వు దేవుడెట్లా అవుతావు" అని దేవుడి పేరు మీదుగా భయంకరమైన ఈ సాంఘిక సమస్యని సమాజం ముందుంచారు. మన వేమన కూడా "పియ్య తినెడి కాకి పితురుడెట్లాయెరా" అని తీవ్రంగా ప్రశ్నించాడు. కేరళలో నారాయణ గురు కూడా శివాలయం కట్టినప్పుడు అగ్రకులాలు దాడికి వస్తే "ఈ గుడిలో ఉన్నది శూద్ర శివుడు లెండి" అని వాళ్ళని వెనక్కి కొట్టాడు. మన దేశ చరిత్రలో ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి. మనం ఈరోజు 21వ శతాబ్దంలో ఉన్నాము. హిందుత్వ శక్తులు ఎంత బలపడ్డా, ప్రతిగా లౌకికశక్తులు, ప్రగతిశీలశక్తులు, ప్రజాతంత్రవాదులు, దేశభక్తుల సంఖ్య కూడా వాటితో పోల్చినప్పుడు అనేక రెట్లు పెరిగింది. చంద్రయాన్‌కి ముందు పూజలు చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు ఉన్నా, మరో పక్క చంద్రుని మీద మన వాడుకాలు పెట్టాడు. అక్కడ చంద్రుని భార్య తార కనబడలేదు. చంద్రుని మింగేసే రాహుకేతువులు కనబడలేదని, మతతత్వ వాదుల్ని ఎద్దేవా చేసే సామాన్య జనం కూడా ఉన్నారు. ఇప్పటికే మన దేశంలోని సాధారణ జనంలో అత్యధిక భాగం, అందులో ముఖ్యంగా హిందువులుగా చెప్పబడే వారిలో 80శాతం పైగా లౌకికవాదులు. మతసామరస్యాన్ని కోరుకునేవారు. కుల వివక్షతను ద్వేషించేవారు. సరిగ్గా ఈ పరిస్థితే బీజేపీ ఎదుగుదలకి ఒక అవరోధం, దీన్ని అధిగమించడానికి కుల వివక్షని, కుల అంతరాలని, కుల దురహంకారాన్ని ప్రస్తావించకుండా మనమందరం హిందువులం కాబట్టి మన ప్రధాన శత్రువు అయిన ముస్లింలు, క్రైస్తవులు తదితర మతస్తులను ఎదుర్కొందాం రండి అంటున్నది. "హిందువుగా జీవించు - హిందువుగా గర్వించు" అన్న నినాదాన్ని అందుకే ముందుకు తెచ్చారు. కానీ దేశంలో ప్రతిరోజు ఎక్కడో అక్కడ మైనారిటీల మీదే కాదు, దళితులు, గిరిజనులు, మహిళల మీద కూడా పైశాచిక దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ దాడులు చేస్తున్న వారిని బీజేపీ వారు వెనకేసుకు వస్తూనే ఉన్నారు. అందువలన హిందుత్వ సిద్ధాంతాన్ని హిందూ ముస్లింల మధ్య ఘర్షణ సిద్ధాంతంగా, ముస్లింలను, క్రైస్తవులను అణిచివేసి హిందూ రాజ్యస్థాపన చేయడమే వారి ఏకైక లక్ష్యంగా చూడరాదు. హిందూ రాజ్యమంటే పురాతన కాలంలో వాళ్లు గొప్పగా చెప్పే చాతుర్వర్ణ వ్యవస్థ, దాన్ని బలపర్చే మనువాదం, దాన్ని నిలబెట్టే రాచరిక తరహా పాలన దాని లక్ష్యం. అందుకు వారి దాడి నేడు. ప్రత్యక్షంగా భారత లౌకిక రాజ్యాంగం పైన ఎక్కుపెట్టారు.

ఈ నేపథ్యంలో హిందుత్వ శక్తులపై పోరాటం బలంగా సాగాలి. వాటితో పోలిస్తే నేడు దళిత ఉద్యమం, గిరిజనుల ఐక్యత, మహిళా ఉద్యమాలు, వీరందరికీ ఏదో ఒక మేరకు అండదండలిచ్చే లౌకికశక్తులు విడివిడిగా అయినప్పటికీ బలపడ్డాయి. అలాగే వీరందరినీ కూడదీసే కార్మిక, కర్షక, ఉద్యోగుల ఉద్యమాలు, పోరాటాలు పెరుగుతున్నాయి. వీటికి తోడు బీజేపీని ఓడించాలి అన్న శక్తులు ఒక దగ్గరకు వస్తున్నాయి. ఇవన్నీ అణగారిన ప్రజలకు విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులను ఉపయోగించుకోవాలి. ఏ మాట అన్నా అది బీజేపీకి, హిందుత్వ శక్తులకి ఉపయోగపడుతుందే మోనన్న భయం అర్థరహితం. హిందూత్వ శక్తుల దాడి తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు ప్రతిదాడి కూడా అన్ని పార్శ్వాలలో తీవ్రంగా ఉండాలి. అందుకు కావలసినంత సాహిత్యం, సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం మనకున్నాయి. బీజేపీ ముందుకు తెస్తున్న అనేక వాదనలను, చరిత్ర వక్రీకరణలను అనేకమంది మేధావులు పూర్వపక్షం చేస్తున్నారు. అన్నింటినీ మించి కుల దురభిమానాన్ని భరించలేని జనం వున్నారు. అందువలన హిందూత్వ శక్తుల విషప్రచారాన్ని స్టాలిన్ వంటి వారే కాదు, ప్రతి భారతీయుడు నిలబడేటట్లు చేయాల్సిన బాధ్యత వామపక్ష ప్రజాతంత్రశక్తుల మీద వుంటుంది.



'జమిలి' సాధ్యమేనా?

దేశంలో జమిలి ఎన్నికల సంకేతం మరోసారి బలంగా తెరపైకి వచ్చింది. అకస్మాత్తుగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల ప్రకటన, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో జమిలీ ఎన్నికల సాధ్యాసాధ్యాలపై కమిటీ వేశారన్న సమాచారంతో. ఎక్కడ చూసినా ఇదే విషయంపై చర్చ సాగుతోంది. దేశంలో సాధారణంగా ఒక్కో రాష్ట్రానికి, ఒక్కోసారి ఎన్నికలు జరుగుతుంటాయి. వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు, పార్లమెంటుకు వేర్వేరుగా ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ పద్ధతి మార్చాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు, పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరగాలని కోరుకుంటోంది. కేంద్రం తీసుకొస్తున్న ఈ విధానం, ఈ ప్రకటన వెనుకేదో? రాజకీయ కోణం ఉందనేది విశ్లేషకుల మాట.


రోజురోజుకూ విపక్షాల మధ్య ఐక్యత పెరుగుతుంటే బీజేపీ ఆందోళన పడుతున్నది మాత్రం వాస్తవం. ఇప్పుడు జమిలి ఎన్నికలు మీద కేంద్రం ఈ అనూహ్య పరిణామాల వెనక ఆంతర్యమేంటి? కేంద్ర హఠాత్తుగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరపాలని నిర్ణయించటం వెనుక ఉద్దేశం? ఏమై ఉండొచ్చనేది సర్వత్రా చర్చ జరుగుతున్నది. జమిలి లేదా మినీ జమిలి ఎన్నికలకు వెళ్లే అవకాశం ఎంత వరకు ఉంది? ఆ ప్రభావం రాష్ట్రాలపై ఎలా ఉండొచ్చు? అధికార బీజేపీకి ఇది లాభమా... నష్టమా? విపక్షాలు దీనికి ఎంత వరకు సన్నద్ధంగా ఉన్నాయి? అనేది భవిష్యత్తులో జరిగే ఎన్నికల ప్రభావం ఎంతమేరకు ఉంటుందో చూడాల్సి ఉంది. అయితే ఒకే దేశం-ఒకే ఎన్నిక విధానాన్ని అమలు చేయాలంటే కేంద్రానికి ఆరు అంశాలు సవాలుగా ఉన్నాయి. దీనికోసం రాజ్యాంగంలోని అధికరణల్ని మార్చాల్సి ఉంటుంది. అవి 1.పార్లమెంట్ పదవీ కాలాన్ని నిర్వచించే ఆర్టికల్ 83, 2.పార్లమెంటును రద్దు చేసే ఆర్టికల్ 85, 3.అసెంబ్లీ పదవీ కాలాన్ని నిర్వచించే ఆర్టికల్ 172, 4.రాష్ట్రాల అసెంబ్లీలు రద్దు చేసే ఆర్టికల్ 174, 5.రాష్ట్రపతి పాలన విధించే ఆర్టికల్ 356, 6.పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరాలి. ఇలాంటి కీలక అధికరణాల్ని సవరిస్తేనే జమిలి ఎన్నికలు సాధ్యమవుతాయి.

ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, పార్టీల అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉంది. ఈ అధికరణల్ని మార్చే విషయంలో రాజ్యాంగం ఏ మేరకు అనుమతిస్తుంది అనే విషయంలోనూ నిపుణుల నుంచి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దేశానికి పార్లమెంటు ఎన్నికలు 2019లో జరిగాయి. ఆ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచలప్రదేశ్, ఒడిషా, సిక్కిం రాష్ట్రాలకూ, ఆ తర్వాత మళ్లీ హరియాణా, మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాలు, 2021లో పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో జరిగాయి. ఇదేవిధంగా దేశంలో ప్రతియేటా ఎక్కడో ఓచోట ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. అలాకాకుండా దేశమంతా ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీలకు ఎన్నికలు జరిగిపోతే మళ్లీ అయిదేండ్ల పాటు అన్ని రకాలుగా దేశపాలన నిదానంగా నిబ్బరంగా సాగిపోవచ్చనేది కేంద్రం వాదన. ఉదాహరణకి 2024 నాటికి దేశమంతా జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే 2021, 2022, 2023లలో అప్పుడప్పుడే జరిగిన ఎన్నికలతో అధికారాన్ని చేపట్టి పాలన సాగిస్తున్న రాష్ట్రాల ప్రభుత్వాలను రద్దుచేసి అందరితో కలిపి ఎన్నికలు పెడతామంటే ఎవరు ఒప్పుకుంటారు? ఇది సాధ్యమేనా? అందరినీ ఒప్పించి అవసరమయిన రాజ్యాంగ సవరణ చేయడం చాలా క్లిష్టమయిన వ్యవహారం. ఆచరణలో ఎన్నో అడ్డంకులుంటాయి. జమిలి ఎన్నికలు అన్నది ఒక నినాదంగా చెప్పుకోవడానికి ఉపయోగపడుతుందే తప్ప ఆచరణలో అసాధ్యమని నిపుణులు ఎంతగా చెప్పినా మోడీ పట్టించుకోవడం లేదు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్.. అంటూ ఆకర్షణీయమైన స్లోగన్ ఇస్తూ... వచ్చారు. జమిలి సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి కమిటీలు వేశారు. కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఈ విషయంలో రాజకీయ పార్టీలతో ఒకటికి రెండుసార్లు సమావేశమైంది. దీంతో దేశంలో జమిలి ఎన్నికల దిశగా పెద్ద ఎత్తున కసరత్తు కూడా జరుగుతోందన్న కేంద్రం గొప్పలకు పోతోంది. ఇంత హడావుడి చేసిన తర్వాత జమిలి ఎన్నికల నిర్వహణ అసాధ్యమని కేంద్రం గతంలోనే గ్రహించింది. మళ్లీ ఇప్పుడు ఈ అంశాన్ని తెరపైకి తెస్తోంది. అయితే ఇది బీజేపీ ఒక అస్త్రంగా ఉపయోగిస్తోంది తప్ప ఇది సాధ్యమయ్యే పనికాదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. దీనిపై స్పష్టత రావాలంటే ఈ నెలలో జరిగే పార్లమెంట్ సమావేశాల వరకు ఆగాల్సిందే.

- తీగల అశోక్ కుమార్, 7989114086

ప్రజాకళలకు ప్రాణం ప్రజాస్వామ్యం


కళ స్వేచ్ఛను కోరుకుంటుంది. దుర్మార్గాన్ని, దౌర్జన్యాన్ని ధిక్కరిస్తుంది. కళ స్వభావమే అంత. అందుకే చీకటిలో పాటలు ఉంటాయా..? అంటే చీకటిని చీల్చేందుకే పాట పుట్టిందని జర్మన్ కవి బ్రెక్ట్ జవాబిస్తాడు. జానపద కళలు అనాదిగా ఈ స్వభావం నుండే జనపదాల నుండి జనం మధ్యన అసంఖ్యాకంగా పుట్టుకొచ్చాయి. పుట్టు కొస్తాయి కూడా ఇక ముందు. మార్క్సిజం - లెనినిజం సైద్ధాంతిక భూమికపై చారిత్రక భౌతికవాదం ఆవిష్కృతమైనాక, కళ పుట్టుక - పరిణామం కూడా ఓ శాస్త్రీయ సిద్ధాంతంగా అవగతమైంది. ఇప్పుడు ఈ అవగాహన జగద్విదితం. అనుసరణీయం. కళ పూర్వజన్మ సుకృతం, కళ దైవదత్తం అనే అశాస్త్రీయ భావాలకు కాలం చెల్లింది. వర్గ దోపిడీ సమాజంలో కళ కూడా అనివార్యంగా రెండుగా చీలిపోతుంది. దోపిడీ వ్యవస్థను బలపరిచేది ఒకటైతే, ప్రజా విముక్తికై పాటుపడేది మరొకటి. ఒకనాటి ఫ్యూడల్ వ్యవస్థలో ప్రభువుల ఆస్థాన అంతఃపురాలకు, ఉన్నత వర్గాల రాచకేళీ విలాసాలకు ఓ కళ పరిమితమైతే, జనావాసాలకు, జానపథాలకు జానపద కళ రంగభూమైంది.



కె. శాంతారావు
9959745723

20వ శతాబ్దం సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థల దశలో ప్రపంచం రెండు ప్రపంచ యుద్ధాలను చవి చూసింది. 1914-19 మొదటి ప్రపంచ యుద్ధం. 1939-44 రెండవ ప్రపంచ యుద్ధం. ఈ రెండవ ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది ప్రజానీకం బలైపోయారు. నాజీ నరహంతక హిట్లర్ ఫాసిస్ట్ యుద్ధోన్మాదికి ఒక సోవియట్ దేశంలోనే రెండుకోట్ల మందికి పైగా ప్రజలు పాతులయ్యారు. 1945 ఆగస్టు 6, 9 తేదీలలో అమెరికన్ సామ్రాజ్యవాదం అమానుషంగా వేసిన అణుబాంబులను జపాన్ నగరాలు హిరోషిమా, నాగసాకే ప్రజలు లక్షలాది మంది నేలకొరిగారు. ఆ విష పదార్థాల ప్రభావంతో అక్కడి ప్రజలు బాధలనుభవిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో విశ్వశాంతి కాంక్ష ఎల్లెడలా పరుచుకున్నది. తిండి, బట్ట, వసతి వంటి కనీస అవసరాలతో పాటు శాంతి - సామరస్యం కూడా ఓ ప్రాథమిక అవసరంగా తీసుకు వచ్చింది. దేశాధినేతలు ఎవరైనా సరే శాంతికోసం చిత్తశుద్ధితో కృషిచేయాలనే డిమాండ్ ప్రజా హృదయాల్లో పెల్లుబికింది. ఈ క్రమంలోనే మానవుడే నా సందేశం అని, శాంతి- సమభావం - సమిష్టి క్షేమం ఆధునిక యుగధర్మాలని మహాకవి శ్రీశ్రీ వంటివారు ఉద్ఘాటించారు.

భౌతికంగా మనిషి సుఖ దుఃఖాలకు, కష్టనష్టాలకు మనిషే కారకుడు తప్ప దేవుడు కాదని మార్క్సిజం తేల్చి చెప్పింది. దేవుని పేరిట (ఇన్ ది నేమ్ ఆఫ్ గాడ్) చరిత్రలో జరిగిన, జరుగుతున్న ఘోరకృత్యాలకు, ఊచకోతలకు ఉన్మాదపూరితుడైన మృగంలాంటి మనిషేనని విశదపరిచింది. ఈ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాల దోపిడీ మార్కెట్‌ల కోసమే యుద్ధాలు జరుగుతాయని వివరించింది. అయితే ఈ దుర్మార్గాలను ఎప్పటికైనా ప్రజలు సంఘటితంగా సమరశీల పోరాటాలతో తిప్పికొడతారని తెలిపింది. అదో చారిత్రక విశ్వాసంగా దార్శనికతతో ప్రకటిస్తూ 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అన్న సత్యాన్ని చాటి చెబుతుంది. ఈ సిద్ధాంతిక భూమికను అందిపుచ్చుకున్న ఎందరో ప్రజా కళాకారులు అద్భుతమైన సాహితీ కళాకృతులను సృష్టించారు. ఆ విప్లవ భావ చైతన్యాన్ని రంగరించి తమ కృతుల్లో నింపడమేగాక, ప్రజల్ని అలా వర్గభావ చైతన్యులను గావించేందుకు అహరహం శ్రమించారు. ప్రాణాలను జీవితాలను ధారపోసారు. ఈ మార్గంలో ఎన్నో జానపద కళలు ప్రజా కళాకారులుగా రూపాంతరం చెందాయి. ఎందరో ప్రజా కళాకారులు తమ జీవితాలను కళలకే అంకితం చేసారు. అలాంటి వారిలో డాక్టర్ గరికపాటి రాజారావు తెలుగునాట ముందు పీటన నిలుస్తారు.



ప్రజా కళాతపస్విగా, ప్రజా రంగస్థల ప్రయోక్తగా డాక్టర్ రాజారావు గణతికెక్కడం, ఈ మార్గాన పయనించడం వల్లనే సాధ్యమైందని రాజారావు సహచరులు కాకరాలు వక్కాణిస్తారు. కళారూపం ఏదైనా, రచయిత ఎవరైనా ప్రదర్శనకు ప్రాణం ప్రయోక్త. ప్రాణం ఎక్కడ ఉంటుంది? అణువణువున ఉంటుంది. దాని ఉనికి గుర్తు ఊపిరి. అది స్పర్శతో అనుభూతమవుతుంది. కానీ కంటికి కనిపించదు. ప్రదర్శనకు ప్రాణమైన ప్రయోక్త కూడా అంతే. ఆ చారిత్రక నేపథ్యంలో జన్మించిన రాజారావు ఆ విధంగా ప్రజా కళారంగంలో ఎనలేని కృషి చేసారు. ఎన్నెన్నో ప్రయోగాలకు ఒరవడి దిద్దారు. హిట్లర్ బాగోతంలో ఎర్ర సైనికునిగా, మా భూమి, సీతారామరాజు వంటి సాంఘిక చారిత్రక నాటకాల దిగ్దర్శకునిగా, 'పుట్టిల్లు' సినిమాకు చిత్ర దర్శకునిగా డాక్టర్ రాజారావు కృషి అనుపమానం.

ప్రతి ప్రజా కళాకారునికి నాలుగు లక్షణాలు మెండుగా ఉండాలి. 1. వేదన, వర్గ సమాజంలో బాధితుల వేదనతో కళాకారుడు మమేకం కావాలి. సహానుభూతి (ఎంపథీ) చెందాలి. 2. శోధన - బాధితుల సమస్య పరిష్కారానికి ఓ కళాకారునిగా తాను ఏం చేయగలనో శోధించుకుని ఆ దిశగా అడుగేయాలి. రాసేవారు రాయాలి. పాడేవారు పాడాలి, ఆడేవారు ఆడాలి, ఆ రాత, ఆట, పాట, మాట నవ్యంగా, నాణ్యంగా ఉండాలి. అందుకు సాధన అవసరం. 3. సాధన - ఆ నిత్య సాధనలోనే కళా నైపుణ్యం పెరుగుతుంది. ఆ రూపానికి ఆకర్షణా శక్తి అబ్బుతుంది. ప్రజల కోసం కఠోర దీక్షతో ఈ సాధన చేయాల్సిందే, మినహాయింపు లేదు. 4. ప్రదర్శన - సాధన తర్వాత మాత్రమే ప్రజల్లో ప్రదర్శనకు వెళ్ళాలి. అలా చిత్తశుద్ధితో ప్రదర్శనలకు వెళ్ళినప్పుడు ప్రజలు ఆ కళారూపాలకు బ్రహ్మరథం పడతారు. ఆ కళారూపం ప్రజలను కదిలించే ఓ చైతన్య స్వరూపంగా మారుతుంది. ప్రజా కళాకారులకు ఇది అనుభవ సత్యమే.

డాక్టర్ రాజారావు ఈ నాలుగు లక్షణాలను పుణికిపుచ్చుకుని ఆదర్శప్రాయంగా నిలిచాడు. ప్రదర్శన నిర్మాణ బాధ్యతంతా ప్రయోక్తది. తెరముందుకంటే తెరవెనుక కృషి అధికం. కార్యక్రమ లేదా కర్తవ్య పథనిర్దేశకుడు అతనే. ఆఖరికి నిరాకార నిరంజనుడుగా మిగిలిపోకతప్పదు. ఆ విధంగా కనిపించని కళా ప్రవక్త ఈ ప్రయోక్త. డాక్టర్ రాజారావు ఈ కారణాన కేవలం ఓ కళాకారుడిగా మాత్రమేగాక ఓ సాంస్కృతిక కార్యకర్తగా (కల్చరల్ ఆర్గనైజర్‌గా) ప్రజాకళకు బాటలు వేసాడు. 1943లో బొంబాయిలో భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభలు జరుగుతున్న తరుణంలోనే ఆలిండియా పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ - ఇప్టా ప్రథమ మహాసభలు జరిగాయి. ఆ మహాసభలు ద్విముఖ లక్ష్యాన్ని ప్రకటించాయి. 1. ఫాసిస్టు ప్రమాదాన్ని ప్రతిఘటించడం 2. అంతర్జాతీయ శ్రామిక వర్గ దృక్పథాన్ని కలిగి ఉండటం. ఇప్టా కేంద్ర కమిటీకి ఆంధ్రప్రాంతం నుండి కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన రాజారావు ఆ లక్ష్య సాధనకు అహర్నిశలూ శ్రమించాడు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాడు. 1963 సెప్టెంబర్8న అస్వస్థతతో అస్తమించాడు.

'రాజారావు ఓ ఉద్యమం నుండి పుట్టాడు. అందులో నాటకరంగం ఒకటి. రాజారావు ప్రజానటుడు. ప్రజా నాటకాలు నాటకరంగంలో తెచ్చిన పరిణామం విప్లవ పరిణామం అనడానికి ఎలాంటి సందేహం లేదు. ప్రసిద్ధి నాటకాలు అన్ని ప్రజా నాటకాలు కావు. గొప్ప నటులని చెప్పుకునే మహానటులందరూ ప్రజానటులు కారు. ప్రజా నాటకాలు ఎలా ప్రదర్శించినా జనం చూసి ఉండేవారే కానీ, వాటిలో నాటక శిల్పం, నటనా శిల్పం ఉన్నతంగా ఉంచ డానికి రాజారావు చేసిన కృషి, పడిన శ్రమ మరువరానిది. అతను నాటక కళకి ఉద్యమానికి సమన్వయం సాధించ డానికి తన బుద్ధి నిర్దాక్షిణ్యంగా ధారపోసాడు' అని కొడవటిగంటి కుటుంబరావు కొనియాడుతూ నివాళులర్పించారు.

ప్రస్తుతం మనదేశంలో అటు ఫాసిస్టు శక్తులు ఇటు కార్పొరేట్ శక్తులు జమిలిగా దాడిచేస్తూ కష్టజీవులు ఇటు కార్పొరేట్ శక్తులు జమిలిగా దాడిచేస్తూ కష్టజీవుల హక్కులను, జీవితాలను కాలరాస్తుంటే, రాజ్యాంగ స్ఫూర్తిని ధ్వంసం చేస్తూ నియంతృత్వం వైపు అడుగిడుతుంటే ప్రజా కళాకారులు డాక్టర్ రాజారావు మార్గంలో పనిచేయడమే ఏకైక శిరోధార్యం.

(సెప్టెంబరు 8 గరికపాటి రాజారావు 60వ వర్ధంతి)

రజక సంఘం భవన నిర్మాణానికి ఐదు లక్షల ప్రొసీడింగ్ అందజేత

నవతెలంగాణ - తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండల కేంద్రంలో రజక సంఘ భవనాన నిర్మాణానికి ఐదు లక్షల ప్రొస్టింగ్ కాపీని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు దుండ్ర రాజ యాదవ్, సీనియర్ నాయకులు వేల్పుల మల్లయ్య యాదవ్ రజక సంఘం నాయకులకు అందజేశారు. మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ కి కతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి, ఎంపీపీ కేతిరెడ్డి వనితకి, సర్పంచ్ నీలమ్మ కి, మాజీ మండల అధ్యక్షులు రాజయ్య యాదవ్, రజక సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘ అధ్యక్షులు పోతుగంటి వీరేందర్, రాజయ్య, మల్లయ్య, తిరుపతి, మల్లేశం, ఆంజనేయులు, శ్రీనివాస్, శ్రీనివాస్, సదయ్య, నరసయ్య, ఎల్లయ్య, రజక సంఘ పెద్దలు కృతజ్ఞతలు పాల్గొన్నారు.



బీఆర్ఎస్వై మండల ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్



నవతెలంగాణ - చొప్పదండి : బీఆర్ఎస్ మండల యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా, చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి అనిల్ కుమార్‌కు బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ చొప్పదండి మండలంలో బీఆర్ఎస్ యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. తన నియమాకానికి సహకరించిన చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి : ఎంపీపీ

నవతెలంగాణ - చొప్పదండి : అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులకు పోషక విలువల తో కూడిన పరిపుష్టమైన ఆహారాన్ని అందించాలని చొప్పదండి ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ గంగాధర ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ చిలుక రవీందర్ హాజరై పోషకాహార లోపం, ప్రాముఖ్యతను వివరిస్తూ, కిచెన్ గార్డెన్ పరిశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఇద్దరికి సామూహిక శ్రీమంతాలు, అన్న ప్రసన్న చేశారు. కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి, పోషణ ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పిడి సౌజన్య, సీడీపీవో కస్తూరి, ఏసీ డీపీవో ఎస్.సౌందర్య, సూపర్‌వైజర్ రమాదేవి, కార్యదర్శి నాగరాజు, ఐకేపీ సీఏలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన 50మంది బీఎస్పీ నాయకులు బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుండి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసి, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి
- పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన

నవతెలంగాణ - జమ్మికుంట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాలయపన చేస్తున్నాయని, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంట సీపీఐ(ఎం) జోన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఆందోళన, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 1నుంచి 7వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు అఖిలభారత కమిటీ పిలుపుమేరకు జిల్లాలో 6, 7వ తేదీల్లో మండల కేంద్రాలలో ధర్నాలు, 8వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, నిరుద్యోగ యువకులు ఆశగా ఎదురుచూస్తున్నారని, ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు కుదించడంతో కూలీల బతుకులు ఆగమవుతున్నాయన్నారు. దేశంలో కుల, మత ఘర్షణలు పెరిగిపోతున్నాయని, బిజెపి ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఒకవైపు పేదలపై భారాలు వేస్తూ కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తుందని విమర్శించారు. పన్నుల భారంతో పేదరికంలో మగ్గుతున్నవారు మరింత దారిద్ర్యంలోకి నెట్టబుతున్నారన్నారు. పన్నులు తగ్గించడం ద్వారా మాత్రమే ధరలు తగ్గుతాయని కేంద్ర ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. దేశంలో 22శాతం సంపద ఒక్క శాతం కోటీశ్వరుల చేతుల్లో ఉన్నదని,40 శాతం సంపద కేవలం 20 శాతం మంది వద్ద ఉన్నదని అన్నారు. 67ఏళ్లలో దేశం మొత్తం అప్పు 55లక్షల కోట్లు ఉండగా మోడీ ప్రభుత్వం 9సంవత్సరాల కాలంలో 100లక్షల కోట్లు ఎఫ్ఆర్‌బిఎం పరిధికి మించి అప్పు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిందని, 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 11.5 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇస్తామని, కేవలం నాలుగు లక్షల ఎకరాలకు మాత్రమే ఇచ్చారన్నారు. దళితులు, గిరిజనులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని, కార్మికులకు కనీస వేతనాలు సవరించలేదన్నారు. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలు రైతులకు 2011 చట్టం ప్రకారం రుణ అర్హత కార్డులు ఇచ్చి రుణమాఫీతో పాటు వడ్డీ కూడా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జరిగే నిరసన ఉద్యమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జోన్ కార్యదర్శి శీలం అశోక్, కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, జక్కుల రమేష్ యాదవ్, దండిగారి సతీష్, కన్నం సదానందం, నాయకులు రాజకుమారి, రావుల ఓదెలు, రాచపల్లి ఐలయ్య, మధునయ్య, బైరం సమ్మయ్య, కిరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ(ఎ) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

ముంపు నిర్వాసితులను అండగా ఉంటా



నవతెలంగాణ-గంగాధర : మంగపేట ముంపు నిర్వాసితులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భరోస నిచ్చారు. గంగాధర మండలం బూర్గుపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం గంగాధర ఎల్లమ్మ చెరువులో ఇళ్లు, భూములు కోల్పోయిన మంగపేట ముంపు నిర్వాసితులకు ప్రభుత్వం నుండి మంజూరైన 16.50 కోట్ల రూపాయల చెక్కును ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువులో ఇళ్లు, భూములు కోల్పోయిన మంగపేట ముంపు నిర్వాసితులు 18 ఏళ్ల నుండి నష్ట పరిహారం కోసం ఎదిరి చూస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని భరోస నిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాధర సర్పంచ్ మడ్లపల్లి గంగాధర్, మంగపేట బీఆర్ఎస్ నాయకులు తోట మహిపాల్, మాజీ సర్పంచ్ దుర్గయ్య, ముంపు నిర్వాసితులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక : మండలంలోని బూర్గుపల్లి, లింగంపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు 100 మంది ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నేతృత్వంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ సాగి మహిపాల్‌రావు, బీఆర్ఎస్ నాయకులు దూలం శంకర్‌గౌడ్, బాలగౌడ్ పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

నవతెలంగాణ - కొత్తపల్లి : కరీంనగర్ మండలం చెర్లబూత్కూర్ గ్రామ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, మహదేవ్ సేవా ఫౌండేషన్ కరీంనగర్ ఆధ్వర్యంలో మొగ్దుంపూర్ నుండి నగునూరు రోడ్డు పైన ఉన్న ప్రమాదకరమైన గుంతల్ని పూడ్చారు. ఈ కార్యక్రమంలో మహదేవ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ అవారి రాజకుమార్, ప్రధాన కార్యదర్శి మామిడాల సుమంత్, కోశాధికారి దీకొండ శ్రీనివాస్, పెద్దిరాజు కుమార్, కచ్చు వేణు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హిమ్మత్‌నగర్ వాసికి డాక్టరేట్

నవతెలంగాణ - వీణవంక : మండలంలోని హిమ్మత్ నగర్ గ్రామానికి చెందిన గెల్లు లక్ష్మి-మల్లయ్య దంపతుల కుమారుడు గెల్లు అశోక్‌కు డాక్టరేట్ లభించింది. అశోక్ ఉస్మానియా యూనివర్శిటలో పర్యావరణ శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శశికళ పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ ఆఫ్ ద గ్రౌండ్ వాటర్ క్వాలిటీ ఎట్ రాంపూర్ ఏరియా, వరంగల్ అర్బన్ జిల్లా, తెలంగాణ స్టేట్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశాడు. కాగా ఆ గ్రంథాన్ని పరిశీలించిన యూనివర్శిటీ అధికారులు అశోక్ కు మంగళవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. కాగా అశోక్ గ్రామీణ ప్రాంతానికి చెందిన వాడు కావడంతో పలువురు బుధవారం అభినందించారు.

ఉన్నతి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ - హుజురాబాద్ : ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో నైపుణ్యత పెంచేందుకు గాను ప్రభుత్వం ఇస్తున్న ఉన్నతి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని హుజురాబాద్ ఎంఈఓ కేతిరి వెంకట నరసింహారెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఉన్నతి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో కోర్సు డైరెక్టర్ పూరుకొండ సత్య ప్రసాద్ రాష్ట్ర పరిశీలకు డు పి ఓదెలు రిసోర్స్ పర్సన్ లు. శ్రీనివాస దామోదర్, బజన్ చందర్, రాం కిరణ్, హుజురాబాద్ డివిజన్లోని 6 మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన లారీ.. తప్పిన పెను ప్రమాదం




నవతెలంగాణ - చొప్పదండి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లాకు చెందిన ఏపీ04 టియు4666 నెంబర్ గల లారీ పప్పు దినుసుల లోడుతో, మహారాష్ట్రకు వెళ్తుండగా, బుధవారం ఉదయం చొప్పదండి పట్టణంలోని సబ్ స్టేషన్ ముందు హైవే రోడ్డుపై లారీ డ్రైవర్ గుంతను తప్పించబోగా, లారీ స్టీరింగ్ రాడు విరగడంతో ఒక్కసారిగా అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకెళ్లి మధ్యలో ఆగింది. దీంతో గోరా పెను ప్రమాదం తప్పింది. లారీ అదుపు తప్పడానికి హైవే రోడ్‌పై ఉన్న గుంతలే కారణమని వాహనదారులు ప్రయాణికులు తెలిపారు. ఈ గుంతలతో ఇప్పటికీ రోడ్డు ప్రమాదాలు ఎన్ని జరుగుతున్న ఆర్ అండ్ బీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ, గుంతలను పూర్తిగా పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలకోసారి రోడ్డు పనులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణ పను లు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన మాతంగి సంపత్(ఇంద్ర) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, భారత్ జాగృతి మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పోలు రాము బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పోలు రాము మాట్లాడుతూ.. మాతంగి సంపత్(ఇంద్ర) మరణించడం చాలా బాధాకరం సంపత్ అన్న అందరితో చాలా ఆప్యాయంగా పలకరించి మాట్లాడే వాడన్ని, ఎప్పుడు ఎక్కడ ఉన్నా కూడా చిరునవ్వుతో వచ్చిన పలకరించేవాడని గుర్తు చేసుకున్నారు. తన వంతు సాయంగా రూ.5 వేల ఆర్థిక సాయంను పోలు రాము బాధిత కుటుంబానికి అందజేశారు.

జిల్లా సహకార అధికారికి సన్మానం



నవతెలంగాణ - చొప్పదండి : జగిత్యాల జిల్లా నుండి కరీంనగర్ జిల్లా సహకార సంఘాల అధికారిగా బదిలీపై వచ్చిన, కరీంనగర్ జిల్లా సహకార అధికారి శ్రీ రామాంజనేయ చారిని బుధవారం కరీంనగర్ జిల్లా పిఎసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే అందజేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ పిఎసిఎస్ అధ్యక్షులు చీకటి కుమారస్వామి, కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షులు కరీంనగర్ పిఎసిఎస్ సీఈవో రమేష్, వీరస్వామి పాల్గొన్నారు.

సహకార ఎన్నికలు నిర్వహించాలి

ప్రాథమిక గొర్రెల పెంపకందారులు



నవతెలంగాణ - గన్నేరువరం

మైలారం ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికల నిర్వహణకు చొరవ చూపాలని మైలారం ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు దుడ్డు నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని 16 మండలాల్లో 243 ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల సొసైటీలు ఉన్నాయని, జిల్లాలోని ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల్లో ఇప్పటికీ కూడా సగానికి కూడా ఎన్నికలు నిర్వహించలేదన్నారు. ఈ ఎన్నికల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి తొందరగా గ్రామాలలోని అధ్యక్ష కార్యదర్శుల ఎన్నికలు జరపాలని విన్నవించారు. జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలారం ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సంఘం కార్యదర్శి లెంకల మల్లయ్య , గన్నేరువరం యాదవ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జీల కుమార్, సంఘం రాష్ట్ర నాయకులు జీల మహేష్ ,జీల శ్రీనివాస్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఓరియం టేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మెన్ ముద్దసాని రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు వృత్తి పట్ల సమగ్ర విజ్ఞానం కలిగి ఉన్నట్లయితే కళాశాలలో జరిగే ప్రాంగణ నియామకాలలో తప్పకుండా వారు ఎంపిక అవుతారన్నారు. కళాశాలలో ఏయిర్ కండిషన్డ్ కంప్యూటర్ ల్యాబ్స్, డిజిటల్ గ్రంథాలయం, కళాశాల బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, పాలనాధికారి పాలవెల్ల రామారావు, మీడియా ఇన్చార్జ్ గొంటి రమేష్ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సల్ల రవీందర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - తిమ్మాపూర్ : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సల్ల రవీందర్ పుట్టినరోజు వేడుకలను డివిజన్ ప్రెసిడెంట్ జాప శ్రీనివాస్ రెడ్డి, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చిందం మల్లేశం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అలుగు నూర్ చౌరస్తాతో పాటు మున్నూరు కాపు సంఘ భవనంలో కేక్ కట్ చేయించి, స్వీట్లు పంచారు. ఈ వేడుకల్లో కేడీసీసీబీ డైరెక్టర్ సింగిరెడ్డి స్వామిరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కంది రాం చంద్రారెడ్డి, అల్లు అర్జున్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు తమ్మనవేని అంజి యాదవ్, నాయకులు జాప రాఘవరెడ్డి, సిల్ల పర్శరాములు, కంది అశోక్ రెడ్డి, సల్ల మహేందర్, సిల్ల రాజమల్లు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చిందం మల్లేశం, గౌరవ అధ్యక్షుడు పురంశెట్టి అనోహర్, కార్యదర్శి చిందం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మాతంగి సంపత్ కుటుంబ సభ్యులకు పరామర్శ

నవతెలంగాణ - తిమ్మాపూర్ : తిమ్మాపూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు మాతంగి సంపత్ ఇటీవల మరణించగా అట్టి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేసిన ఆల్ ఇండియా యువజన సంఘం. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు వంతడుపుల సంపత్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు పనిచేస్తూ సంఘానికి ఎనలేని కృషి చేసిన మాతంగి సంపత్ మృతి బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక రూ.6000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దళితబంధు లబ్దిదారులను గ్రామసభల ద్వారా గుర్తించాలి

నవతెలంగాణ - రామడుగు : దళితబంధు పథకం లబ్దిదారులను గ్రామసభల ద్వారానే అర్హులను గుర్తించి పథకాన్ని వర్తింపజేయాలని వన్నారం ఎంపీటీసీ జవ్వాజి హరీష్ కోరారు. ఈ మేరకు విలేకరులతో బుధవారం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద దళితుల జీవన ప్రమాణాలు పెంచడానికి, వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా దళితబంధు పథకం తీసుకొస్తే, స్థానిక ఎమ్మెల్యే మాత్రం తన అనుచరులకు, పార్టీ కార్యకర్తలకు ఇష్టం వచ్చినట్లు పంచుతున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. రాబోవు రోజుల్లో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను ప్రజాక్షేత్రంలో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా నిరు పేద దళితులను దృష్టిలో పెట్టుకొని అర్హులకే ఈ పథకాన్ని గ్రామసభల ద్వారా అర్హులను ఎంపికచేసి, పారదర్శకంగా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చొప్పదండి బీజేపీ అభ్యర్థిగా సుద్దాల దేవయ్య దరఖాస్తు



నవతెలంగాణ - చొప్పదండి : నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి సుద్దాల దేవయ్య బుధవారం బీజేపీ జాతీయ నాయకులు, ఎంపీ,తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీ ఎన్నికల ఇంచార్జ్ ప్రకాష్ జగదేకర్ సమక్షంలో దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సుద్దాల దేవయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను గడప గడప తీసుకెళ్లి వివరించాలన్నారు.

ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు గజమాలతో సన్మానం



నవతెలంగాణ - సైదాపూర్ : బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థిగా టికెట్ వచ్చిన సందర్భంగా వొడితల సతీష్‌కుమార్ బుధవారం ఎల్కతుర్తి మండలం జగన్నాథ్‌పూర్ అభయాంజ నేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రచార కార్యక్రమాన్ని జగన్నాథ్ పూర్ గ్రామ వీధుల నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా సైదాపూర్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చందా శ్రీనివాస్, రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు సారాబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు సోమారపు రాజయ్య ఎమ్మెల్యే సతీష్ కుమార్‌ను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పోషక ఆహారంతోనే ఆరోగ్యం

నవతెలంగాణ - గంగాధర

పోషక విలువలు గల ఆహారం తీసుకోవడం ద్వారే ఆరోగ్యం చేకూరుతుందని మధురానగర్ సర్పంచ్ వేముల లావణ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి సూచించారు. మధురానగర్ గ్రామ పంచాయతీ భవనంలో స్థానిక అంగన్‌వాడి కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. బాలింతలు, పిల్ల తల్లులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ప్రశాంతి, ఏఎన్ఎం తిరుమల, సీసీ శైలజ, అంగన్‌వాడి టీచర్స్ లక్ష్మి, ఎల్లమ్మ, ఆశా వర్కర్ రూప పాల్గొన్నారు.

తానా కవి సమ్మేళనానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పున్నం చందర్

నవతెలంగాణ - హుజురాబాద్

ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రపంచ సాహిత్య వేదిక సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ కవి సమ్మేళనానికి హుజురాబాద్‌కు చెందిన కవి నాగమల్ల పున్నం చందర్‌కు ఆహ్వానం అందింది. తెలంగాణ కవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని "తెలంగాణ భాషా దినోత్సవం" సందర్భంగా తానా అంతర్జాతీయ కవి సమ్మేళనానికి హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధనచేస్తున్న జంతుశాస్త్ర అధ్యాపకులు పున్నం చందర్‌కు స్థానం లభించింది. కవి రచయిత అయిన పున్నం చందర్ గతంలో 108 ఆటవెలది పద్యాలతో పున్నం శతకము, 200వరకు వచన కవితలు, 300వరకు నయా జమానా వంటి నాలుగు వరుసల మేలుకొలుపు పదాలు, ఆధునిక మహాభాగవతంలో కాళీయ మర్దనం పైన ఓ కథాంశం, బాలగేయాలు, శోభకృత్ నామ సంవత్సరంపై,వచన కవిత,తెలంగాణా దశాబ్ది ఉత్సవాలలో హరితాహారం గురించి,400 వరకు హైకూలు, ఉదయసాహితీ కరీంనగర్ డాక్టర్ .వైరాగ్యం ప్రభాకర్ గారి సంపాదకీయంలో 20వరకు వివిధ అంశాలలో వచన కవితలు ఎస్‌వి ఫౌండేషన్ తెలుగు వెలుగు సాహిత్య వేదిక నిర్వహణలో ఉగాది పైన వచన కవిత లాంటి అనేక సమకాలీన అంశాలపైన పలు వచన కవితలు రాశారు. అంతర్జాలంలో తానా నిర్వహిస్తున్న భాషా దినోత్సవం కార్యక్రమం యప్ టీవీ ద్వారా అనేక యూరప్ దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అవటమే కాకుండా, తానా అధికారిక యూట్యూబ్ ఫేస్బుక్ చానల్స్‌లో, ఈటీవీ భారత్ వంటి దాదాపు పది యూట్యూబ్ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. పున్నం చందర్‌కు తానా ఆహ్వానం రావడం పట్ల ప్రిన్సిపాల్ నిర్మల, ఉపాధ్యాయులు, కవులు, సాహిత్యాభిలాషులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కొండాపూర్‌లో సైబర్ జాగృతిక దివస్..



నవతెలంగాణ - మేడిపల్లి : మేడిపల్లి మండలంలోని కొండాపూర్ గ్రామంలో స్టేషన్ హౌస్ అధికారి చిరంజీవి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలు, కాల్ గర్ల్స్, దొంగతనాలు, బంగారు ఆభరణాలపై ఆన్‌లైన్ మోసాలు, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ వంటి సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై హెల్ప్ లైన్ నెంబర్ 1930కు డయల్ చేయవచ్చని టోల్ ఫ్రీ నెంబర్ ప్రాముఖ్యతను వివరించారు. గ్రామ సర్పంచ్ డి.అభిలాష్, ఎంపీటీసీ ఎం.రాజు పాల్గొన్నారు.

వికలాంగులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్



నవతెలంగాణ - కరీంనగర్ : జిల్లాలో సీనియర్ సిటిజన్స్, వికలాంగులందరూ ఓటర్లుగా గుర్తించబడాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సీనియర్ సిటిజన్లు, వికలాంగులకు ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. అంగవైకల్యం, వృద్ధాప్యం కేవలం శరీరానికి మాత్రమేనని, వీరు అన్ని అవయవాలు సక్రమంగా పని చేసే సకలాంగులతో సమానమని అన్నారు. జిల్లాలో వికలాంగులు, వృద్ధులందరు ఓటర్లుగా నమోదు కావాలని అన్నారు. ఓటరు జాబితాను ప్రచురించి స్పెషల్ క్యాంపేయిన్‌లను జిల్లాలో నిర్వహించి నూతన ఓటర్ల వివరాలు నమోదు చేయడం, జాబితాలో మార్పులు చేర్పులను అవకాశాన్ని కల్పించినట్టు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వికలాంగులు, వృద్ధులకు ర్యాంపులు, వీల్ చైర్లు తదితర ప్రత్యేక సౌకర్యాలను కల్పించినట్టు తెలిపారు. వోటర్స్.ఈసీఐ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా స్వయంగా మొబైల్‌లో ఓటర్ జాబితాలో వివరాలను చూసుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్, డీఆర్డీఓ శ్రీలతరెడ్డి, డీడబ్లూఓ సరస్వతి, స్వీప్ నోడల్ అధికారి రవీందర్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మెన్ కేశవ రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మోసం అంజయ్య, డేకేర్ సెంటర్ ప్రెసిడెంట్ జనార్ధన్‌రావు పాల్గొన్నారు.


భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు



నవతెలంగాణ - కరీంనగర్ క్రైం : భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు అన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దన్నారు. పరివాహక, లోతట్టు ప్రాంతాలకు చెందిన ప్రజలకు సహాయం అందించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని చెప్పారు. కమిషనరేట్ పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, అధికారుల సూచనలను పాటిస్తూ పోలీసులకు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాలకు చెందిన ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తక్షణ సహాయం కోసం సంబంధిత అందుబాటులోని అధికారులకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



నవతెలంగాణ - కరీంనగర్ క్రైం : కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన జి.గంగాధర్ (51) జూన్ 23న తన మొబైల్ ఫోన్ పోయిందని కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ విధానం ఉపయోగించి ఆ మొబైల్‌ను కనిపెట్టి బాధితుడికి కమిషనర్ చేతుల మీదుగా అప్పగించారు. సీఈఐఆర్ ఆధునిక సాంకేతిక వినియోగం ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు గుర్తించడం గతంలో కంటే సులభతరమవడమే కాకుండా మంచి ఫలితాలను అందిస్తుందన్నారు. సీఈఐఆర్ ద్వారా వ్యక్తిగత సమాచార భద్రత కూడా కలుగుతుందని మన వివరాలు నమోదు చేసి లాక్ చేయవచ్చునని, దొరికిన పిదప అన్లాక్ చేసుకునే సౌలభ్యం కూడా ఉందని తెలియచేశారు. ఈ విధానాన్ని ఉపయోగించి ఇప్పటి వరకు పోగొట్టుకున్న 203 మంది మొబైల్ ఫోన్లను గుర్తించి బాధ్యులకు అప్పగిస్తున్నట్టు సీపీ సుబ్బారాయుడు తెలిపారు. సెల్‌ఫోన్ కనిపెట్టేందుకు కృషిచేసిన సిబ్బందిని సీపీ అభినందించారు. కార్యక్రమంలో సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ ఇన్‌స్పెక్టర్ జె.సరిలాల్, కరుణాకర్ పీసీ పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

సీపీ సుబ్బారాయుడు



నవతెలంగాణ - కరీంనగర్ క్రైం : మత సామరస్యం, సహోదర భావంతో శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు అన్నారు. ఈ నెలలో గణేష్ చతుర్థి, మిలాద్-ఉన్-నబిల నేపథ్యంలో బుధవారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అన్ని మతాలకు చెందిన ప్రజలు సోదర భావంతో, శాంతి యుత వాతావరణంలో పండుగలను జరుపుకుంటూ మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉన్నప్పటికీ ఏవైనా చిన్నచిన్న సంఘటనలు జరిగితే వాటిని రాజకీయలకు ముడిపెట్టొద్దన్నారు. ఈ సంవత్సరం నూతనంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల సమాచారాన్ని సంబంధిత పోలీస్ అధికారులకు తప్పకుండా తెలియజేయాలన్నారు. మండపాలు, పండల్‌ల వద్ద విద్యుత్ వైర్ల పట్ల జాగ్రత్త వహించాలని, నిర్వహణ సభ్యులు పోలీసులకు సహకరిస్తూ శాంతి యుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. సమావేశంలో కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటర్ అవగాహనా సదస్సు



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి నోడల్ ఆఫీసర్ పద్మావతి, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఏఈఆర్ఓ నవీన్ విచ్చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. నోడల్ ఆఫీసర్ వి.పద్మావతి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. నవీన్ మాట్లాడుతూ.. ఎలక్టోరల్ రోల్‌లో పేరు నమోదు, వారి ప్రస్తుత వివరాలు సరిదిద్దడం, మరణించిన వారి పేర్లను తొలగించడం గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల నోడల్ ఆఫీసర్ అయిలయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణకు సాటిలేదు

ప్రభుత్వ విప్ బాల్క సుమన్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



నవతెలంగాణ - గోదావరిఖని : అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణకు సాటిలేదని ప్రభుత్వ విప్ బాల్క సుమన్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలతో పాటు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. రామగుండం నియోజకవర్గ పరిధిలోని బీరువా, స్టీల్ ఫర్నిచర్, మేస్త్రి, పెయింటర్స్ అసోసియేషన్ సభ్యులు, ముర్మూరు గ్రామ ప్రజలు 100మందికి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 36 మంది సిఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు 25లక్షలా 50వేలా 500 రూపాయల చెక్కులను అందించారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, టిబిజికెఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ చేరిక కమిటీ సభ్యుడు జహిద్ పాషా, కార్పొరేటర్లు బాల రాజ్ కుమార్, నీలం పద్మ గణేష్, అడ్డాల స్వరూప రామస్వామి, కో ఆప్షన్ మెంబర్ రఫీక్, నాయకులు జేవీరాజు, దొమ్మేటి వాసు, మీర్ ఫయాజ్ అలీ, సలీం బేగ్, ఎండి మున్వర్ పాల్గొన్నారు.

ఉద్యమకారులు అధైర్య పడద్దు
మాజీ టీఎస్ ఐడీసీ చైర్మన్ ఈద

నవతెలంగాణ - ఓదెల

కరీంనగర్ మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు కుక్కల మల్లయ్య ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డక కూడా తమకు న్యాయం జరగడం లేదని మనస్తాపానికి గురై స్థానిక అమరవీరుల స్తూపం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ని తెలంగాణ ఉద్యమ నాయకులు మాజీ టీఎస్ ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్య యాదవ్ పరామర్శించారు. ఈద శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులు ఎవరు అధైర్యపడద్దని.. అండగా ఉంటా


పరామర్శిస్తున్న ఈద శంకర్‌రెడ్డి, గుండేటి ఐలయ్య

మని హామీ ఇచ్చారు. గుండేటి ఐలయ్య మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కనీసం ఇప్పుడైనా ఉద్యమకారుల సంక్షేమ గురించి ఆలోచించి ఉద్యమకారుల సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని ఐలయ్య డిమాండ్ చేశారు. వారివెంట కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కనకం కుమార్‌స్వామి, బాండ గోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, మల్లేశం, రాజు, తదితరులు ఉన్నారు.

జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-కథలాపూర్ :

మండలంలోని భూషణరావుపేట గ్రామంలో జీపీ భవన నిర్మాణానికి తన నాయనమ్మ లోక గంగవ్వ పేరు మీద నాలుగు గుంటల భూమి ఇచ్చి ఔదార్యాన్ని చాటుకున్నారు లోక బాపురెడ్డి. గ్రామ సర్పంచ్ కోన సులోచన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి భూమి పూజ చేశారు. ఈజీఎస్ కింద ఇరవై లక్షలు మంజూరు కాగా, స్థానిక ఎమ్మెల్యే రమేష్‌బాబు రూ.10లక్షలు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి గణేష్, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు మార్కెట్ కమిటీ చైర్మన్ గుండారపు సౌజన్య గంగాధర, వర్దినేని నాగేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఉప సర్పంచ్ పల్లె సరిత గంగాధర్ పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న లోకబాపురెడ్డి

మృతుడి కుటుంబానికి లోక బాపురెడ్డి పరామర్శ

మండలంలోని భూషణ్‌రావుపేట్ గ్రామానికి చెందిన సుర్నేని గంగరావు ఇటీవల మృతి చెందగా వారి కుటంబ సభ్యులను లోక బాపురెడ్డి పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ నాగం భూమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గుండారపు గంగాధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్దినేని నాగేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ కిరణ్ రావు, జిల్లా రైతు సమితి సభ్యులు చిటి విద్య సాగర్‌రావు, మిర్యాల వెంకటేశ్వరరావు, మండల రైతు సమితి సభ్యులు బద్ధం మహేందర్ పాల్గొన్నారు.

డాక్టర్ బీఎన్‌రావు చేయూత

నవతెలంగాణ-కథలాపూర్

మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన చిట్యాల రోజా రెండు రోజుల క్రితం కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఇద్దరు కవల పిల్లలకు జన్మనించింది. పసికందుల ఆరోగ్యం సరిగా లేదని, రూ.40వేల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. జడ్పీటీసీ నాగం భూమయ్య ద్వారా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.ఎన్.రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి ఫౌండేషన్ ద్వారా రూ.20వేల చెక్కులు అందజేశారు. మరో రూ. 20 వేలు కేట్టో కరీంనగర్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణానికి చెందిన 54 మంది లబ్దిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 19 లక్షల 54వేల రూపాయల విలువగల చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, ఉపాధ్యక్షులు ధుమాల రాజ్‌కుమార్, ఓల్లెం మల్లేశం, సమిండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

అంగన్‌వాడీలో పోషణ్ మహా వేడుకలు

నవతెలంగాణ - ధర్మపురి

ఐదేండ్లలోపు పిల్లలందరికీ సరైన పోషకాహారం ఇస్తే సంపూర్ణ ఆరోగ్యం ఉంటారని ధర్మపురి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వాణి శ్రీ అన్నారు. బుధవారం ధర్మపురి పట్టణంలోని న్యూ హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా వేడుకలు నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. బాలింతలు, కిశోర బాలికలు, రక్తహీనత గురి కాకుండా ఆకుకూరలు, కూరగాయలు, సీజన్ ఫ్రూట్స్ తీసుకో వాలన్నారు. పరిశుభ్రత లోపం కావడం వలన, ఎనీమియా లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అనంతరం కృష్ణాష్టమి వేడుకలు నిర్వ హించారు. సూపర్‌వైజర్లు, , స్కూల్ టీచర్స్, బాలింతలు పాల్గొన్నారు.


పాల్గొన్న చిన్నారులు, గర్భిణులు

దళితబంధులో అక్రమాలను వెలికి తీయాలి

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలంలోని దేశాయిపేట గ్రామంలో దళితబంధు పథకంలో అర్హులైన లబ్ధిదారుల నుంచి పలువురు బీఆర్ఎస్ నాయకులు తమ వాటాగా ముందస్తుగా తెల్ల కాగితంపై అంగీకారం చేసుకొని డబ్బులు దండుకున్నారని, ఉమ్మడి మేడిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దళితబంధులో జరుగుతున్న అవినీతిపై వెంటనే విచారణ చేపట్టి, అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో దళిత బంధు డబ్బులు అందేలా చూడాలని ఆయన కోరారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిరసనలు చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మన్నపేట మాజీ ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, జంగంపల్లి విజయ్, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలని ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా, డివిజన్‌ల, మండల పట్టణ ప్రతినిధులు బుధవారం ప్రధాన పోస్ట్ ఆఫీస్‌కు వెళ్లి కార్డులు పంపించారు. రైల్వే టికెట్స్‌లో సీనియర్ సిటజన్స్‌కు గతంలో ఇచ్చిన రాయితీలు పునరు ద్ధరించాలని, పెన్షనర్లను ఆదాయం పన్నునుంచి మిన హాయిం చాలని కోరారు. రాష్ట్రంలో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటుచ ఏయాలని, ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది సతీష్ రాజు, కార్యదర్శి మనాలకిషన్ పాల్గొన్నారు.

వికలాంగ పిల్లలకు ఉపకరణాలు పంపిణీ

నవతెలంగాణ-పెద్దపల్లి:సమగ్ర శిక్ష పెద్దపల్లి అలింకో వారి ఆధ్వర్యంలో వికలాంగ పిల్లలకు పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉపకరణాలు బుధవారం పంపిణీ చేశారు. పెద్దపల్లి ఎంపీడీఓ కార్యాలయంలోని భవిత కేంద్రంలో ఉపకరణాలు అందజేశారు. తెలం గాణ ప్రభుత్వం వికలాంగుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 137 మంది దివ్యంగులకు 216 ఉపకరణాలు అందించారు. అందులో వీల్ చైర్స్ , వినికిడి యంత్రాలు, రోలేటర్స్, చంక కర్రలు , కాలిపర్స్ మొదల గునవి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో మాదవి, జిల్లా కో ఆర్డినేటర్ శ్రీ ఇల్లందుల విజయ్‌కుమార్, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ రౌఫ్ ఖాన్, పెద్దపల్లి మండలం పరిషత్ ఆఫీసర్ రాజు , పెద్దపల్లి, కమనపూర్ మండల విద్యాధికారులు,సంపత్‌రావ్, సురేందర్ ,సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ లు. షేక్, జ్యోత్స్నలత పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నల్ల వెంకటేశ్వర్

నవతెలంగాణ-మెట్‌పల్లి/ జగిత్యాల

బిసి సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మెట్‌పెల్లికి చెందిన నల్ల వెంకటేశ్వర్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు బ్రహ్మండబెరి నరేష్ నియామక పత్రం బుధవారం అందజేశారు. బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు నరేష్ పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎల్‌జీ గార్డెన్‌లో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం జరిగింది. అంగన్‌వాడీ టీచర్స్ జిల్లా అధ్యక్షురాలు ఏ.రజిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు కే. సునీత పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 70వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారని, వారంతా మహిళలు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారని పేర్కొన్నారు. 45 ఏండ్లుగా ఐసిడిఎస్‌లో పని చేస్తూ పేద ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు.


పాల్గొన్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వకుండా, పిఎఫ్ పింఛన్ సౌకర్యాలు కల్పించకుండా, ఉద్యోగ భద్రత ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులందరూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11 నుండి నిరవధిక సమ్మె చేయనున్నట్టు తెలిపారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ముఖ్యంగా పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐసిడిఎస్‌కు బడ్జెట్ కేటాయించి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి వి. వనిత, జిల్లా కోశాధికారి మాదవి, అంగన్వాడీ టీచర్స్ జిల్లా సెక్టార్ లీడర్స్, సీఐటీయూ జగిత్యాల జిల్లా కోకన్వీనర్ మూడుగం రాజలింగు, సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ ఎం.ఎ చౌదరి పాల్గొన్నారు.

సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారుల సమన్వయ సమావేశం

నవతెలంగాణ-సుల్తానాబాద్‌రూరల్

రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, కరీంనగర్‌రూరల్ ఏసీపీ, కరుణాకర్ రావు, కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ ఆధ్వర్యంలో బొంత కుంటపల్లి గెస్ట్ హౌస్ సమావేశం ఏర్పాటు చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒక ప్రత్యేక ప్రణాళికను రూపొందించడానికి సమావేశమయ్యారు. ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా, ఎన్నికల్లో



పాల్గొన్న పోలీస్ అధికారులు

ప్రలోభాలకు మద్యం, నగదు తరలింపుపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టేలా నిర్ణయాలు తీసుకున్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా నియం త్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు రూపొందించడం జరిగింది. ఈ సమావేశంలో పెద్దపల్లి సీఐ అనీల్, సుల్తానాబాద్ సీఐ జగదీశ్, కరీంనగర్ రూరల్, సీఐ ప్రదీప్, ఎల్ ఎండి సీఐ ఇంద్రసేనరెడ్డి, చొప్పదండి సీఐ రవీందర్‌లతో సుల్తానాబాద్ ఎస్ఐ. విజేందర్, జూలపల్లి ఎస్ఐ. వెంకటకృష్ణ, కాల్వ శ్రీరాంపూర్ ఎస్ఐ శ్రీనివాస్, పోత్కపల్లి ఎస్ఐ శ్రీధర్, టేకుమట్ల ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామాలకు పండ్ల మొక్కలు పంపిణీ

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ

సింగరేణి ప్రభావిత గ్రామాలకు ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో బుధవారం జీఎం ఎల్ వీ.సూర్యనారాయణ పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఆర్జీ-2 ఏరియా వకిల్ పల్లి గనికి సంబంధించి రేమేడియేషన్ మేషర్స్ క్రింద ఆర్జీ-2 ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో పెంచికల్‌పేట్, సింగిరెడ్డిపల్లి, చందనపూర్, న్యూ మారేడుపాక,అల్లూరు గ్రామాలకు మొదటి విడతగా 10 వేల పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిబిజికేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికారుల సంఘం అధ్యక్షులు ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, 18వ డివిజన్ కార్పొరేటర్ బాదే అంజలీదేవి, పెంచికల్ పేట్ ఫీల్డ్ అసిస్టెంట్ డి.రాజయ్య, ఎస్ఓ టు జీఎం అబ్దుల్ సలీం, డిజిఎం పర్సనెల్ అధికార ప్రతినిధి జి.రాజేంద్ర ప్రసాద్, డీజీఎం ఐఇ మురళీకృష్ణ, డీజీఎం ఫీనాన్స్ వెంకట రామచంద్ర, పర్యావరణ అధికారి సురేష్ బాబు, ఫారెస్ట్ మేనేజర్ అభిలాష్, సర్వే అధికారి దేశాయి నాయక్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ పాల్గొన్నారు.


మొక్కలను పంపిణీ చేస్తున్న జీఎం

ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వ విఫలం

నవతెలంగాణ-కోరుట్ల

నిత్యావసరాల ధరల నియంత్రణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తిరుపతి నాయక్ అన్నారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు కోరుట్ల బస్టాండ్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ(ఎం) నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి నాయక్ మాట్లాడుతూ.. దేశంలో రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు హద్దు అదుపు లేకుండా పెరుగుతున్నాయని, సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. అయినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధరల నియంత్రణలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. కార్పొరేట్ల కొమ్ముకాస్తూ నిత్యవసర సరుకులపై 12 నుండి 18శాతం జీఎస్టీ వేయడంతో ధరలు పెరిగిపోతున్నాయన్నారు. గతంలో బీజేపీ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ప్రధానంగా ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు.ఈ నిరసనలో పార్టీ కోరుట్ల పట్టణం కార్యదర్శి యెల్ల పోచన్న, నాయకులు నాగరాజు, గుమ్మడి రమేష్, కుంచెం శంకర్, విజయ్, రజియా సుల్తాన్, పవిత్ర సల్మా,తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎం)నాయకులు

అభివృద్ధికి అర్థం తెలియని మంత్రి కొప్పుల
- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్ కుమార్


మాట్లాడుతున్న నక్క విజయ్‌కుమార్

నవతెలంగాణ-వెల్గటూర్

అభివృద్ధి అంటే మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అర్థం తెలియదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్న కొప్పుల ఈశ్వర్ ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి నియోజ కవర్గంలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. సంక్షేమ శాఖ అర్థమేమిటో తెలుసుకోవాలని హితవు పలికారు. సంక్షేమం అంటే గొర్రెలు, బర్రెలు కాదని, బంధు స్కీములు కాదని, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ లాంటి చేసి, ఎంత మందికి ఉపాధి లేక తిరుగుతున్నారో కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎన్ని డబల్ బెడ్రూమ్ ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, ఎంత మంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. బుగ్గారం మండలంలో గ్రామపంచాయతీ నిధులు ప్రక్కదారి పడుతున్నాయని చుక్క గంగారెడ్డి అనే విలేఖరి సంబంధిత జిల్లా యంత్రాంగానికి నివేదిక సమర్పించగా అది నిజమని తేలినా చుక్క గంగారెడ్డిని పోలీస్ స్టేషన్లో ఉంచడం దానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో మంత్రికి ప్రజలు సరైన గుణపాఠం చెబుతున్నారని విమర్శించారు. బిఎస్పీ పార్టీ వెల్గటూర్ మండలం అధ్యక్షుడు బచ్చల స్వామి, మండల నాయకులు చెన్న శ్రీనివాస్, బచ్చల సుమన్, బచ్చల స్వామి, బివిఎఫ్ కన్వీనర్ రామడుగు వెంకటేష్, బివిఎఫ్ స్వామి, సంగ శేఖర్, సోషల్ మీడియా అంజి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
సర్పంచ్ ఎండి.మంజూరు

నవతెలంగాణ - రామగిరి

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామగిరి మండలంలోని లొంకకేసారం గ్రామ సర్పంచ్ ఎండి.మంజూరు అన్నారు. బుధవారం గ్రామంలోని పలు వార్డులను సందర్శించి మాట్లాడారు. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులతో చెత్త, చెదారం తొలగిం పజేసి బ్లీచింగ్ పౌడర్ వేయించమన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ ఒజ్జా ఓదెలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


బ్లీచింగ్ పౌడర్ వేస్తున్న జిపి కార్మికులు

కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం
రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ - యైటింక్లయిన్ కాలనీ

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమం.. ప్రతి ముఖంలో ఆనందం నిండిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం 8 కాలనీ 19వ డివిజన్‌లో పెద్దమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ సీఎం కేసీఆర్ నాయకత్వం మళ్లీ కోరుకుంటున్నారని అన్నారు. రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్లు సాగంటి శంకర్, తాళ్ల అమృత, 18వ డివిజన్ కార్పొరేటర్ బాదె అంజలీదేవి, నాయకులు విజయచంద్రశేఖర్, ముద్దసాని సంధ్యారెడ్డి, పాల్గొన్నారు.


హారతి ఇస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

బీఎస్పీలోకి కార్మిక నేత అంబటి నరేష్

నవతెలంగాణ - రామగిరి

బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ త్యాగాన్ని, ఆలోచన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోని సింగరేణిలో తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్టు సింగరేణి కార్మిక నాయకుడు అంబటి నరేష్ తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని సంబంధిత సింగరేణి ఉన్నత అధికారి ఆర్ జి-3 జనరల్ మేనేజర్‌కు అందజేశారు. అనంతరం కార్మిక నాయకులు మాట్లాడుతూ అణగారిన, బలహీన వర్గాల పక్షాన నిరంతరం పోరాడున్న వారి సంకల్పానికి వెన్నుదన్నుగా నేటి యువతరం ఆకర్షితులు అవుతున్నారని అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వాన సాధించే బహుజన రాజ్యాధికారం వల్లనే సమస్త తెలంగాణ రాష్ట్రం దోపిడీ పాలన నుండి విముక్తి అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. త్వరలోనే తన అనుచరులతో కలిసి బీఎస్పీలో చేరుతున్నట్టుగా ఆయన తెలిపారు.



కార్మిక నాయకులకు డిమాండ్ల లేఖల అందజేత

నవతెలంగాణ - యైటింక్లయిన్ కాలనీ

సింగరేణి సంస్థలో మైనింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సింగరేణి గుర్తింపు యూనియన్, వేజ్ బోర్డ్ కార్మిక సంఘాలకు చెందిన ఆర్జీ-2 డివిజన్ నాయకులకు సింగరేణి మైనింగ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఓసిపి త్రీ గని ఆవరణలో డిమాండ్స్ లేఖలను అందజేశారు. ఎంవీటీసీలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను శిక్షకులుగా నియమించడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, అనారోగ్యంతో విధులకు అనర్హులుగా పేర్కొన్న సిబ్బందిని అదే హోదాలో సర్ఫేస్ విభాగాల్లో నియమించాలన్నారు. భూపాలపల్లి కేటీకే మూడవ గని ప్రమాదానికి బాధ్యులుగా పేర్కొంటూ మైనింగ్ సిబ్బందిపై తీసుకున్న క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించాలని, అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ సిబ్బందికి సర్ఫేస్ విభాగాల్లో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, బీఎంఎస్, ఐఎన్టీయూసీ, సింగరేణి మైనింగ్ స్టాఫ్ నాయకులు ఐలి శ్రీనివాస్, జిగురు రవీందర్, ఉల్లి మొగిలి, దావు రమేష్, వడ్డేపల్లి కుమారస్వామి, సిహెచ్ ప్రసాద్, మాదాసీ రామమూర్తి, అనిల్ కుమార్, బి.బాబు, ప్రసన్నకుమార్, సదన్న, శ్రీకాంత్, రాజేష్, మదన్మోహన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.


లేఖలను అందజేస్తున్న మైనింగ్ సిబ్బంది

రైతులకు అవగానా సదస్సు

నవతెలంగాణ- మల్యాల

మల్యాల రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగు, సస్యరక్షణ, నూతన రైతుల ఎంపికపై జిల్లా హార్టికల్చరల్ ఆఫీసర్ ప్రతాప్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి పి. సురేష్ కుమార్, ఏడీఏ టెక్నికల్ జి కల్పన,, హార్టికల్చరల్ ఆఫీసర్ శ్యాం ప్రసాద్ రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ పంటలో వచ్చే కొమ్ము పురుగు నివారణ చర్యలు, ఆయిల్ పామ్ పంట సాగు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మల్యాల గ్రామ సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, మండల కోఆర్డినేటర్ రాజేశ్వర్ రెడ్డి , ఏఎంసి వైస్ చైర్మన్ ఆసం శివకుమార్, మండల వ్యవసాయ అధికారి కే చంద్ర దీపక్, ఏఈఓలు కారుణ్య, మంజుల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల అర్బన్ మండలం తారకరామనగర్‌కు చెందిన యువకులు బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్సీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కళ్లేపల్లి దుర్గయ్య, సీనియర్ నాయకులు తాటిపర్తి దేవేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దయాల శంకర్, పులి రాము, హబిబ్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం ప్లీనరీలో పాల్గొన్న జడ్పీ చైర్మెన్

నవతెలంగాణ-మంథని

సికింద్రాబాద్‌లో జరిగిన తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టుల ఫోరం ద్వితీయ ప్లీనరీ సమావేశంలో పెద్దపల్లి జడ్పీ చైర్మెన్ పుట్ట మధూకర్ పాల్గొని మాటాడారు. జర్నలిస్టులు వాస్తవిక పరిస్థితులను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుట్ట మధూకర్

పోచమ్మ తల్లి (గాజుల) ఆలయ వార్షికోత్సవ వేడుకల కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలోని పురాణిపేట శ్రీ లోకమాత పోచమ్మ తల్లి (గాజుల) ఆలయ వార్షికోత్సవ వేడుకల కరపత్రాన్ని ఆర్డిఓ నర్సింహమూర్తి ఆవిష్కరించారు. 61వ వార్షికోత్సవం ఈ నెల 11 సోమవారం నుంచి 14 గురువారం వరకు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గాజుల రాజేందర్, నాగమల్ల మనోహర్, గాజోజి రాజగోపాల్ చారి, రాఘవ చారి, రేపల్లె హరికృష్ణ, జనగామ గంగాధర్, కొయ్యడ సత్యనారాయణ, హరి వడ్లురి, ఆలయ పూజారి అంగడి మఠం చరణ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు సన్మానం

నవతెలంగాణ - ఎండపల్లి

ఎండపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థినులు బైకాని కావ్య, మామిడిపల్లి సాహితి గత నెల జరిగిన రాష్ట్రసాయి పురుగు పందాల్లో ప్రథమ,ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బైకాని కావ్యకు హైదరాబాద్‌లోని హకీంపేట్ క్రీడా పాఠశాలల, మామిడిపల్లి సాహితికి కరీంనగర్‌లోని క్రీడా పాఠశాలల్లో సీట్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఎండపల్లి గ్రామ సర్పంచ్ మారం జలంధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మైలారం సతీష్, గ్రామపంచాయతీ ఆవరణలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రభాకర్, ఉప సర్పంచ్ సతీష్, వార్డ్ సభ్యులు సతీష్, మహేష్, శ్రీనివాస్, జమున, రాధా, లక్ష్మి,గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

మున్సిపాలిటీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

నవతెలంగాణ-మంథని

మున్సిపాలిటీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మంథని మున్సిపాలిటీ ఎదుట ధర్నా నిర్వమించారు. అనంతరం కమిషనర్ సీహెచ్ సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెలలో దశల వారి పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్న మాదిరిగా రూ.21 వేలు ఇవ్వాలని, మరణించిన కార్మికులకు రూ.25 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని, 4లేబర్ కోడులను రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ నాయకులు గాడిపెల్లి మల్లేష్, చిప్పకుర్తి చందు, సింగారపు గట్టయ్య, ఎడ్ల రాజయ్య,భాగ్యస్వరూప, కవితలు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

బీఆర్‌లో చేరికలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జగిత్యాలరూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా యువజన అధ్యక్షుడు బొల్లె అనిల్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ సారంగాపూర్ ఇన్‌చార్జి మీసాల సాయిలు, జిల్లా అధికార ప్రతినిధి ధూమాల పెద్ద గంగారం, 50 మంది కార్యవర్గ సభ్యులు, మోరపల్లి గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దీకొండ రమేష్ ఆధ్వర్యంలో 15 మంది కార్యవర్గ సభ్యులు, పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆహ్వానించారు. అనంతరం గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు బేతి రాజిరెడ్డికి మంజూరైన 1,50,000 సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గంగారాం, దావ సురేష్, పాక్స్ చైర్మెన్ మహిపాల్‌రెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యులు కట్ట రాజేందర్, కమలాకర్‌రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజీ రెడ్డి, యూత్ అధ్యక్షుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

ఆరెకటిక సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఆరెకటిక సంఘం జగిత్యాల పట్టణ సంఘాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోయల్ కార్ రాజుకుమార్, ఉపాధ్యక్షుడిగా గోగికార్ నరేష్, ప్రధాన కార్యదర్శి కోయల్ కార్ శ్రీధర్, కోశాధికారి గోగికార్ శివ కుమార్, కార్యదర్శి గోగికార్ భారత్,డైరెక్టర్లు న్యాంతాబాద్ రాజు, గౌరికార్ మల్లేష్, కోయల్ కార్ నర్సోజి, గౌరవ అధ్యక్షులుగా కోయల్ కార్ కిషన్, సలహదారునిగా గోగికార్ భూమన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహకులు సుధాకర్, అజయ్, గణేష్‌లు తెలిపారు.

శిక్షణ పొందిన అభ్యర్థులు స్వయం ఉపాధి పొందాలి

నవతెలంగాణ-మంథని

శిక్షణ పొందిన అభ్యర్థులు స్వయం ఉపాధి పొందాలని నాగారం గ్రామ సర్పంచ్ బూడిద మల్లేష్ అన్నారు. బుధవారం మండలంలోని నాగారం గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదిక భవనంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సర్పంచ్ బూడిద మల్లేష్ హాజరై మాట్లాడారు. అనంతరం ఎన్ఏసీ ట్రైనర్లు, శిక్షణ పొందిన అభ్యర్థులు గ్రామ సర్పంచ్‌కు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏసి ట్రైనర్ సునీత, పంచాయతీ కార్యదర్శి అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించాలి

సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ -సిరిసిల్ల రూరల్


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ధరణి పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారంపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ధరణి, మీ సేవ, భూ సేకరణ, సీఎంఆర్ డెలివరీ లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక తదితర అంశాలపై తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బోయినిపల్లి, ముస్తాబాద్, కోనరావుపేట, గంభీరావుపేటలో ధరణి పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి క్షేత్ర రిపోర్ట్ అందజేయడంలో అలక్ష్యం చేస్తున్నారని మందలించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రైస్ మిల్లర్లు వేగంగా ఎఫ్‌సీఐకి రైస్ అందించేలా తహసీల్దార్‌లు మానిటర్ చేయాలన్నారు.

సందిగ్ధంలో మనోహర్‌రెడ్డి..

- ఐదేళ్ల నిరీక్షణ ఫలించేనా.?
- పార్టీ మారినా దక్కని ఫలితం..

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్

సుమారు దశాబ్ద కాలంగా శాసనసభకు పోటీ చేయాలన్న లక్ష్యంతో వేములవాడ నియోజకవర్గంలో రాజకీయ కార్యకలాపాలు కొనసాగిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి తాజా రాజకీయ పరిణామాలతో సందిగ్ధంలో పడిపోయారు. సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్ పార్టీలో ముఖ్య నాయకుడిగా కొనసాగిన ఏనుగు మనోహర్ రెడ్డి వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా సేవలందించారు. 2014 ఎన్నికల సమయంలో ఆది శ్రీనివాస్ తో పాటు ఆయన కూడా కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించారు. అయితే అప్పటి కాంగ్రెస్ నాయకత్వం వీరిద్దరినీ కాదని మాజీ ఎమ్మెల్యే, అప్పటి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొమ్మ వెంకటేశ్వర్లుకు అవకాశం కల్పించింది. ఫలితంగా ఆది శ్రీనివాస్ అనూహ్య రీతిలో బిజెపి అభ్యర్థిగా రంగంలోకి దిగి, కాంగ్రెస్ అభ్యర్థి బొమ్మ వెంకటేశ్వర్లును వెనక్కి నెడుతూ రెండవ స్థానంలో నిలిచి నియోజకవర్గంలో తన బలం ఏమిటో నిరూపించుకున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన ఫలితం లేదా..

కాంగ్రెస్ లో అన్యాయం జరిగిందని భావించి బీఆర్ఎస్ లో చేరిన ఏనుగు మనోహర్ రెడ్డికి మంత్రి కే తారక రామారావు తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండడం, కేటీఆర్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించడం వంటి కారణాల వల్ల మనోహర్ రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి దక్కుతుందని ఆయన అనుచరులు భావించారు. అయితే రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాలలో ఎందరో నాయకులకు రకరకాల పదవులను కట్టబెట్టిన పార్టీ అధినాయకత్వం ఏనుగు మనోహర్ రెడ్డికి నాటి నుండి నేటి వరకు ఎదురుచూపులు మాత్రమే మిగిల్చింది. 2023 ఎన్నికలకు సమయం సమీపిస్తున్న క్రమంలో గత కొంతకాలంగా ఏనుగు మనోహర్ రెడ్డి, ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. బీఆర్ఎస్ పార్టీలో కానీ, ఇతరత్రా ప్రోటోకాల్ పదవులు కానీ గత ఐదేళ్ల కాలంలో మనోహర్ రెడ్డిని వరించకపోవడంతో చివరకు పార్టీకి సంబంధించిన కార్యక్రమాలకు కూడా ఆయనను ఆహ్వానించకుండా ఎమ్మెల్యే చెన్నమనేని వర్గం దూరం పెట్టింది. రాష్ట్రంలో ఎన్నికల వేడి పెరిగి అధికార పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రకటించిన క్రమంలో వేములవాడలో సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ స్థానంలో చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థల చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావుకు బీఆర్ఎస్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు.


మంత్రి కేటీఆర్‌తో ఏనుగు మనోహర్‌రెడ్డి

లక్ష్మీనరసింహారావుకు టికెట్ తో ఈసారి కూడా నిరాశే...

వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ టికెట్ చల్మెడ లక్ష్మీనరసింహరావుకు ఇవ్వడంతో ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ తో పాటు ఏనుగు మనోహర్ రెడ్డికి నిరాశను మిగిలించగా, మరోసారి పోటీ చేసే అవకాశం కల్పించకపోవడంతో అలక బూనిన ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ ను బుజ్జగించేందుకు ఆయనను రాష్ట్ర వ్యవసాయ రంగ వ్యవహారాల ప్రధాన సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. ఈ నిర్ణయంతో ఆయన పూర్తిస్థాయిలో సంతృప్తి చెందారా లేదా అనే విషయం పక్కన పెడితే పార్టీలో తనకు తగిన ప్రాధాన్యత కల్పిస్తారన్న మంత్రి కేటీఆర్ హామీతో ఐదేళ్ల కింద బీఆర్ఎస్ లో చేరిన ఏనుగు మనోహర్ రెడ్డికి ఈ వ్యవహారం పుండు మీద కారం చల్లినట్లుగా మరింత ఇబ్బందికరంగా మారింది. తమ నాయకుడు మనోహర్ రెడ్డిని పార్టీ అధినాయకత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తోందంటూ ఆయన అనుచరులు, అభిమానులు సైతం ఆవేదనకు లోనయ్యారు. ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ కోసం రాష్ట్రంలో ఇప్పటివరకు లేని పోస్టును కొత్తగా రూపొందించి మరీ అప్పగించిన ప్రభుత్వం, తమ నాయకుడిని పట్టించుకోకపోవడాన్ని వారుజీర్ణించు కోలేకపో తున్నారు.ఇటీవల పలు సందర్భాలలో సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాలలో జరిగిన అనేక కార్యక్రమాలలో మంత్రి కేటీఆర్ పాల్గొని ఏనుగు మనోహర్ రెడ్డిని ప్రత్యేకంగా పిలిచి మాట్లాడిన సందర్భాలను వారు గుర్తు చేసుకుంటూ మంత్రి కేటీఆర్ తో ఇంత సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ తమ నాయకుడికి పార్టీ తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా అన్యాయం చేస్తుండడం వెనుక గల కారణాలు ఏమిటన్న విశ్లేషణలో పడిపోయారు. అయితే కొంతకాలంగా మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా అందుబాటులో లేకపోవడంతో చేసేదేమీ లేక ఏనుగు మనోహర్ రెడ్డి మౌనాన్ని ఆశ్రయించారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, పార్టీ అధినాయకత్వం ఎవరికైనా ఏదైనా పదవి ఇవ్వాలని భావించిన మరుక్షణం ఆ నిర్ణయం నిమిషాలలో అమలయ్యే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఏనుగు మనోహర్ రెడ్డి పట్ల వ్యవహరిస్తున్న తీరు పార్టీ శ్రేణులలో అనుమానాలను మరింత పెంచుతోంది.


సీఎం కేసీఆర్‌తో ఏనుగు మనోహర్‌రెడ్డి

మంత్రి విదేశీ పర్యటన ముగిసిన తర్వాతనా ఏమైనా.

మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్నట్లు తెలియడంతో తమకు జరిగిన అన్యాయంపై ఆయనను కలిసి చర్చించాలని ఏనుగు మనోహర్ రెడ్డిపై ఆయన అనుచరులు ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఖచ్చితంగా రాష్ట్రస్థాయి పదవి ప్రకటించి తీరాలని పట్టుబట్టాలని, లేనిపక్షంలో తదుపరి కార్యాచరణకు సిద్ధం కావాలని సూచిస్తున్నట్లు సమాచారం. పార్టీ నుండి న్యాయమైన స్పందన లేని పక్షంలో ఇకపై పార్టీలో కొనసాగడంలో అర్థం కూడా ఉండబోదని వారు తెగేసి చెబుతున్నట్లు తెలుస్తోంది.

సిట్టింగులలో టికెట్లు నిరాకరించిన వారిలో ఒకరైన వెలమ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ కు ఆఘమేఘాలపై క్యాబినెట్ హోదాతో రాష్ట్ర వ్యవసాయ రంగ ప్రధాన సలహాదారు పదవి కట్టబెట్టిన క్రమంలో, టికెట్టు ఆశించి భంగపడ్డ ఏనుగు మనోహర్ రెడ్డి లాంటి ఇతర సామాజిక వర్గం నేతలకు ఆ పార్టీ నాయకత్వం ఏదైనా సముచితమైన పదవి ఇచ్చి గౌరవిస్తుందా లేక వెలమలు మాత్రమే మాకు ముద్దు అనే అపప్రదను భరించడానికి సిద్ధమవుతుందా అనేది వేములవాడ పొలిటికల్ సర్కిల్ లో ఇప్పుడు చక్కర్లు కొడుతున్న ప్రశ్న

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

సీపీఐ(ఎం) జిల్లా నాయకురాలు విమల



నవతెలంగాణ- కోనరావుపేట : అధిక ధరలు నివారించాలి బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకురాలు పుజం విమల అన్నారు. బుధవారం మండలంలోని నిమ్మపెల్లి గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన సంక్షేమ పథకాలు డబుల్ బెడ్ రూమ్ మూడెకరాల స్థలం తో పాటు వివిధ సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని ఆమె ప్రభుత్వాలను డిమాండ్ చేశారు

గడపగడపకు బీఎస్‌పీ

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : గడగడపకు బీఎస్పీ పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో జెండా గద్దెలను నిర్మించాలని బీఎస్పీ సిరిసిల్ల ఇంచార్జీ బట్టు రాంచంద్రం పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి యారపు రాజాబాబు, జిల్లా ఈసి మెంబర్ తాటిపెల్లి అంజయ్య, సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షులు లింగంపల్లి మధుకర్, ఎల్లారెడ్డిపేట మండల ఇంచార్జీ లింగాల సందీప్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు నీరటి భాను, మండల ప్రధాన కార్యదర్శులు సంజీవ్, హైదర్, కార్యదర్శులు బోడ్డు కిషన్, బోడ్డు నాంపెల్లి, ఎల్లారెడ్డిపేట టౌన్ ప్రెసిడెంట్ లింగాల నిలేష్, గడ్డి ధర్మేందర్, గడ్డం నవీన్, నీరటి సుభాష్, మాస నరేందర్‌లు పాల్గొన్నారు.

కోతకు గురైన ఈహెటి విద్యుత్ టవర్

యుద్ధప్రతిపాదికన మరో టవర్ నిర్మాణం

నవతెలంగాణ - మెట్‌పల్లి

మెట్‌పల్లి డివిజన్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా డివిజన్‌లోని సాతారం గ్రామ శివారులో ఉన్న ఈహెటి విద్యుత్ టవర్ వాగు ప్రవాహ ఉధృతికి కోతకు గురైంది. పక్కన ఉన్న 273 ఈహెచ్టీ టవర్ కూలిపోయే ప్రమాదం ఉన్నందున కోరుట్ల, వేములవాడ నియోజకవర్గాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జగిత్యాల జిల్లా ఎస్‌ఈ సత్యనారాయణ తెలిపారు. ఈ టవర్ వద్ద మరో టవర్ నిర్మాణన్ని యుద్ధప్రతిపదికగా చేపట్టామన్నారు. ఈ టవర్ ద్వారా పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలోని రెండు నియోజక వర్గాల పరిధిలోని మూడు 132కేవీ సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. రామగుండం నుండి 132కేవీ ధర్మారం, పెద్దపల్లి జిల్లా గోధూర్ 132కేవీ జగిత్యాల, కోరుట్ల ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఈ లైన్లుకు డబుల్ సర్క్యూట్‌లు ఈ టవర్ నెంబర్ - 273 పైననే ఉన్నవని, ఈ బాహుబలి కండక్టర్‌ను మార్చే క్రమంలో మూడు132కేవి సబ్ స్టేషన్లు కోరుట్ల, గోదూరు, కథలాపూర్ పరిధిలో గల 44, 33/11 సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరాలో అంతరాయము కలుగుతుందని తెలిపారు. వర్షాల వల్ల రైతులు పంటలకు వినియోగం భారీగా తగ్గిన ప్రస్తుత సమయం అనువైనదిగా భావించి టవర్ పునర్నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ప్రత్యామ్నాయంగా పోచంపాడు నుండి విద్యుత్ సరఫరాకు తాత్కాలిక ఏర్పాట్లు చేసామని, రెండు మూడు రోజుల్లో సరఫరాలో కొద్దిగా అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని రైతులు, వినియోగదారులు విద్యుత్ సంస్థకు సహకరించాలని కోరారు.


నూతన టవర్ నిర్మాణం

పోషణ లోపాన్ని నివారించేందుకు చిరుధాన్యాలతో అదనపు ఆహారం

సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, అధికారులు

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్

చిన్నారుల్లో పోషణ లోపాన్ని నివారించడానికి చిరుధా న్యాలతో అదనపు ఆహారం అందిస్తున్నామని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ అరుణ తెలిపారు. పోషణ మాసంలో భాగంగా జిల్లా ప్రజా పరిషత్ క్యాంప్ కార్యాలయంలో పోషణ మాసం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాను పోషణ లోపరహిత, ఎనిమిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. మంత్రి కె.తారకరామారావు మార్గదర్శనం మేరకు జిల్లాలో ప్రత్యేకంగా ప్రతి రెండవ శనివారం మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. పోషణ లోపాన్ని నివారించేందుకు ప్రత్యేకంగా చిరుధాన్యాలతో అదనపు ఆహారం అందజేస్తున్నామని తెలిపారు. పౌష్టిక లోపాలు ఉన్న బాల, బాలికలను గుర్తించి వారి ఎదుగుదల కోసం పోషణ మాసం కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో అరు సంవత్సరాలలోపు ఉన్న పిల్లలు సరైన ఎత్తు, బరువు కలిగి ఉండేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. స్థానిక సంస్థల భాగస్వామ్యంతో అంగన్వాడీ పిల్లలకు, పోషణ లోపంతో బాధపడుతున్న వారికి అదనపు ఆహారం రాగిజావా, రాగి లడ్డూ, రాగి పాయసం లాంటి చిరుధాన్యాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, సీడీపీఓ ఎల్లయ్య, ఉమెన్ ఎంపవర్ మెంట్ కో ఆర్డినేటర్ రోజా,ఏసీడీపీఓ సుచరిత, సూపర్ వైజర్స్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపేట రిజర్వాయర్‌కు నరసయ్య పేరు పెట్టాలి

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్:

మల్కపేట రిజర్వాయర్‌కు మాజీ ఎమ్మెల్యే కర్రోళ్ల నర్సయ్య పేరు పెట్టాలని బీఎస్పీ నేతలు డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కర్రోళ్ల నరసయ్య నిజాం, దొరలు, భూస్వాములపై చేసిన పోరాటం మరువలేనిదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించిన నర్సయ్యకు కనీసం పింఛను కూడా ఇప్పించని ద్రోహి చెన్నమనేని రాజేశ్వర్‌రావు అని మండిపడ్డారు. రాజేశ్వరరావు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న దాఖలాలే లేవని, కమ్యూనిస్టు జెండా కింద దశాబ్దాల కాలం అధికారంలో ఉండి ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. అలాంటి ద్రోహి పేరు మల్కపేట రిజర్వాయర్‌కు పెట్టడం అమానుషమన్నారు. ప్రభుత్వం వెంటనే కర్రోల్ల నర్సయ్య స్వగ్రామం మల్కపేటలో నిర్మిస్తున్న రిజర్వాయిర్‌కు నర్సయ్య పేరు పెట్టి ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, కార్యదర్శి అంకణి భాను, ఎనగందుల వెంకన్న, కోఆర్డినేటర్ మేకల మునీందర్, తదితరులు పాల్గొన్నారు.

10 నుండి 17 వరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో

రైతాంగా సాయుధ పోరాట వారోత్సవాలు

కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:

పట్టణంలోని బి వై నగర్ సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ మాట్లాడుతూ భూమి కొరకు, భుక్తి కొరకు, వెట్టి చాకిరి విముక్తి కొరకు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ వ్యాప్తంగా పేరేందిన పోరాటం చరిత్రలో నిలిచి పోయిందన్నారు. ఆనాడు రజాకార్లు, దొరలు, భూస్వాములు చేసిన దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి కమ్యూనిస్టు నాయకులు నాలుగువేల మంది అమరులైనారని తెలిపారు. పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి, పదివేల గ్రామాలను నైజాం ప్రభుత్వం నుంచి విముక్తి చేయించడం జరిగిందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు మాత్రమే అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి బీజేపీకీ ఏలాంటి సంబంధం లేదన్నారు.వారోత్సవాలు భాగంగా సెప్టెంబర్ 10న చాకలి ఐలమ్మ వర్ధంతి సభలు జిల్లా వ్యాప్తంగా చేయనున్నట్లు తెలిపారు. 11న పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి అమతలాల్ శక్లా స్తూపానికి, బద్దం ఎల్లారెడ్డికి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17న సిరిసిల్ల బివై నగర్ జండా చౌరస్తాలో బహిరంగ సభ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట నాటిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, శ్రీరామ సదానందం, సూరం పద్మ, వెలిగేటి రాజశేఖర్, సందుపట్ల పోచమ్మ లు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్ట్

150 గ్రాముల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-సిరిసిల్ల క్రైం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేందర్

గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం సిరిసిల్ల పట్టణం బైపాస్ రోడ్డులోని ఎల్లమ్మ గుడి ప్రాంతంలో తంగళ్ళపల్లి మండలానికి చెందిన పులి అరుణ్, గంగాధర సాగర్ అనే యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. వీరి నుంచి 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీరు గత కొన్ని రోజులుగా గంజాయి సేవిస్తున్నారని, గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి వేరే యువకులకు ఎక్కువ డబ్బులకు అమ్మడం,గంజాయి సేవించడం అలవాటుగా మార్చుకున్నారని తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. వీరికి గంజాయి సరఫరా చేసిన వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఎవరైనా గంజాయి సేవించిన,వ్యాపారం చేస్తున్నట్లు తెలిసినా తమకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవి శంకర్

నవతెలంగాణ-బోయినిపల్లి


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

మండలంలోని కొదురుపాక గ్రామంలో 10మందికి బీసీ చేయూత పథకం కింద మంజూరైన చెక్కులను చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావు పంపిణీ బుధవారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో అన్ని వర్గాల వారికి, అన్ని మతాలు కులాల వారికీ సమచిత న్యాయం, సంక్షేమ పాలన అందుతోందన్నారు. అనగారిన వర్గాల అభివృద్ధి కోసం దళిత బంధు, బీసీ వృత్తుల వారికి చేయూత, మైనారిటీలకు ఆర్థిక సాయం ప్రవేశపెట్టారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ గెలవబోతుందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్లపల్లి వేణుగోపాల్, వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు కొనుకటి లచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, కోఆప్షన్ సభ్యుడు అజ్జు, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూశం రమేష్

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:


సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముశం రమేశ్

పట్టణంలోని డివైడర్ , పార్కుల పనిచేయు కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందించడం లేదని సీఐటీయూ సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేతనాలు నెల నెల అందక పోవడం వలన కార్మికులు పస్తులుండి పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అడిగిన ప్రతిసారి బిల్లులు రాలేదని, వచ్చిన తర్వాత అందిస్తామని కాంట్రాక్టర్లు పేర్కొనడం పరిపాటిగా మారిందన్నారు. నిలదీసీ అడిగితే పనినుంచి తొలగిస్తామని బెదిరించడం సరైంది కాదన్నారు. ఓ కార్మికురాలికి తన భర్తకు వైద్యం చేయించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని.. వేతనం వస్తే వైద్యం చేయించాలని చూస్తోందని వాపోయారు. ఇప్పటికైనా కార్మికులకు బకాయి వేతనం వెంటనే అందించాలని, లేకుంటే పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

సిరిసిల్లలో రియల్టర్ బలవన్మరణం

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్:

అప్పులతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరుకు చెందిన బెజ్జారపు రమేష్ (40) కల్లుగీత వృత్తిపై ఆధారపడి కొంతకాలం జీవనం సాగించారు. కుటుంబ పోషణ భారం కావడంతో కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. వృత్తిపరమైన సమస్యలతో పాటు అప్పులు ఎక్కువై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఆర్థిక సమస్యల మూలంగా తీవ్రంగా మనస్తాపం చెంది మంగళవారం ఇంట్లో ఉరేసుకుని బలవన్మరానికి పాల్పడ్డాడు. మృతునికి భార్య బాలామణి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలి'

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ :

తెలంగాణ ప్రజలు మేల్కొని మరో ఉద్యమానికి సంసిద్ధం కావాలని తెలంగాణ అమరుల ఆశయ సాధన సమితి జేఏసీ జిల్లా చైర్మన్ గరిపెల్లి ప్రభాకర్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో టీఏఏసీ జేఏసీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిజాం సర్కార్ రజాకార్లతో నియంతృత్వ పాలన చేసిందని, తెలంగాణ ప్రజలు అన్ని రకాలుగా వంచించబడ్డారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తెలంగాణను సర్దుబాటు చేయడం కోసం ప్రభుత్వ భూములు అమ్మడం, రహదారులు ఏండ్ల తరబడి లీజుకు ఇవ్వడం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. టీఏఏసీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లాలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తామని, రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని కరపత్రం ద్వారా ప్రతి ఓటరుకు చేరవేస్తామన్నారు. సామాజిక తెలంగాణ సాధన కోసం ప్రజలు సంసిద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. సమావేశంలో టీఏఏసి జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

'బలగం' సినిమా సర్పంచ్ ఇకలేరు

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్ :

'బలగం' సినిమాలో సర్పంచ్ పాత్ర పోషించిన కీసరి నర్సింగం (65) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన కీసరి నర్సింగం కొంత అనారోగ్యంతో మంచం పట్టాడు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో మంగళవారం కన్నుమూశారు. నర్సింగం గ్రామంలో పోస్టుమ్యాన్ విధులు నిర్వహిస్తునే, నాటకాల పట్ల ఆసక్తి కనబరిచే వారు. గ్రామాల్లో వీధి నాటకాలను వేస్తూ, పలువురిని మెప్పించే వారు. అంతేకాకుండా తుపాకీ రాముడు వేషం ధరించి మెప్పించడంతో పాటు ఇటీవల బలగం సినిమాలో సర్పంచ్ పాత్ర ధరించి ప్రేక్షకుల మన్ననలను పొందారు. నర్సింగం అంతిమయాత్రలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, డిపిఆర్ఓ దశరథం, బలగం సినిమా నటులు, జిల్లా కళాకారులు, మండల ప్రజాప్రతినిధులు నివాళులు అర్పించారు.

హమాలీ భవనానికి స్థలం కేటాయించాలి

నవతెలంగాణ- కోనరావుపేట

మండల కేంద్రంలో హమాలీ సంఘం భవన నిర్మాణానికి ఆరుగుంటల స్థలాన్ని కేటాయించాలని బుధవారం తహసీల్దార్ విజయప్రకాష్‌రావుకు హమాలీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దండు శ్రీనివాస్, వార్డు సభ్యులు కాసర్ల రాజు, యాస శ్రీనివాస్, హమాలీ సంఘం అధ్యక్షుడు లోకుర్తి రాజునరసయ్య, లింబయ్య, దేవయ్య రాజు, చంద్రయ్య, శంకర్,భూమయ్య తిరుపతి, లచ్చయ్య, రవి దయాకర్ భూపతి పాల్గొన్నారు

విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మహ్మద్ లతీఫ్ మాట్లాడుతూ విద్యతో పాటు విలువలను నేర్పుతున్న గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణతో అందరినీ ఆకర్షించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థుల ప్రదర్శనను తిలకించి హర్షం వ్యక్తం చేశారు.

అంగన్వాడి టీచర్ల సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు

నవతెలంగాణ-బోయినిపల్లి




రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు గురుజాల శ్రీధర్ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లతో కలిసి తహసీల్దార్ పుష్పలతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం, పింఛన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిలా కార్యదర్శి కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యురాలు సూరం పద్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ- కొనరావుపేట

కోనరావుపేట మండలంలోని అంగన్వాడి కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల డిప్యూటీ తహసిల్దార్ సత్యనారాయణకు బుధవారం రోజున వినత పత్రాన్ని అందజేశారు. తీవ్ర అసంతృప్తిలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు ఈనెల 11నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె బాట పట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు కల్హారి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత,ఉపాధ్యక్షురాలు ఓరగంటి శ్యామల,అంగన్‌వాడీ టీచర్లు అరుణ,సునీత,చంద్రకళ,దేవేంద్ర, సునీత,అంజలి,షీలా,సంతోష విజయ,పాల్గొన్నారు.

భారీ వరదలకు కూలిన వంతెన

నవతెలంగాణ-బోయినిపల్లి



మండల కేంద్రం నుండి కొదురుపాక ఎక్స్‌రోడ్డుకి వెళ్లే రహదారిలో ఇండో జర్మనీ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న కల్వర్టు వంతెన ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల కూలిపోయింది. వంతెన కూలిపోవడంతో ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రజలు కోరారు.

సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-జగిత్యాల: క్రమబద్ధీకరణతోనే ఎస్ఎస్ఏ ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని, సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలో నిరాహార దీక్ష చేస్తున్న సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటి పర్తి జీవన్ రెడ్డి సందర్శించి, సంఘీభావం తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, నిరుద్యో గులకు పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారని, రాష్ట్రం ఏర్పడితే ఉన్న ఉద్యోగాలతో పాటు మరిన్ని ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తే నిరాశే ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్ల గడుస్తున్న సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రాథమిక స్థాయి పాఠశాలలో మౌలిక వసతుల కల్పన ప్రధాన పాత్ర పోషిస్తున్నార, క్షేత స్థాయిలో అన్ని నివేదికలు రూపొందించి, అడుగ డుగునా విద్యా వ్యవస్థ కు అండగా ఉంటుమన్నారు. ఎన్నికల షెడ్యూలు కు ముందే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు.

అన్ని వర్గాకుల కేసీఆర్ న్యాయం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:
రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సీఎం కేసీఆర్ న్యాయం చేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం రాత్రి తిలక్ నగర్ విశ్వం కమ్యూనిటీ హాల్‌లో రామగుండం నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సంఘ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారికి ప్రభుత్వం ఆర్థికంగా భరోసా కల్పిస్తుందన్నారు. నాయి బ్రాహ్మణులకు, రజకులకు వారి వ్యాపార నిమిత్తం ఉచితంగా 250 యూనిట్ల కరెంటు, కులవృత్తులకు లక్ష రూపాయల సాయం చేస్తున్నామనఆనరు.



.మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

అన్నదాన సత్రం భవనంకు భూమి పూజ

గోదావరిఖని రాంమందిర్ ఏరియాలోని శ్రీ కోదండ రామాలయంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన సత్ర భవనం భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోరుకంటిచందర్ ముఖ్య అతిథిగా హాజరై, భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి దీక్షపరులకు అన్నదాన సత్ర భవనం భూమి పూజా కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, నగర కమీషనర్ సిహెచ్.నాగేశ్వర రావు, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, కార్పొరేటర్లు అడ్డాల గట్టయ్య, అడ్డాల స్వరూప రామస్వామి, బాలరాజ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యులు చెరుకు బుచ్చిరెడ్డి, అయ్యప్ప కమిటీ చైర్మన్ గుమ్మడి కుమార స్వామి, నాయకులు నారాయణదాసు మారుతి, జేవి రాజు, నూతి తిరుపతి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ-బుగ్గారం/ ధర్మపురి
తెలంగాణ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమే అని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా బుధవారం ధర్మపురి నియోజకవర్గంలోని సిరికొండ, మద్దునూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మలతో మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దానికి నిదర్శనమే నేటి రైతుబీమా, రైతు బంధు, కల్యాణలక్ష్మి, పథకాలేనని అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

దళితులను ఆదుకోవడానికి దళితబంధు పథకాన్ని తీసుకొచ్చి రూ.10లక్షలు అందజేస్తున్నట్టు చెప్పారు. అనంతరం గ్రామాల్లో మహిళ, కుల సంఘ భవనాల అభివృద్ధికి రూ.40 లక్షల ప్రొసీడింగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఎంపీపీ బాదినేని రాజమణి, సిరికొండ గ్రామ సర్పంచ్ చెన్నమల్ల దివ్య-ప్రవీణ్, పార్టీ మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేష్,వైస్ ఎంపీపీ జోగినిపల్లి సుచందర్, కో -ఆప్షన్ నెంబర్ అబ్దుల్ రహమాన్,రైతు సమన్వయ సమితి అధ్యక్షులు తాండ్ర సత్యనారాయణరావు, పార్టీ మాజీ మండల అధ్యక్షులు చిర్నెని మల్లేశం, దాసరి లచ్చయ్యవివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎస్ఐ ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్స్‌ను అభినందించిన సీపీ

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:
రామగుండం కమిషనరేట్ స్పెషల్ పార్టీ (డిస్ట్రిక్ట్ గార్డ్స్)లో పని చేస్తున్న 2020 బ్యాచ్ కానిస్టేబుల్స్ బొంకూరి మహేష్ సివిల్ పీసీ, ఎండి.సైఫ్ అలీ ఏఆర్ పీసీ ఎస్ఐలుగా సెలక్ట్ అయ్యారు. కాగా వారిని బుధవారం సీపీ ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు.



అభినందిస్తున్న పోలీస్ కమిషనర్

పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుంది

రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరీ

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:
పోలీసుశాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ అన్నారు. కమిషనరేట్ పరిధి ఆర్మేడ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతులు పొందిన 29 మందిని సీపీ అభినందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పని చేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ హుల్ హక్, ఏఆర్ ఏసీపీ మల్లికార్జున్ , ఆర్ఐలు దామోదర్, విష్ణు ప్రసాద్, రామగుండం కమిషనరేట్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం లు పాల్గొన్నారు.



అభినందిస్తున్న సీపీ

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-ముత్తారం
మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన పర్శ రామ స్వామికి రూ.22,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షులు అల్లం కుమారస్వామి బుధవారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మంపల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బగ్గని మొగిలి, గ్రామ యువజన శాఖ అధ్యక్షులు పందుల రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన సార్ల మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుమారుడైన సార్ల ఓదెలు ఏడో తరగతి బ్యాచ్ మిత్రులు అందరు కలిసి దశదినకర్మ కార్యక్రమానికి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. దేవుని భాను కుమార్, కందుల నరేష్, కట్టుకోజుల మధుకర్, సుదాడి మధుకర్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ-ఓదెల
ఓదెల మండలంలోని పిట్టలల్లేపల్లి, నాంసానిపల్లి, మడక, ఓదెల, కనగర్తి, ,బాయమ్మపల్లి, కేశవపూర్ గ్రామాల నుంచి నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మాజీ ఎమ్మెల్యే టిపిసిసి ఉపాధ్యక్షుడు చింతకుంట్ల విజయ రమణారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ రావు, అన్నయ్య గౌడ్, గోపగాని సాయ గౌడ్, ఆళ్ల సుమన్ రెడ్డి,అంబాల యాదగిరి సమ్మయ్య, శంకర్, నాయ కులు పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న గ్రామస్తులు

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడికి పరామర్శ

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మల్లవజుల వంశీ, తెలంగాణ వికాస సమితి ఉపాధ్యక్షులు విజయనంద్ తల్లి అనసూయ దేవి మృతి చెందగా బుధవారం స్థానిక మార్కండేయ కాలనీలో నివాసం ఉంటున్న వారి ఇంటికి ప్రభుత్వ చీఫ్ విప్ బాల్క సుమన్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వెళ్లి పరామర్శించారు. అనసూయదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట రామగుండం కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, టిబిజికెఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య నాయకులు కౌశిక హరి, కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్ ఉన్నారు.



నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్

సోమారపు గెలుపునకు కృషి చేస్తాం

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ గెలుపునకు నిరంతరం కృషి చేస్తామని అంతర్గాం మండల బిజెవైఎం అధ్యక్షుడు ధరణి సంజీవ్ అన్నారు. అంతర్గాం మండలం పొట్యాల, వీసంపేట్ గ్రామాల్లో బిజెవైఎం గ్రామ కమిటీలను మంగళవారం రాత్రి వేశారు. బిజెవైఎం పొట్యాల గ్రామ అధ్యక్షునిగా బాకీ నరేష్, ఉపాధ్యక్షులుగా గుమ్మల రాజేందర్, వీసంపేట గ్రామ అధ్యక్షునిగా బోడకుంట రవి, ఉపాధ్యక్షులు కొండపాక శశి కుమార్‌లను నియమించారు.

జై గణేష భక్తసమితి జిల్లా అధ్యక్షుడిగా సతీష్

నవతెలంగాణ-రాయికల్
జై గణేశా భక్త సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా రాయికల్ పట్టణానికి చెందిన సామల్ల సతీష్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు రాజేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగాధరి సురేష్ నియామక పత్రం బుధవారం అందజేశారు. పరిరక్షణ ధ్యేయంగా ప్రజలకు మట్టి వినాయకులపై అవగాహన కల్పిస్తానని పేర్కొన్నారు.

దళితబంధు యూనిట్ పరిశీలన

నవతెలంగాణ-మేడిపల్లి
భీమారం మండలంలోని దేశాయిపేట గ్రామానికి చెందిన దళితబంధు పథకం కింద వచ్చిన యూనిట్‌ను బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిజమైన లబ్ధిదారులకు దళితబంధు అందడం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా యూనిట్లను తీసుకొని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-మల్లాపూర్
మల్లాపూర్ మండల కేంద్రంలో పర్యటించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ కుమార్ పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వీర్ సింగ్ నాయక్ అందజేశారు. పార్టీ మండల మండల అధ్యక్షుడు సాదుల్ల, పట్టణ అధ్యక్షులు కాకరా మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి నిమ్మల రాములు, ఉపాధ్యక్షులు చిప్ప రాజశేఖర్, ఎండి రఫీ యుద్దీన్, మహ దేవ్ ,సాహెబ్, గజల్లి రాజ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె నోటిసు అందజేత

నవతెలంగాణ-మంథని
అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్టు ఐసీడీఎస్, సీడీపీవోకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జి. జ్యోతి మాట్లాడుతూ.. ఆగస్టు 18న జరిగిన చర్చల్లో రాష్ట్ర మంత్రి ఇచ్చిన హామీలపై స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో సమ్మెకు పోవాల్సి వస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు బి వనజారాణి, సుగుణ,బి కనకలక్ష్మి,సులోచన,సునీత,శోభరాణి, రాజ్యలక్ష్మి,రాజేశ్వరి,సజన,మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నోటిస్ అందజేస్తున్న అంగన్‌వాడీలు

మల్లాపూర్:అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు సంధ్యారాణి ఆధ్వర్యంలో తహసిల్దార్ వీర్ సింగ్‌కు వినతి పత్రం బుధవారం అందజేశారు. అంగన్వాడీ నాయకురాలు ఇందిరా, సంధ్యారాణి ,రజిత, వకుల, జ్యోతి, గంగాభవాని ,రాధా, వసంత ,రజిత, భాగ్య ,మమత, వనిత, లావణ్య ,స్నేహ ,శ్రీదేవి, శోభ, రాజమ్మ ,రజిత, యమున, సఫియా, మేరీ, పుష్ప, అరుణ, సుజాత ,కృష్ణవేణి ,స్వరూప, శశికళ తదితరులు పాల్గొన్నారు

ముత్తారం:అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ బి.రాజేశ్వరీకి బుధవారం జెఏసి నాయకురాళ్లు వినతి పత్రాన్ని అందజేశారు. వినతి అందించిన వారిలో శోభ, బి.రమాదేవి, బి.సత్యవతి, జి.సుజాత, డి.సునీత, ఎన్.పద్మ, పి.రజిత, బి.తిరుపతమ్మ, ఎస్.రమ, ఎస్.రమాదేవీ తదితరులున్నారు.

ఇంటింటా అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-గోదావరిఖని:
అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించుకునేలా స్వశక్తి సంఘాల సహకారంతో ఇంటింటా అవగాహన కల్పించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణ శ్రీ కోరారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం మెప్మా ఆర్ పి లతో సమావేశం నిర్వహించారు.. కొత్త ఓటు నమోదుకు ఫారం 6 పూర్తి చేసి, ఫొటో , ఆధార్, ఎస్ఎస్‌సి ధృవీకరణ పత్రం జిరాక్స్ ప్రతులను సేకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, తహశీల్దార్ కుమారస్వామి, మెప్మా డిఎంసి రజనీ, రామగుండం పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు నూనె లతామోహన్, మెప్మా టిఎంసి శ్వేత, కమ్యూనిటి ఆర్గనైజర్లు, ఆర్‌పిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారుల సమన్వయ సమావేశం

నవతెలంగాణ - రామగిరి
రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంథని, ముత్తారం పోలీస్ స్టేషన్ల సరిహద్దులో ఉన్న జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కాటరం సబ్ డివిజన్ పోలీస్ అధికారులుతో రామగిరి మండల కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఏసీపీ తులా శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల దృష్ట్యా జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒక ప్రత్యేక ప్రణాళికను రూపొందించడానికి సమావేశమయ్యామని అన్నారు. అలాగే ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా, మద్యం, నగదు సరఫరా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించామని తెలిపారు. సమావేశంలో మంథని సీఐ సతీష్, గోదావరిఖని 2 టౌన్ సీఐ వేణుగోపాల్, మహాదేవపూర్ సీఐ కిరణ్, కాటారం సీఐ రంజిత్‌రావు, రామ గుండం ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మంగిలాల్, మంథని ఎస్ఐ కిరణ్, రామగిరి ఎస్ఐ రవిప్రసాద్, ముత్తారం ఎస్ఐ మధుసూదన్‌రావు, కొయ్యూరు ఎస్ఐ నరేష్, కాళేశ్వరం ఎస్ఐ లక్ష్మణరావు, మహదేవపూర్ ఎస్ఐ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

రేపు అన్ని జీఎం కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి కార్మికులకు 11వ వేజ్ బోర్డు ఏరియర్స్ విడతల వారిగా కాకుండా ఒకేసారి చెల్లించాలని, లాభాల్లో 35 శాతం వాటా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ఎదుట ఒక రోజు నిరాహార దీక్ష చేయనున్నారు. బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్లో జరిగిన ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడారు. 11వ వేజ్ బోర్డు ఏరియర్స్ ఒకేసారి చెల్లిస్తామని కోల్ ఇండియా చైర్మన్ మే 20 న కోల్ కతా లో జరిగిన వేజ్ బోర్డు ఒప్పందం సందర్భంగా కార్మిక సంఘాల కు చెప్పాడని ఆయన అన్నారు. ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలని ఏఐటీయూసీ గత నెలలో అన్ని గనులు డిపార్మెంట్లు, ఓసిపి లలో అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినట్టు తెలిపారు. ఏఐటియుసి చేసిన పోరాటాల వల్ల యాజమాన్యం స్పందించి రెండు వాయిదాలలో ఏరియర్స్ చెల్లిస్తామని, లేకుంటే 2800 కోట్లు ఐతే కార్మికుల కు ఏరియర్స్, లాభాల్లో వాటా, దీపావళి బోనస్ చెల్లిస్తామని ప్రకటించడం కార్మికుల ను తప్పుదోవ పట్టించే విధంగా యాజమాన్యం చర్యలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కే.స్వామి, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్, నాయకులు కన్నం లక్ష్మి నారాయణ, ఎస్ వెంకట్ రెడ్డి, బుర్ర భాస్కర్, ఎం.చక్రపాణి, ఎం.దేవేందర్ రెడ్డి, జెరిపోతుల దేవయ్య, ఉప్పులేటి తిరుపతి, ఏ.వి.ఎస్.ప్రకాష్, శనగల శ్రీనివాస్, గుడాల శ్రీధర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని గడి బురుజు వద్ద గల విశ్వశాంతి హై స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కృష్ణుడి విగ్రహానికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపిక కృష్ణుడి వేషధారణతో ఉట్టి కొట్టారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బ్రహ్మన్నగారి శంకం శర్మ, ప్రిన్సిపాల్ చీటీ సత్యంరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంథని:శ్రీకృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, గోపిక వేష ధారణలో అలరించారు. మంథని పట్టణంలోని కాకతీయ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం నిర్వహించగా చిన్నారులకు కృష్ణుడు, గోపిక వేషధారణలతో అల రించారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్లు రవి కిరణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక రావుల చెరువుకట్టలోని అంగన్‌వాడీ సెంటర్-4లో చిన్నారులు రాధ కృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. అంగన్వాడీ టీచర్ ఉదయశ్రీ తోపాటు చిన్నారులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని పలు పాఠశాలల్లో బుధవారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. బ్రూక్లిన్, సుర్యోదయ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకలల్లో చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలరించారు.





జగిత్యాల :జగిత్యాల పట్టణంలోని శివ వీధిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం నిర్వహించారు.విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పాల్గొని శ్రీకృష్ణుడి చిత్ర పటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జూలపల్లి:జూలపల్లి మండలంలో బుధవారం జుపిటర్, న్యూ బ్రిలియంట్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుని వేషాధారణలో ఉట్టికొట్టారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొండ సత్యనారాయణ, కుమార్, విద్యార్థుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగిరిష:రామగిరి మండలం బేగంపేట గ్రామంలోని సాయి ప్రగతి విద్యానికేతన్‌లో బుధవారం ముందస్తు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణ - గోపిక వేషధారణలో ఆటపాటలతో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్స్ శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోదావరిఖని:కృష్ణవేణి విద్యాసంస్థలలో బుధవారం ముందస్తుగా వేడుకలను నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడి వేషధారణలో గోపిక వేషధారణలో చాలా ఉత్సాహంతో... ఆనందంతో ...కోలాహలంతో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి హాజరై పిల్లల యొక్క కార్యక్రమాలను తిలకించి, చిన్నారులను ఆశీర్వదించారు.

ప్రమాదపు అంచున ప్రయాణం

- భయాందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలం దరియాపూర్, మంథని ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై మార్గ మధ్యలో ఉన్న కల్వర్టు కుంగి ఒక సైడు కూలింది. అంతేగాకుండా కల్వర్టు మధ్యలో గుంత ఏర్పడింది. దీంతో అక్కడ ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాదిమంది ప్రయాణించే ఈ రోడ్డులో అధికారులు కనీసం ప్రమాద సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. మరి ముఖ్యంగా విద్యార్థులకు మోడల్ స్కూల్‌కు వెళ్తుంటారు. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి వెంటనే కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.



ప్రమాదకరంగా మారిన కల్వర్టు

ఓబి తొలగింపుపై సింగరేణి డైరెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి డైరెక్టర్లు ఎస్‌వికె.శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరెడ్డి ఓసిపిల నుంచి ఓబి తొలగింపునకు సంబంధించి అన్ని ఏరియాల జిఎంలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సింగరేణి లో ఓవర్ బర్డెన్ తొలగింపు పనులకు సంబంధించి ఏరియాల వారీగా నిర్దేశించిన ఓవర్ బర్డెన్ వెలికితీతక సంబంధించి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్జీ 1 జిఎం కార్యాలయం నుంచి జిఎం చింతల శ్రీనివాస్, ఓసిపి 5 ఇన్‌ఛార్జి ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.రామస్వామి, ఐఈడి ఎజిఎం ఆంజనేయులు, సీనియర్ సర్వే ఆఫీసర్ సురేష్ తదితరులున్నారు.

సమస్యలపై ప్రశ్నించినందుకే దాడి ...

నవతెలంగాణ-గోదావరిఖని:
ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అనుచరులు కరివేద శ్రీనివాస్ రెడ్డి, మెరుగు గురువయ్యలు తనపై దాడి చేశారని అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామస్తుడు పల్లె శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దంపేట గ్రామంలో గ్రామ సభ జరుగుతుందని డప్పు చాటింపు ద్వారా తెలుసుకున్న తాను పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోవాలనే ఆలోచనతో గ్రామ సభకు హాజరవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామ సభ జరుగుతున్న సందర్భంలో గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోతున్న సందర్భంలో అధికార పార్టీ నాయకులు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు అత్యంత సన్నిహితులు బూతులు తిడుతూ పిడి గుద్దులు గుద్దుతూ తనను కింద పడేసి తన్ని పెదవి పగలగొట్టి విచక్షణ రహితంగా కొట్టారని ఆరోపించారు.

రాష్ట్రంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత

నవతెలంగాణ-రాయికల్
రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ధర్మాజీపేట్,కొత్తపేట్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నుంచి వచ్చిన కార్యకర్తలు బిఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాయికల్ మండలం అలియా నాయక్ తండా పెద్ద గంగారాం తండాలో పైప్ కల్వర్టు నిర్మాణానికి రూ.5 లక్షలు,తాట్ల వాయి గ్రామంలో ఎస్సీ సంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, గౌడ సంఘం ప్రహరీగోడ నిర్మాణానికి రూ.3లక్షల ప్రొసీడింగ్స్ కాపీలను అందించారు. ఎంపీపీ లావుడ్యా సంధ్యా రాణి సురేందర్‌నాయక్, సర్పంచులు రాగి సాగరిక శ్రీనివాస్,బత్తిని రాజేశం, నందు నాయక్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో జనాభా ఓటరు సంఖ్యను ప్రామాణిక్యం చేసుకొని అదనంగా ఎంపీటీసీ స్థానాన్ని పెంచాలని ఎమ్మెల్యేకు గ్రామస్తులు బుధవారం వినతి పత్రాన్ని అందించారు.

సమస్యల పరిష్కారానికి స్వర్ణకారుల నిరాహార దీక్ష

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో స్వర్ణకారుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్థానిక ప్రధాన చౌరస్తాలో బుధవారం ఒక్క రోజు నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సంఘీభావం తెలిపి, దీక్షలో కూర్చున్నారు. స్వర్ణకారుల సమస్యలను పరిష్క రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే దీక్షకు బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్ మద్దతుగా పలికి దీక్షలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

ఐఎఫ్‌టీయూ కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-గోదావరిఖని
సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్‌ను రెగ్యులర్ చేయాలని ఈనెల 10న ఇల్లెందులో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సింగరేణి ఆర్జీ- ఏరియాలోని పలు డిపార్మెంట్లలో కరపత్రాలను రాష్ట్ర నాయకులు తోకల రమేష్ ఆవిష్కరించారు. రాష్ట్ర సదస్సుకు భాగాల కాంట్రాక్టు కార్మికులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోయ్యడ శంకర్, మాట్ల సమ్మయ్య, జె.లక్ష్మి, శారద, మమత,దుర్గ, మీనా, సంపత్, శేఖర్, కొమురయ్య, పోచమ్మ, విజయ, మంగ తదితరులున్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

గద్దర్ గొంగడి అవార్డు అందుకున్న రమణయ్యకు సన్మానం

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు జాతీయ స్థాయి జానపద నృత్య గాయకులు కనకం రమణయ్యను బుధవారం గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం స్ఫూర్తి భవన్లో పలువురు కళాకారులు ఘనంగా సన్మానించారు. రమణయ్య ఆగస్టు 22 ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వము భాషా సాంస్కృతిక శాఖ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ కరీంనగర్ సంయుక్త నిర్వహణలో నిర్వహించిన జానపద కళోత్సవాలలో గద్దర్ గొంగడి స్మారక రాష్ట్రస్థాయి అవార్డును మేయర్ సునీల్ రావు సంస్థ అధ్యక్షులు గుండ్ర కపాదనం చేతుల మీదుగా అందుకున్నారు. . కార్యక్రమంలో సమాఖ్య సలహాదారులు కాసిపాక రాజమౌళి, ఉపాధ్యక్షులు సోగాల వెంకటి, ప్రధాన కార్యదర్శి మాదరి శ్రీనివాస్, రేణిగుంట్ల రాజమౌళి, ప్రచార కార్యదర్శి నాగుల శ్రీనివాస్, ధనసింగ్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న కళాకారులు

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ - ఓదెల
ఓదెల మండలం గుంపుల గ్రామంలో బుధవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం అధ్యక్షుడు సంపత్ మాట్లా డుతూ.. దివ్యాంగులకు 4000 రూపాయల పింఛన్‌ను మంజూరు చేసినం దుకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశామన్నారు. ప్రతినెలా నాలుగైదు తేదీల్లో వికలాంగులకు పెన్షన్ అకౌంట్లో జమ అయ్యేలా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు అయ్యేలా చూడాలని కోరారు.



జూడో బ్లాక్‌బెల్ట్ సాన్‌దాన్ సర్టిఫికెట్ ప్రదానం

నవతెలంగాణ - కరీంనగర్ : జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మే నెలలో దేశ వ్యాప్తంగా నాగపూర్‌లో జూడోలో బ్లాక్ బెల్ట్ విభాగంలో సాన్‌దాన్ టెస్టులను నిర్వహించగా ఇటీవల ఫలితాలను విడుదల చేశారు. టెస్టులలో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుంచి వరంగల్ జిల్లాకు చెందిన ఎన్.నాగరాజు అర్హత సాధించారు. ఈ సందర్భంగా బుధవారం నాగరాజుకు కరీంనగర్‌లో తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి నాగరాజుకు సాన్‌దాన్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. నాగరాజును తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం అధ్యక్షులు, శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్, మానేరు విద్యాసంస్థల అధినేత, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షులు కడారి అనంతరెడ్డి, ఎంఏ అజీజ్, భారత జూడో సమాఖ్య కోశాధికారి బి.కైలాస్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం కోశాధికారి బాలరాజు, పెద్దపల్లి జిల్లా జూడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్, జూడో సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.



ధరణిలో దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలి

కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి



నవతెలంగాణ - కరీంనగర్ : జిల్లాలోని ఏ మండలంలో కూడా ధరణిలో దరఖాస్తులు పెండింగ్ లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలని కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ధరణి పెండింగ్‌పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధరణి మాడ్యూల్స్ ద్వారా వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఆ తర్వాత చర్యలు తీసుకోవాలని, పెండింగ్ ఉంటే సమీక్షించి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ధరణి రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తులు వచ్చినప్పుడు మొదటగా ఫిజికల్ పొజిషన్‌లో ఎవరు ఉన్నారు, వారికి భూమిపై హక్కు ఏ విధంగా వచ్చింది, టైటిల్ పాస్‌బుక్‌లు పరిశీలించాలని, రిజిస్ట్రేషన్ ద్వారా భూమిపై హక్కును కలిగి ఉన్నట్లయితే అతనికి భూమి అమ్మే వ్యక్తికి హక్కు ఏ విధంగా వచ్చిందనే విషయాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ పవన్, కలెక్టరేట్ ఏఓ సుధాకర్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





చొప్పదండి : కృష్ణాష్టమి వేడుకల్లో వీణాదరి పాఠశాల చిన్నారులు



చొప్పదండి : అక్షయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో



తిమ్మాపూర్: వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్



కొత్తపల్లి : వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, చైర్మెన్ డాక్టర్

నవతెలంగాణ - కొత్తపల్లి : కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషల్ పాఠశాల, నీనోస్ బ్లాక్ రేకుర్తి, విద్యానగర్ - సీబీఎస్ఈ యందు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటగా చైర్మెన్ జ్యోతి ప్రజ్వలన చేసి తరువాత, విద్యార్థులు నృత్య ప్రదర్శనలు ఉట్టి ఆటలతో అలరించారు.కార్యక్రమానికి సెయింట్ జార్జ్-సీబీఎస్ఈ, పారడైజ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ పి.ఫాతిమారెడ్డి హాజరై మాట్లాడారు. తదనంతరం పిల్లలు కృష్ణుడు గోపిక వేశాధారణలతో పాల్గొని ఉట్టిని కొట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ భార్గవ్, నిరంజన్, ఇంచార్జిలు వనిత, సంగీత, సంధ్య, ఉపాధ్యాయ బృంద పాల్గొంది.

ది ప్లే స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు

నవతెలంగాణ - కరీంనగర్ : నగరంలోని ది ప్లే స్కూల్ పాఠశాలలో కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలలో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులతో ఉట్టి కొట్టు కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సెక్రటరీ రమ, చైర్మెన్ సుధాకర్‌రావు, ప్రిన్సిపాల్ ప్రభాదేవి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

వివేకానంద పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

కరీంనగర్ పట్టణంలో..







కరీంనగరంలో జగిత్యాల రోడ్డులోని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాల (సీబీఎస్ఈ)లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుకా బలివాడ కృష్ణుని చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికలు, రుక్మిణిల వేషధారణలతో చేసిన నృత్యగీతాలు అందరికి కనులవిందు చేసాయి. పాఠశాల సెక్రటరీ రమాదేవి, చైర్మెన్ సుధాకర్‌రావు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి.లలితా కుమారి అభినందనలు తెలిపారు.

వేడుకగా ఓవెల్స్ స్కూల్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి

కరీంనగర్‌లోని ఓవెల్స్ స్కూల్‌లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులను పుష్పగుచ్చాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయునిలను ఘనంగా సత్కరించింది. అనంతరం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు కృష్ణ, గోపికల వేషధారణలో చేసిన ఆటపాటలు అలరించాయి. చిన్నారులు ఉట్టి కొట్టడానికి పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, కరెస్పాండెంట్ జె.తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొంది.



అర్విన్ ట్రీ పాఠశాలలో జన్మాష్టమి వేడుకలు

శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక కరీంనగర్‌లోని అర్విన్ ట్రీ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని రకరకాల పువ్వులతో సుందరంగా అలంకరించారు. పాఠశాల చైర్మెన్ రమణరావు హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పాఠశాల చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపిక, బలరామ వేషధారణలతో అలరించి మురిపించారు. ఉట్టి కొట్టే ఘట్టం ఎంతగానో అలరించింది. చివరగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాలల డైరెక్టర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాధన స్కూల్‌లో కృష్ణ జన్మాష్టమి వేడుకలు

కరీంనగర్ జ్యోతినగర్‌లోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాల చైర్మెన్ సీహెచ్.శ్రీనివాస్‌రావు, అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్.నీలిమ ఘనంగా ప్రారంభించారు. శ్రీకృష్ణ, గోపిక వేషధారణలతో పాఠశాలలోని ప్రీ స్కూల్ చిన్నారులు చాలా చురుకుగా, ఉత్సాహంతో పాల్గొని పాఠశాల ఆవరణలో సందడి వాతావరణం నెలకొల్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్.నీలిమ, హైస్కూల్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, ప్రైమరీ హెచ్ఎం ధనలక్ష్మి, పీఈటీ నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోరా జాన్సన్ పాఠశాలల్లో కృష్ణాష్టమి సంబరాలు

కరీంనగరంలోని స్థానిక కోరా జాన్సన్ పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో అలరించారు. పాఠశాల చైర్మెన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోషరెడ్డి పాల్గొని విద్యార్థుల కోలాహలంతో ఉట్టి కోట్టే కార్యక్రమం నిర్వహించారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శ్రీ కష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జక్కని శ్రీవాణి రవీందర్ తల్లిపాల విశిష్టతను, అనుబంధ పోషకాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలత అంగన్వాడి టీచర్లు పద్మ, అంబిక, ఆశా కార్యకర్తలు సుజాత, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.



నవతెలంగాణ - హుజూరాబాద్ : కృష్ణాష్టమిని పట్టణంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలతో గోపిక యశోధ శ్రీకష్ణ వేషధారణలు వేయించడమే కాకుండా కృష్ణాష్టమి వేడుకలను జరుపుకున్నారు. శాతవాహన పాఠశాల గోపిక కృష్ణ వేషధారణ పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం పిల్లలు సంబరంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యూ కాకతీయ, శాతవాహన విజ్ఞాన్ వివేకవర్ధిని కష్ణవేణి ఆదర్శపెట్రా హెడ్రాన్ పాఠశాలల కరస్పాండెంట్లు బద్దుల రాజకుమార్, వకుళాభరణం వెంకటేశ్వర్లు, దాసరి కోటేశ్వర్, మాడిశెట్టి ప్రసాద్, రవీందర్‌రెడ్డి, కిరణ్ కుమార్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వీణాదరిలో కృష్ణాష్టమి వేడుకలు

నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండల కేంద్రంలోని వీణాదరి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో కష్టాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించి ఉట్టి ఉత్సవ పేరిట అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా పాఠశాల కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ హాజరై వేడుకలను ప్రారంభించి, మాట్లాడారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు చేసిన ప్రదర్శన లు పలువురుని ఆకట్టుకున్నాయి. చిన్నారులు కష్ణుడి వేషధారణ లో హాజరై సందడి చేయగా, కరస్పాండెంట్ శ్రీనివాస్ ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో

మండలంలోని ఆర్నకొండ గ్రామంలోని అక్షయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ తమ్మడి కనుక రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. ఉట్టి కొట్టే ఉత్సవాలు, గోపికలతో కృష్ణుని వేషధారణ కనువిందు చేశాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తమ్మడి శ్రీమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో



ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్



నవతెలంగాణ - కరీంనగర్

విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను (అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్, సిస్టం అనలిస్ట్, టెక్నికల్ పర్సన్స్, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్, యుఆర్ఎస్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, ఎంఐఎస్, డాటా ఎంట్రీ ఆపరేటర్, డీఎల్ఎంటీ మెసెంజర్, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్స్, ఐఈఆర్ పీ) వెంటనే రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు మినీమం టైం స్కేల్ అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల రిలే దీక్షలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తామని జిల్లా అధ్యక్షుడు ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవేనని, ముఖ్యమంత్రి కేసీఆర్ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మెప్మా, సెర్ప్, ఆర్టీసీ, జూనియర్ లెక్చరర్స్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఏలను ఏ విధంగా రెగ్యులర్ చేశారో అలాగే సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని కోరారు. విధి నిర్వహణలో ఉద్యోగి మృతి చెందితే కుటుంబానికి రూ.10లక్షలు, ఆరోగ్య బీమా రూ.5లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న మహిళ ఉద్యోగులందరికి 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా రాజిరెడ్డి, ఎంఎస్ జిల్లా అధ్యక్షులు దీప్తి, సుకన్య వరలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ల జిల్లా అధ్యక్షులు జిలాని, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్ల జిల్లా అధ్యక్షుడు కనుకుల రమేష్, మహేష్, అశోక్, అయోధ్య డీపీఓ స్టాఫ్ రాజశేఖర్, శ్రీనివాస్, భరత్, శంకర్, యుఆర్ఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

8న చలో కమిషనర్ కార్యాలయం..



నవతెలంగాణ - కరీంనగర్

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట 58 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్తు స్కూల్స్ స్కూల్ స్వీపర్స్ సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీన ఛలో పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమం విజయవంతం చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ స్కూల్ స్వీపర్స్ యూనియన్ జిల్లా గౌరాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లా కేంద్రాల్లో స్కూల్ స్వీపర్స్ నిరసన కార్యక్రమం చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని, 8న ఛలో పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టామని అన్నారు. 8వ తేదీన నిర్దిష్ట హామీ వస్తే ఒక్క లెక్క రాకుంటే మరో లెక్క ఉంటుందని తెలిపారు. 40 సంవత్సరాలు నుంచి పని చేస్తుంటే రూ.5200 జీతం ఇస్తున్నారని, ఏపీఎస్ రెడ్డి కమిటీ సిఫారసుల ప్రకారం రెగులర్ చేయాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోయిన వారికి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అర్హత బట్టి వీరికి కూడా పదోన్నతి కలిపించాలని, ప్రభుత్వం స్పందించి వెంటనే వీరిని బేషరతుగా రెగ్యులర్ చేస్తూ 10వ పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, బండారి శంకర్, కనకవ్వ, మొండయ్య, ఎస్డీ అలీం, శంకరయ్య, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకమేశారు.. పనులు చేయడం మరిచారు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఖుతుబొద్దిన్ పాషా

నవతెలంగాణ - మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణం ఎనిమిదో వార్డు మీదుగా వెల్లుల్ల నుండి పోలీస్ స్టేషన్ వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఖుతుబొద్దిన్ పాషా డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎనిమిదో వార్డులో బీటీ రోడ్డు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని పరిశీలించారు. పట్టణంలోని ఎనిమిదో వార్డులో గల వెల్లుల రోడ్డు నుంచి తొమ్మిది పదవ వార్డుల మీదుగా పోలీస్ స్టేషన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం 2019 నవంబరు 1న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారని గుర్తు చేశారు. శిలాఫలకం ప్రారంభించి సుమారు నాలుగు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు మాత్రం ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. ఎన్నో రోజులుగా రోడ్డు నిర్మాణం కోసం ఇక్కడి ప్రజలు ఎదురుచూస్తున్న పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదన్నారు. ఈ రహదారిపై గుంతలు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.



శిలావలకాన్ని చూపిస్తున్న ఖుతుబొద్దిన్ పాషా..



గుతలమయమైన బిటిరోడ్డు

గురువులకు సన్మానం

నవతెలంగాణ - కరీంనగర్

ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మెన్ రెడ్డవేణి మధు ఆధ్వర్యంలో గురువులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్డవేణి మధు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలను సమున్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు, విలువలు, ప్రాముఖ్యత వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో గంగుల వెంకన్న, సర్పంచ్, కడారి శాంత శ్రీనివాస్, ఎంపీటీసీ మణి సోమినేని కానుకయ్య, పెంచాల ప్రభాకర్, పెరుక శ్రీను, పెంచాల అంజి పాల్గొన్నారు.



పరమ హంస ఆచార్యను తక్షణమే అరెస్టు చేయాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు

నవతెలంగాణ - కరీంనగర్

తమిళనాడుకు చెందిన శాసన సభ్యుడు ఉదయనిధి తల నరికితే పది కోట్ల రూపాయల నగదు సుపారి ప్రకటించి హత్య నేరానికి పాల్పడిన పరమ హంస ఆచార్యపై కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక మంకమ్మతోటలోని కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. సనాతన ధర్మం ముమ్మాటికి మనుషుల అసమానతలు సృష్టించిందని, అందుకే రాజారాం మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం లాంటి సామాజిక సంఘ సంస్కర్తలు పోరాటాలు చేశారని అన్నారు. భర్త చనిపోతే భార్యను చితి మంటలలో వేసిన సనాతన ధర్మం ఆచారాలను దేశ ప్రజలు పాటించాల్సిన అవసరం లేదన్నారు. సనాతన ధర్మం అంటే కేవలం బ్రాహ్మణ ఆధిపత్య శక్తుల ధర్మమేనని, సమధర్మమంటే భారత రాజ్యాంగం కల్పించిన హక్కులని చెప్పారు. కుల అసమానతలు, లింగ సమానతలు పశువుల కంటే నీచంగా మనుషుల్ని చూసిన మానవీయ సంస్కృతి సనాతన ధర్మంలో ఉందన్నారు. ఈ అసమానతలు ఉన్న సనాతన ధర్మానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. పరమహంస స్వామి సత్యం, ప్రేమ మానవీయతను ప్రచారం చేయాల్సి ఉండగా హత్యలు చేయించే హంతకులుగా మాట్లాడవద్దన్నారు. తక్షణమే పరమ హంసను అరెస్టు చేయాలన్నారు. ఒక భావం వ్యక్తం చేసినప్పుడు భౌతిక దాడుల ద్వారా విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకొని ఈ రకమైన వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. పరమహంస వ్యాఖ్యలను ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు తీవ్రంగా ఖండించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి సాగర్, నాయకులు సాయి కుమార్, నర్సింగ్ బాబు, ప్రభాకర్, కనకేశి కనకరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలి

అలసత్వంపై ఆందోళన కార్యక్రమాలు చేపడతాం

జీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్

నవతెలంగాణ - కరీంనగర్ : సబ్సిడీ గొర్రెల పంపిణీలో ప్రభుత్వం చేస్తున్న అలసత్వంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జీఎంపీఎస్ కరీంనగర్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఉడుత రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇస్తానన్న సబ్సిడీ గొర్రెల పంపిణీ నత్తనడకన సాగుతోందని, వేగవంతం చేయాలని ప్రభుత్వం నగదు బదిలీ ద్వారా పథకం అమలు చేస్తే లబ్ధిదారులకు లాభం చేకూరుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 9500 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు జిల్లాలో 2300 యూనిట్లకు లబ్ధిదారులు 25 శాతం వాటాను ప్రభుత్వానికి డీడీ రూపంలో చెల్లించి ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా 370 మంది లబ్ధిదారులకు మాత్రమే గొర్రెల పంపిణీ చేశారన్నారు. ఇలా పంపిణీ చేస్తే ఎంతకాలం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెల పంపిణీలో వేగవంతం చేయకుంటే లబ్ధిదారులను ఐక్యం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా పోరాటాలు సాగిస్తామని అన్నారు. జిల్లా అధ్యక్షుడు పొనగాని మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేష్, ఉపాధ్యక్షుడు వేల్పుల కొమురయ్య, భూస అయిలయ్య, కాల్వ నర్సయ్య, చిమ్మాల తిరుపతి, దాడి ఆంజనేయులు, తమ్మన వేణి రాయమల్లు పాల్గొన్నారు.



పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ

నవతెలంగాణ - గోదావరిఖని



పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. బుధవారం రామగుండంలోని ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో ఎన్నికల నిర్వహణ సన్నద్ధ కార్యక్రమంపై పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే ఎన్నికలలో మద్యం, డబ్బు, బహుమతుల ప్రలోభాలకు గురికాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, గత ఎన్నికల సమయంలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ అధికారుల సమన్వయంతో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని అన్నారు. జిల్లాలోని అధికారులు ఇప్పటి వరకు అనేక ఎన్నికలు నిర్వహించినప్పటికీ, రాబోయే ఎన్నికలో ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా, ఎప్పటికప్పుడు ఎన్నికల కమీషన్ నుండి వచ్చే మార్గదర్శకాలను పాటిస్తూ పకడ్బందీగా నిర్వహించేందుకు సమాయత్తం కావాలని అదనపు కలెక్టర్ అన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా జనాభా ఓటర్ల నిష్పత్తి, లింగ నిష్పత్తి, ఓటర్లలో యువ ఓటర్ల నమోదుపై దృష్టి సారించి, వారి నిష్పత్తి పై సమాచారం అందించాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేర జనాభా, ఓటర్ నిష్పత్తి, లింగ నిష్పత్తి ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం రామగుండం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మూడు మండలాల తహసీల్దార్లతో పాటు రామగుండం అసెంబ్లీ నియోజక వర్గంలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో గోదావరిఖని ఏసిపి, రామగుండం తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో బుచ్చిబాబుని విచారించిన ఈడీ విచారణ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు మళ్లీ మొదటికి వచ్చింది. ఈ కేసును వీలైనంత త్వరలో కొలిక్కి తీసుకురావాలని భావిస్తున్న దర్యాప్తు సంస్థలు విచారణలో వేగం పెంచాయి. ఈ కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబును మరోసారి ఈడీ విచారించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి 6.15 గంటల వరకూ ఆడిటర్ బుచ్చిబాబును ఈడీ అధికారులు ప్రశ్నించారు. కాగా.. ఈ కేసు విచారణలో బుచ్చిబాబు వాంగ్మూలం అత్యంత కీలకంగా మారబోతోందని నిపుణులు చెబుతున్నారు. గత వారంలో ఈ కేసుతో సంబంధం ఉన్న పలువురు తెలుగువారిని పిలిపించి ఈడీ ప్రశ్నించింది. బుచ్చిబాబు తరువాత ఈడీ ఎవరిని విచారణకు పిలుస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ప్రిన్సిపాల్ అరాచకం..

45 మంది మహిళలపై లైంగికదాడి

కరాచి : కరాచీలో ఓ ప్రయివేటు పాఠశాల ప్రిన్సిపల్ మహిళా టీచర్లపై సాగించిన లైంగిక అకత్యాలు వెలుగులోకి వచ్చాయి. టీచర్లను బెదిరించి, వారిపై లైంగికదాడులకు పాల్పడిన ఆరోపణలపై ప్రిన్సిపాల్ ఇర్ఫాన్ గఫూర్ మెమన్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రిన్సిపల్ చేతిలో 45 మందికి పైగా మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్టు పోలీసులు భావిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీలను చూపించి మహిళా టీచర్లను ప్రిన్సిపల్ బెదిరించే వాడని తెలిసింది. గఫూర్ ఫోన్ నుంచి 25 షార్ట్ వీడియో క్లిప్ లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీసీటీవీ కెమెరా డిజిటల్ వీడియో రికార్డర్, మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. ఓ మహిళా టీచర్‌తో గఫూర్ ఏకాంతంగా ఉన్న ఒక వీడియో బయటకు రావడంతో చీకటి క్రీడ వెలుగు చూసింది. ప్రిన్సిపాల్ గఫూర్‌కు స్థానిక కోర్టు ఏడు రోజులు రిమాండ్ విధించింది. ఉద్యోగం ఆశ చూపించి మహిళా టీచర్లపై గఫూర్ లైంగిక వేధింపులకు పాల్పడేవాడని పోలీసులు వెల్లడించారు. వారితో సన్నిహితంగా ఉన్న వీడియోలు చూపిస్తూ బెదిరించే వాడని తెలుసుకున్నారు. దీనిపై విచారణకు సర్కారు కమిటీని నియమించింది. గఫూర్ చేతిలో తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్టు ఐదుగురు మహిళలు ఇప్పటి వరకు ముందుకు వచ్చారు.

ఉదయనిధి, ప్రియాంక్ ఖర్గేపై ఎఫ్ఐఆర్ నమోదు



కర్నాటక : తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు వ్యతిరేకంగా పోలీసు కేసు నమోదైంది. సనాతన ధర్మంపై ఉదయనిధి పరుష వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే సమర్థించారు. దీంతో ఉదయనిధి స్టాలిన్, ప్రియాంక్ ఖర్గేలకు వ్యతిరేకంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ సివిల్ పోలీసు లైన్స్ పోలీస్టే స్టేషన్‌లో సెక్షన్ 295ఏ (మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం), సెక్షన్ 153ఏ (వివిధ మత గ్రూపుల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం) కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. న్యాయవాదులు హర్ష గుప్తా, రామ్ సింగ్ లోధి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. ఉదయనిధి స్టాలిన్ తొలిసారిగా గత శనివారం తమిళనాడులో ఓ కార్యక్రమం సందర్భంగా సనాతన ధర్మంపై వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని డెంగీ, మలేరియా వ్యాధులతో పోల్చారు. ఆయన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తుండడం తెలిసిందే. మరోసారి ఈ రోజు కూడా ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని తప్పుబడుతూ విమర్శలు కురిపించారు. తనపై చట్టపరమైన చర్యలు తీసుకున్నా, తన తల తెగనరికినా భయపడేది లేదని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన వ్యాను...

ఆరుగురు మృతి

చెన్నై : తమిళనాడులో బుధవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. సేలం-ఈరోడ్ హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడాది చిన్నారితో సహా ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈంగూర్‌కు చెందిన ఎనిమిది మంది సభ్యులు వ్యాన్‌లో పెరుంతురై వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు పక్కన ఆగి ఉన్న లారీని వ్యాన్ ఢీకొట్టింది. డ్రైవర్ నిద్రలో ఉండటమే ఇందుకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులు సెల్వరాజ్, మంజుల, ఆరుముగం, పళనిసామి, పాపతితో పాటు ఏడాది వయసున్న చిన్నారిగా గుర్తించారు. వ్యాన్ డ్రైవర్ విఘ్నేష్, మరో ప్రయాణికురాలు ప్రియా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమోన్మాది ఘాతుకం..

బ్లేడుతో ప్రేయసి గొంతు కోసి....

విశాఖపట్టణం: పెళ్లికి నిరాకరించిందనే కోపంతో ప్రియురాలిపై బ్లేడ్ తో దాడి చేశాడు ప్రియుడు. ఈ ఘటన విశాఖపట్టణం చోటు చేసుకుంది. 59వ వార్డు నెహ్రూనగర్ ప్రాంతంలో లలిత శ్రీ తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటుంది. ఆమె ఇంటికి సమీపాన నిందితుడు రామారావుఉంటున్నాడు. ఇరురువు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. రామారావు పనీపాటా లేకుండా జులాయిగా తిరగడం లలితకి నచ్చలేదు. అతని పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించింది. పెళ్లి చేసుకోవాలని గత కొద్ది రోజులుగా ఒత్తిడి తీసుకువస్తున్నా.. ఆమె ససేమిరా అంది. సోమవారం రాత్రి భోజనం చేసి ఆమె మేడపై వాకింగ్ చేస్తున్న ఆమె వద్దకు వెళ్లి పెండ్లి ప్రతిపాదన తీసుకొచ్చాడు. ఆమె నిరాకరించడంతో వెంట తీసుకొచ్చిన బ్లేడ్ తో దాడి చేస్తానని భయపెట్టాడు. అయినప్పటికీ ఆమె అంగీకరించకపోవడంతో బ్లేడ్ తో గొంతు భాగంలో దాడి చేశాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు బంధువులు అక్కడికి చేరుకొని గాయపడిన లలిత శ్రీని ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమచారం ఇవ్వడంతో దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమరవీరుల కుటుంబాల సంక్షేమం కోసం 'ప్రాజెక్ట్ నమన్'

న్యూఢిల్లీ : అమరవీరుల కుటుంబాల సంక్షేమం కోసం భారత ఆర్మీ 'ప్రాజెక్ట్ నమన్'ను ప్రారంభించింది. మాజీ సైనికులు, సైన్యంలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరుల కుటుంబాల సమస్యలను, ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మొదటగా ఢిల్లీ కంటోన్మెంట్‌లో ఈ తరహా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. భారతీయ సైన్యానికి చెందిన డైరెక్టర్ ఆఫ్ ఇండియా ఆర్మీ వెటర్న్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు లిమిటెడ్, సీ.ఎస్.ఈ.ఈ. - గవర్నెన్స్ ఇండియా లిమిటెడ్ దీనికోసం ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. ఇందులో సైనిక కుటుంబాలకు సౌకర్యాలు కల్పించడానికి ఒక కామన్ సర్వీస్ సెంటర్ ఉంటుంది. అంతేకాకుండా ఇది అన్ని ప్రభుత్వ కస్టమర్ సేవలను అందజేస్తుంది. అందులో సైనికుల కుటుంబాల పెన్షనర్ల ఖాతాలను కూడా నమోదు చేయవచ్చు. ఈ ప్రాజెక్ట్ రెండో దశలో దేశమంతటా వివిధ సైనిక స్టేషన్లలో మరో 13 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు. గతంలోనూ ఈ ప్రాజెక్ట్ నమన్ నుంచి ఆర్మీ.. అమరుల కుటుంబాల కోసం పలు సేవా కార్యక్రమాలను అందించింది.

ఒడ్వని రహదారి ముచ్చట



రోడ్డు నిర్మాణ పనులు ఆపిందెవరు..?

- ఓట్ల కోసం ఆపారా..? మరేదైనా కారణమా..?
- బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ టూ డీఈఓ కార్యాలయం
- సమన్వయం చేసుకునే అధికారులేరీ..?

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

అది జాతీయ రహదారి 565. ఈ రహదారి నిర్మాణం పనులు చేపట్టి దాదాపు 9 ఏండ్లు పూర్తి కావొస్తోంది. కానీ నేటికీ నిర్మాణం పూర్తయింది లేదు. కొన్నాళ్లు భూసేకరణ సమస్యతో రోడ్డు నిర్మాణం నిలిచిపోతే.. తాజాగా మళ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో మధ్యలోనే నిర్మాణం ఆగిపోయిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ వరకు నిర్మిస్తున్న ఈ జాతీయ రహదారి.. నల్లగొండ పట్టణంలో ముందుకు సాగడం లేదు. నిజానికి ఈ రహదారి నిర్మాణానికి రూ.220 కోట్లు మంజూరయ్యాయి. దీంతో టెండర్లు పిలిచి ఓ ప్రయివేటు సంస్థకు అప్పగించారు. తీరా పనులు ప్రారంభించే వేళ నకిరేకల్, నల్లగొండ మధ్య భూసేకరణ సమస్య ఎదురైంది. అదీ కాస్త తీరడంతో త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని అంతా భావించారు. కానీ అడియాశగానే మిగిలిపోయింది.

జాతీయ రహదరి 565 కథ ఇదీ..

జాతీయ రహదారి 565 నల్లగొండ జిల్లా నకిరేకల్ మండల కేంద్రంలో మొదలై.. ఏపీలోని ఏర్పేడు వరకు నిర్మించాల్సి ఉంది. తెలంగాణలో 86 కిలోమీటర్లు కాగా, ఏపీలో 420 కిలోమీటర్లు నిర్మించాల్సి ఉంది. ఏపీ సంగతి పక్కన పెడితే.. తెలంగాణలో నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ వరకు రోడ్డు వేయాల్సి ఉంది. ఇదిలావుంటే.. అప్పటివరకు రాష్ట్ర రహదారిగా ఉన్న ఆ రోడ్డు జాతీయ రహదారిగా మారడంతో అందరిలోనూ సంతోషం వెల్లివిరిసింది.

కానీ నిర్మాణం 9 ఏండ్లుగా సాగుతూనే వస్తోంది. నిజానికి 2017 నాటికే ఈ రహదారి నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. భూసేకరణ సమస్య నేపథ్యంలో బాధితులు కోర్టు మెట్లెక్కగా.. అర్థాంతరంగా నిలిచిపోయింది.అదికాస్త సర్దుకుని రోడ్డు నిర్మాణ పనులు మొదలయ్యాయి. దాదాపు రోడ్డు నిర్మాణం పూర్తి కావొస్తున్న తరుణంలో మరో సమస్యతో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

నల్లగొండ పట్టణంలో నిలిచిన పనులు

నకిరేకల్ నుంచి పానగల్ బైపాస్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు పనులు సజావుగానే సాగాయి. మరోవైపు దేవరకొండ రోడ్డులోని డీఈఓ కార్యాలయం నుంచి నాగార్జునసాగర్ వరకు దాదాపు పూర్తి కావొచ్చింది. కానీ మధ్యలో నల్లగొండ పట్టణంలో పనులు నిలిచిపోయాయి. దాదాపు 3 కిలోమీటర్ల మేర పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కనీసం రోడ్డు విస్తరణ పనులను ఇప్పట్లో ప్రారంభించేలా కన్పించడం లేదు.

ఓట్ల కోసమేనా..?

నల్లగొండ పట్టణంలో 3 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోగా, ఆ మేర దుకాణాలు, ఇండ్ల స్థలాలు పెద్దఎత్తున ఉన్నాయి. అసలే ఎన్నికల సీజన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో రహదారి విస్తరణ కోసం వీటిని కదిలిస్తే.. ఎన్నికల్లో తీవ్ర ప్రభావం పడుతుందనే ఉద్దేశంతోనే పనులు నిలిపివేసినట్టు చర్చ జరుగుతోంది. దీనికితోడు నల్లగొండ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో దేవాలయాలు, మసీదులను తొలగించాల్సి వస్తుంది. ఈ కారణంతోనూ కొన్నిచోట్ల రహదారి పనులు నిలిచిపోయాయి. నిజానికి అభివృద్ధి పనులు విషయంలో గుడి, బడి అన్న తేడాను పక్కనపెట్టాల్సిందే. అయితే ఆలయాలు, మసీదులను పక్కకు మార్చే విషయంలో ఆయా మతపెద్దలతో మాట్లాడి.. సమన్వయం చేసుకోవడంలో ఇటు పాలకులు.. అటు అధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి. ఎవరు చొరవ తీసుకున్నా.. ఇప్పటికే జాతీయ రహదారి 565 నిర్మాణం పూర్తయ్యేది. కేంద్రం కూడా నాకెందుకులే అని నటిస్తోంది. ప్రజలు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు. మరి ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణ పనులు సజావుగా సాగేలా చేస్తారా..? లేక ఓట్ల కోసం మౌనం వహిస్తారా..? అన్నది వేచిచూడాల్సిందే.

పనిలో భారం.. వేతనాల్లో కోతలు

సుప్రీం కోర్టు తీర్పు అమలేది..!

- 2 'జీ' నెట్‌వర్క్‌తో యాప్‌లు పనిచేసేదెట్లా..!
- సమస్యల పరిష్కారంకై పోరుకు సిద్ధమంటున్న అంగన్‌వాడీలు

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

పని బారెడు.. వేతనం మూరెడు అన్న చందంగా అంగన్‌వాడీల పరిస్థితి నెలకొంది. అంగన్‌వాడీ బాధ్యతలతో పాటు ప్రభుత్వానికి అవసరమైన సర్వే రిపోర్టులు మొత్తం వారే చేయాలి. ప్రత్యేక యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ రిపోర్టులు సిద్ధం చేయాలంటే అంగన్‌వాడీల అవస్థలు వర్ణనాతీతం. 2జీ నెట్‌వర్క్‌తో నానాతంటాలు పడుతున్నారు. ఇబ్బందులు ఏవైనా పొట్టకూటీ కోసం తపనపడుతున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చే వేతనాలతో పూటగడవని పరిస్థితి. ఎన్నో ఏండ్లుగా ఇదే పనిని నమ్ముకున్న అంగన్‌వాడీలు ఉద్యోగాన్ని వదులుకోలేక.. చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్నారు. 'చావో రేవో' ప్రభుత్వంతో తేల్చుకుంటామని ఈ నెల 11న రాష్ట్ర వ్యాప్త సమ్మెకు అంగన్‌వాడీలు సిద్ధమవుతున్నారు.

రాష్ట్రంలో 149 ప్రాజెక్టుల్లో 70 వేల మంది అంగన్‌వాడీలు పనిచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో 7 ప్రాజెక్టుల పరిధిలో 1600 సెంటర్లు ఉన్నాయి. ఇందులో సుమారు 3200 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఉన్నారు. వీరంతా ఎన్నో ఏండ్లుగా ప్రభుత్వం ఇచ్చే అత్తెసరు వేతనంతో జీవనం గడపుతున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని ఎన్నో పోరాటాలు చేశారు. ఇటీవల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు అంగన్‌వాడీ యూనియన్లతో చర్చలు జరిపి వారి డిమాండ్లను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇచ్చిన హామీల్లో కంటితుడుపుగా ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ. 50 వేలు నిర్ణయించింది. అసలు సమస్యలు పక్కన పెట్టి ఉద్యోగ విరమణ వయసు 65 ఏండ్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దాంతో అంగన్‌వాడీలు మరో మారు పోరుకు సిద్ధమవుతున్నారు. కనీస వేతనం అమలు, సుప్రీం కోర్టు తీర్పు, ఉద్యోగ భద్రత ఇలా పలు సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేస్తున్నారు.

పనికి తగ్గ వేతనం ఏదీ..?

అసలు పని కంటే.. అదనపు పనులు ఎక్కువగా చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీలు ఆవేదన చెందుతున్నారు. అంగన్‌వాడీ విధుల్లో భాగంగా 18 రికార్డులు రాయాల్సి ఉంది. కానీ అదనంగా ఆన్‌లైన్ ఎంట్రీల పేరు యాప్‌లో అప్లోడ్ చేయాల్సి వస్తోంది.

బతుకమ్మ, దసర పండగలు వచ్చాయంటే ప్రభుత్వ స్కీమ్‌లు, చీరలు పంపిణీ చేయడంతో సరిపోతుందని అంగన్‌వాడీలు వాపోతున్నారు. ఇంత చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



5జీ కాలంలో.. 2 జీతో వర్క్

ఆన్‌లైన్‌లో న్యూట్రిషన్ హెల్త్ ట్రాకర్ సిస్టమ్, పోషణ్ ట్రాకర్ యాప్‌ల ద్వారా మాతా, శిశుఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక మొబైల్ యాప్‌లను తీసుకొచ్చింది. 2018లో డాటాను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు 2జీ మొబైల్స్‌ను ఇచ్చింది. ప్రస్తుతం ఆ మొబైల్స్ పనిచేయకపోవడంతో అంగన్‌వాడీలు నానా అవస్థలు పడుతున్నారు. యాప్‌లో డేటా ఎంట్రీ చేయకపోతే జీతంలో కోత పెట్టడంతో అప్పులు చేసి మరి సొంతంగా మొబైల్స్ కొనుగోలు చేశామని అంగన్‌వాడీలు చెబుతున్నారు.

40 ఏండ్లుగా పనిచేస్తున్నా..



రూ.175 వేతనం ఉన్నప్పటి నుంచి పనిచేస్తున్నా. నా సర్వీస్ 40 ఏండ్లు పూర్తయింది. నేటికి నా జీతం రూ.13,650 మాత్రమే. ఇన్నాండ్లు కష్టపడినా ఫలితం లేదు. ఇప్పటికీ ఉద్యోగ భద్రత లేదు. అత్తెసరు వేతనంతో కుటుంబం పస్తులుండాల్సిన పరిస్థితి. ప్రభుత్వ అవసరాలు తీర్చుతున్నా.. మా బతుకుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

- రాజ్యలక్ష్మి, యాచారం మండలం, మేడిపల్లి సెంటర్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాల్సిందే

ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారిస్తామని చర్చలకు పిలిచి, అసలు సమస్యలు పక్కన పెట్టి ఒకట్రెండు హామీలను అసంపూర్తిగా అమలు చేస్తామంటే ఊరుకునేది లేదు. కనీస వేతనం అమలు, సుప్రీం కోర్టు తీర్పుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తాం. సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం ఆపేది లేదు.



జయలక్ష్మి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అదానీ కంపెనీల్లోని విదేశీ ఇన్వెస్టర్ల అదృశ్యం

మారిషస్ నుంచి ఆరు మాయం

సెబీకి సవాల్



న్యూఢిల్లీ : అదానీ కంపెనీల్లో డొల్ల సంస్థల పెట్టుబడులు మరోమారు నిరాపేతమయ్యాయి. అదానీ లిస్టెడ్ కంపెనీల్లో షేర్లను కొనుగోలు చేస్తూ.. కృత్రిమ ధరల పెంపునకు పాల్పడుతోన్న విదేశాల్లోని అజ్ఞాత ఇన్వెస్టర్లు అదృశ్యమయ్యారు. అదానీ సంస్థలలో షేర్లను కొనుగోలు చేస్తోన్న ఎనిమిది విదేశీ ఫండ్‌లలో ఆరు సంస్థలు మాయమయ్యాయని మింట్ ఓ కథనంలో వెల్లడించింది. ఇందులో బెర్ముడా, మారిషస్ ఫండ్ సంస్థలున్నాయి. గతేడాది మారిషస్ ఆధారిత రెండు సంస్థలు మూత పడ్డాయి. మూడోది మూసివేసే ప్రక్రియలో ఉందని మిట్ రిపోర్ట్ చేసింది. 2020లో అదానీ గ్రూప్ కంపెనీలలో విదేశీ సంస్థల హోల్డింగ్‌లపై మార్కెట్స్ రెగ్యులేటర్ దర్యాప్తు ప్రారంభించిన తర్వాత అవి మూతపడటంతో అదానీ కంపెనీల్లో అజ్ఞాత పెట్టుబడులకు మరింత బలం చేకూరినట్లయ్యింది. ఈ పరిణామం ఈ పెట్టుబడి సంస్థల అంతిమ లబ్దిదారులను గుర్తించడంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్సేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కి సవాలుగా మారింది. మింట్ కథనం ప్రకారం.. మారిషస్ నుంచి అదానీ కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెట్టిన అసెంట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ జూన్ 2019 నుంచి అదృశ్యమయ్యింది. లింగో ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మార్చి 2015లో మూసివేయబడింది. మిడ్ ఈస్ట్ ఓషన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ గతేడాది ఆగస్టులో చిరునామా లేకుండా పోయింది. ఇఎం రిసర్జెంట్ ఫండ్ గతేడాది ఫిబ్రవరిలో మూసివేయబడింది. ఆసియా విజన్ ఫండ్ మూసివేసే ప్రక్రియలో ఉంది.

అదానీ గ్రూపులో డొల్ల, దొంగ పెట్టుబడులపై ఇటీవల ఆర్గనైజ్డ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసిసిఆర్‌పి) ఓ రిపోర్ట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. అదానీ గ్రూప్‌లో రహస్యంగా పెట్టుబడి పెట్టిన ఇద్దరు వ్యక్తులు.. అదానీ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని వెల్లడించింది. గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ సంస్థల్లో పెట్టుబడులు కలిగి ఉన్నారని పేర్కొంది. సెబీ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిపింది. అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌పైనా సుప్రీంకోర్టు విచారిస్తున్న విషయం తెలిసిందే. కాగా.. సుప్రీం ఆదేశాల మేరకు అదానీ కంపెనీల్లో విదేశీ పెట్టుబడులపైనా సెబీ దర్యాప్తు జరుపుతోంది. విదేశీ పెట్టుబడులకు సంబంధించి మరింత సమాచారం దొరకాల్సి ఉందని సెబీ ఇటీవల అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించిన అఫిడవిట్‌లోనూ పేర్కొంది. కాగా.. అదానీ కంపెనీ షేర్లలో అజ్ఞాత పెట్టుబడులపై విచారిస్తోన్న సెబీకి అదృశ్య ఇన్వెస్టర్లను కనుగొనడం పెద్ద సవాల్‌గా మారనుంది. ప్రధాని నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన గౌతం అదానీ ఆర్థిక అక్రమాలు, షేర్ల ధరల కృత్రిమ పెంపునపై అనేక రిపోర్టులుగా రాగా.. ఇప్పటికీ ఎక్కడా కూడా పారదర్శకంగా విచారణ జరగడం లేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే.

బిజినెస్

చిన్న పట్టణాల్లోనూ స్టాక్ మార్కెట్లపై ఆసక్తి

స్థానిక భాషల్లోనూ సేవలు

టెక్నాలజీపై ఏటా రూ.1,000 కోట్ల పెట్టుబడులు

ఎన్ఎస్ఇ సిఇఒ ఆశిష్ కుమార్ వెల్లడి



ముంబయి : స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు చిన్న పట్టణాల్లోని ఇన్వెస్టర్లు కూడా ఆసక్తి చూపుతున్నారని నేషనల్ స్టాక్ ఎక్సేంజీ (ఎన్ఎస్ఇ) మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) ఆశిష్ కుమార్ చౌహాన్ అన్నారు. ఒకప్పుడు మెట్రో సిటీలు, పెద్ద నగరాల్లోని వారు మాత్రమే స్టాక్ మార్కెట్లపై అవగాహన, ఆసక్తి కలిగి ఉండేవారన్నారు. ఇటీవలి కాలంలో చిన్న పట్టణ ప్రాంతాల్లోని మదుపర్లు ఎక్కువగా నమోదయ్యారని వెల్లడించారు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్ఇ ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆశిష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ట్రేడింగ్ కోసం రిజిస్టర్ చేసుకున్న మదుపర్లలో 60 శాతం మంది 50 పెద్ద నగరాలకు బయటి ప్రాంతాలు, పట్టణాల్లోని వారే ఉన్నారన్నారు. మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం తాము స్థానిక భాషల్లోనూ ఎన్ఎస్ఇ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తేనున్నామన్నారు. ఇప్పటికే హిందీ, మరాఠీ భాషలను ప్రారంభించామని.. భవిష్యత్తులో ఎక్కువగా మాట్లాడే తెలుగు, తమిళం, కన్నడ ఇతర భాషల్లోనూ ఎన్ఎస్ఇని అందుబాటులోకి తేనున్నామన్నారు. ప్రతి రోజూ సగటున 2-3 కోట్ల మంది ఎన్ఎస్ఇ వెబ్‌సైట్‌ను సందర్శిస్తున్నారని తెలిపారు. ప్రతి రోజు 1,300 నుంచి 1,500 కోట్ల మేర లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. మార్కెట్ పరిస్థితులు, నియమ నిబంధనలకు అనుగుణంగా పవర్, కార్బన్ క్రెడిట్ విభాగాల్లో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను ప్రవేశపెట్టే యోచనలో ఉన్నామన్నారు. టెక్నలాజీ పరంగా మరింత అప్‌గ్రేడ్ కావడానికి వీలుగా ప్రతీ ఏడాది రూ.1,000 కోట్ల నుంచి రూ.1,500 కోట్ల వరకు వ్యయం చేయనున్నామన్నారు.

హల్దీరామ్స్‌పై టాటా గ్రూపు దృష్టి..!

- మెజారిటీ వాటా స్వాధీనానికి చర్చలు

న్యూఢిల్లీ : ప్రముఖ స్నాక్స్ తయారీ కంపెనీ హల్దీరామ్స్‌పై టాటా గ్రూపు కన్ను పడింది. ఆ సంస్థల్లోని మెజారిటీ వాటాలను కొనుగోలు చేయడానికి చర్చలు జరుపుతోన్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. హల్దీరామ్స్‌లో 51 శాతం వాటాల స్వాధీనానికి టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ కంపెనీ ఆసక్తి చూపుతోంది. కాగా.. హల్దీరామ్ 10 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.80వేల కోట్లు) విలువగా పేర్కొన్నట్లు సమాచారం. హల్దీరామ్స్ చెప్తోన్న విలువ చాలా ఎక్కువగా ఉందని.. అంత ఉండకపోవచ్చని టాటా గ్రూపు పేర్కొందని తెలుస్తోంది. కాగా.. ఈ వార్తలను టాటా గ్రూపు ప్రతినిధి కొట్టిపారేశారు. మరోవైపు హల్దీరామ్స్ దీనిపై స్పందించడానికి నిరాకరించింది. భారత స్నాక్స్ మార్కెట్‌లో హల్దీరామ్స్ 13 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది.

హైదరాబాద్ మార్కెట్లోకి హోండా ఎలివేట్



హైదరాబాద్ : ప్రముఖ కార్ల తయారీ కంపెనీ హోండా కార్స్ ఇండియా తన మధ్యస్థాయి ఎస్‌యువి ఎలివేట్‌ను హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేసింది. బుధవారం దీన్ని ఆ కంపెనీ నేషనల్ సేల్స్ హెడ్ నిఖీల్ సరీన్, ప్రొడక్ట్ హెడ్ గుర్మిత్ సింగ్, మార్కెటింగ్ జిఎం సబా ఖాన్ ఆవిష్కరించారు. ఎలివేట్ ఎక్స్‌షోరూం ధరల శ్రేణీని రూ.10,99,900-15,99,900గా నిర్ణయించింది.

నామినీల పేర్లను నమోదు చేయాలి

- బ్యాంక్‌లకు మంత్రి సీతారామన్ ఆదేశాలు

ముంబయి : ఆర్థిక సంస్థలు తప్పకుండా ఖాతాదారులకు సంబంధించిన నామినీల (వారసుల) పేర్లను తప్పకుండా నమోదు చేయాలని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. భవిష్యత్‌లో క్లెయిము చేసుకోని నగదు సమస్య రాకుండా బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్లతో సహా అన్ని ఆర్థిక సంస్థలు నామినీల పేర్లను తీసుకోవాలని ఆదేశించారు. తమ ఖాతాదారుల నామినీల పేర్లు, చిరునామాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలన్నారు.

జైలు అధికారులకు లంచం కేసు.. శశికళపై అరెస్ట్ వారెంట్

చెన్నై : తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళకు కర్నాటక లోకాయుక్త కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అక్రమాస్తుల కేసులో దోషిగా తేలి బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో మెరుగైన వసతుల కోసం జైలు అధికారులకు లంచమిచ్చినట్టు శశికళ అభియోగాలు ఎదుర్కొంటున్నారు. జైలు అధికారులకు రూ.2 కోట్ల వరకు లంచమిచ్చినట్టు ఆమెపై కేసు నమోదైంది. నిన్న బెంగళూరులోని లోకాయుక్త కోర్టులో జరిగిన విచారణకు శశికళ, ఆమె మరదలు ఇళవరసి తరపు న్యాయవాదులు గైర్హాజరయ్యారు. దీంతో న్యాయమూర్తి వారిద్దరికీ అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. వారికి బెయిలు పూచీకత్తు ఇచ్చిన వారికి కూడా నోటీసులు జారీ చేసిన కోర్టు తదుపరి విచారణను అక్టోబర్ ఐదో తేదీకి వాయిదా వేసింది.

సహాయ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా ఉండాలి

- గవర్నర్ డాక్టర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో రక్షిత, సహాయ చర్యల్లో చురుగ్గా పాల్గొనాలని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ రెడ్‌క్రాస్ వాలంటీర్లకు పిలుపునిచ్చారు. బుధవారం ఆమె రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర, జిల్లాల బాధ్యులతో ఆమె వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరంలో ఉన్న వారి కోసం హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

బీసీలకు పెద్ద పీట వేయండి

ఏఐసీసీకి పొన్నం వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీసీ సామాజికతరగతి అత్యధికంగా ఉన్న నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో వారికి పెద్ద పీట వేయాలని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అధిష్టానాన్ని కోరారు. దీంతోపాటు వారి విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బీసీ డిక్లరేషన్‌లో పొందుపరచాల్సిన అంశాలపై కాంగ్రెస్‌లోని బీసీ నేతలు చర్చించారు. అనంతరం కత్తి వెంకటస్వామి, నూతి శ్రీకాంత్, గాలి అనిల్‌కుమార్, గౌరీ సతీష్, ఈర్లపల్లి శంకర్, వెంకటేష్, మెట్టు సాయి కుమార్‌తో కలిసి పొన్నం విలేకర్లతో మాట్లాడారు. బలహీనవర్గాలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సంక్షేమం గాలికి వదిలేసిందనీ, కార్పొరేషన్ ఏర్పాటు చేసినా నిధులు ఇవ్వలేదన్నారు. రాజకీయంగా తగిన సీట్లు కేటాయించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇప్పటికే పీఏసీలో నిర్ణయం మేరకు అత్యధిక సీట్లు కేటాయించాలని తీర్మానించినట్టు పేర్కొన్నారు. కాంగ్రెస్ అండగా ఉంటుందనే నమ్మకాన్ని బీసీ డిక్లరేషన్ ద్వారా కల్పిస్తామన్నారు.


కృష్ణాష్టమి రోజు ఇంట్లోని చిన్న పిల్లలకు కృష్ణుడి వేషాలు వేయడం... ఉట్టి కొట్టి వేడుకలు చేసుకోవడం సర్వసాధారణం.. అయితే ఈ రోజు కృష్ణాష్టమిని పురస్కరించుకుని పిల్లలకు కృష్ణుని వేషాలంకరణతో పాటు, ఇష్టమైన వెన్న, పాలతో స్వీట్లు చేసుకుంటే ఈ వేడుక ఇంకా ఆనందమయంగా ఉంటుంది కదూ.. అందుకే వెన్న, పాలతో చేసే కొన్ని స్వీట్స్ ఈ వారం...

వెన్నతో కమ్మగా...

మలై కుల్ఫీ

కావాల్సిన పదార్థాలు : పాలు - అరలీటరు, కండెన్స్‌డ్ మిల్క్- అరకప్పు, పాలపొడి- కప్పు, కుంకుమ పువ్వు- చెంచా, యాలకులపొడి - చెంచా, పంచదార- రుచికి తగినంత, పిస్తా పలుకులు- పావుకప్పు, జీడిపప్పు- అలంకరణకు (నేతిలో వేయించాలి).

తయారు చేసే విధానం : మందపాటి అడుగున్న గిన్నె తీసుకుని పొయ్యి మీద పెట్టాలి. ఇందులో పాలు, కండెన్స్‌డ్ మిల్క్, పాలపొడి తీసుకొని మరిగించాలి. ఈ పాలు బాగా మరుగు తుండగా కుంకుమ పువ్వు, యాలకుల పొడి, తగినంత పంచదార చేర్చి బాగా కలియ తిప్పాలి. ఇప్పుడు సన్నటి మంట మీద మరిగి స్తూనే పిస్తా పలు కులు వేసి దించే యాలి. చిక్కటి పాల మిశ్రమాన్ని గుంట లోతుగా ఉన్న పాత్ర లోకి తీసుకొని ఓవెన్లో ఇరవై నిమి షాలు బేక్ చేయాలి. ఇలా తయారైన మలై కుల్ఫీని జీడిపప్పుతో అలంకరిస్తే సరిపోతుంది.



వెన్న అప్పాలు



కావాల్సిన పదార్థాలు : వరిపిండి - రెండు కప్పులు, మొక్కజొన్నపిండి - కప్పు, వెన్న - కప్పు, బెల్లం - అరకేజీ కన్నా తక్కువ, యాలకులపొడి - అరచెంచా, నూనె - వేయించడానికి సరిపడా.

తయారు చేసే విధానం : ఓ పాత్రలో బెల్లం, కాసిని నీళ్ల తీసుకుని కరిగించి మరిగించాలి. పాకం వచ్చాక వరిపిండి, వెన్న, మొక్కజొన్న పిండి వేసి బాగా కలిపి యాలకుల పొడి చేర్చాలి. మంట తగ్గించి మధ్యమధ్య కలుపుతూ ఉంటే కాసేపటికి మిశ్రమం దగ్గరగా అవుతుంది. అప్పుడు దింపేసి.. కొద్దిగా వేడిగా ఉన్నప్పుడే అప్పాల్లా వత్తుకుని కాగుతున్న నూనెలో వేయించుకోవాలి. తీపి అప్పాలు సిద్ధం.

చిరోజి



కావాల్సిన పదార్థాలు : మైదాపిండి - పావుకేజీ, పంచదార - పావుకేజీ, డాల్డా - వంద గ్రాములు, యాలకులు - రెండు, వరిపిండి - రెండు చెంచాలు, పాలు, పెరుగు - అరగ్లాసు చొప్పున, నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం : పంచదార, యాలకులు కలిపి మిక్సీలో పొడి చేసుకోవాలి. మైదాపిండిలో పాలు, పెరుగు చేర్చి చపాతీ పిండిలా కలిపి గంట నాననివ్వాలి. ఆ తరువాత కొద్దిగా పిండి తీసుకుని చపాతీలా వత్తి కొద్దిగా వరిపిండి, కరిగించిన డాల్డా చల్లాలి. దాన్ని పొడుగ్గా రోల్ చుట్టి చాకుతో చక్రాల్లా కోయాలి. మళ్లీ దాన్ని చిన్నసైజు పూరీలా వత్తుకుని కాగుతోన్న నూనెలో వేయించాలి. ఇలా మిగిలిన వాటినీ చేసుకోవాలి. వీటిపై పంచదారపొడి చల్లితే సరిపోతుంది.

వెన్న బర్ఫీలు

కావాల్సిన పదార్థాలు : వెన్న - పావుకేజీ, పాలపొడి - రెండు వందల గ్రాములు - మైదా పిండి - వంద గ్రాములు, యాలకులపొడి- అరచెంచా, నెయ్యి - వంద గ్రాములు, పంచదార - అరకేజీ, కొబ్బరి పొడి - మూడునాలుగు చెంచాలు.

తయారు చేసే విధానం : ఓ పాత్రలో వెన్న, మైదా, పాలపొడి, నెయ్యి తీసుకుని ముద్దలా చేసుకోవాలి. మరో పాత్రలో పంచదార కరిగించి సరిపడా నీళ్ల చేర్చి పాకం రానివ్వాలి. పాకం కొద్దిగా ముదురు అవుతుండగా ముందుగా కలిపి పెట్టుకున్న మైదా మిశ్రమం, యాలకులపొడి, కొబ్బరి పొడి చేర్చి కలుపుకోవాలి. రెండుమూడు నిమిషాలయ్యాక నెయ్యి రాసిన పళ్లెంలోకి ఈ మిశ్రమాన్ని తీసుకోవాలి. పైన డ్రైఫ్రూట్స్ అలంకరించి చల్లారాక ఫ్రిజ్‌లో ఉంచాలి. రెండుమూడు గంటలయ్యాక పలుచని ముక్కల్లా కోసుకుంటే సరిపోతుంది.



పరిమితులతో... కలివిడిగా...

అత్తాకోడళ్లు అంటే ఎక్కువ శాతం బద్ధశత్రువులన్నట్లు మెలుగుతుంటారు. ఉమ్మడి కుటుంబాలలో ఈ సమస్య అధికంగా ఉంటుంది. ఆ ప్రభావమేనేమో ఈ రోజుల్లో ఎక్కువ శాతం చిన్న కుటుంబాలుగా ఎవరి బాధ్యతల్లో వారు మునిగిపోయి ఉన్నారు. అయితే అందరూ ఏదొక సందర్భంలో ఒకే దగ్గర గడపాల్సి వస్తుంది. అలాంటప్పుడు కొన్ని సమస్యలు ఎదురవుతాయి. అర్థం చేసుకుని, అనునయంతో మెలిగితే సమస్యలకు చెక్ పెట్టవచ్చు. కానీ ఎవరికి వారు నాకెందుకు అనే ధోరణి పెరిగిపోతోంది. అలా కాకుండా కలిసి ఉన్న సమయంలో సమస్యలు రాకుండా ఉండాలంటే, సంబంధాలు, ప్రవర్తన ఎలా వుండాలో తెలుసుకుందాం...



అత్త అనగానే చాలామంది కోడళ్లు అయిష్టతను ప్రదర్శిస్తుంటారు. పెండ్లయి ఆమె ఇంట్లో అడుగుపెట్టిన నాటి నుండి కోడలి పట్ల అత్తలూ అలాగే ఉంటారు. మనసుండాలే కానీ అత్త పట్ల కోడలు, కోడలి పట్ల అత్త ఆప్యాయతలు చూపించడం పెద్ద కష్టమైన విషయమేమీకాదు. ఒకరి వ్యక్తిత్వాన్ని మరొకరు గౌరవిస్తూ, ఒకరి పట్ల మరొకరు స్నేహంగా మసలుకుంటే అత్తాకోడళ్ల బంధం కూడా ఎన్నో మధురానుభూతులను పంచుతుంది.

పరిమితులు ఎరిగి ప్రవర్తించాలి

కుటుంబంలో అత్త పాత్ర చాలా ముఖ్యమైంది. అయితే అత్త మీద వచ్చినన్ని విమర్శలు మరే సంబంధంలోనూ కనబడవు. కొడుకు, కోడలు, తల్లి... ఈ ముగ్గురి మధ్య సాగే బంధంలో ప్రతి ఒక్కరూ తమ పరిమితులు ఎరిగి ప్రవర్తించాలి. కోడలి వల్ల కొడుకు తనకు ఎక్కడ కాకుండా పోతాడోననే భయం, సందేహాల వంటివి తల్లిని చుట్టుముడతాయి. దాంతో కోడలి మీద ఆధిపత్య ధోరణి చూపిస్తుందామె. కోడలి పరిస్థితి కూడా అంతే. భర్తను తన నుంచి అత్త దూరం చేస్తుందేమోనని ఆమె పట్ల వ్యతిరేక భావాన్ని కోడలు పెంచుకుంటుంది.

పరస్పర అవగాహన అవసరం

ఇలాంటి సమస్యల మధ్య అత్తాకోడళ్ల బంధం సవ్యంగా సాగాలంటే వారి మధ్య పరస్పర అవగాహన ఎంతో అవసరం. అత్తాకోడళ్లు ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకోవడంలో ఆచితూచి వ్యవహరించాలి. ఇద్దరూ వాళ్ల మనసులోని మాటల్ని ఒకరితో ఒకరు స్వేచ్ఛగా పంచుకోవాలి. కుటుంబం మొత్తం కలిసి గడిపేటప్పుడు అత్తను కూడా కోడలు ప్రేమపూర్వకంగా ఆహ్వానించాలి. ఒకరి ఇష్టాలను ఒకరు తెలుసు కోవాలి. ఒకరి కోసం ఒకరు ప్రత్యేకంగా ఏమైనా చేయాలి. అప్పుడే ఆ ఇద్దరి మధ్య పటిష్టమైన స్నేహబంధం పెంపొందుతుంది. అప్పుడు అత్తకు కోడలంటే కోపం ఉండదు. కోడలూ అభద్రతా భావానికి లోనుకాదు.

పోటీతత్వం వద్దు

కోడలిపట్ల కోపాన్ని, అసూయను పెంచుకోవడం వల్ల అత్తకు ఒరిగేదేమీ లేదు. అలాగే తన అతిప్రేమతో కొడుకును, కోడలిని కూడా తల్లి ఇబ్బంది పెట్టకూడదు. చాలా సందర్భాలలో అత్తాకోడళ్ల మధ్య ఉన్న పోటీతత్వం వల్ల కాపురాలు ఛిన్నాభిన్నమౌతున్నాయి. కొడుకు విషయంలో తల్లి ఓవర్ ప్రొటెక్టివ్‌గా వ్యవహరిస్తుంటుంది. తను లేకపోతే తన కొడుకు ఏమీ చేసుకోలేడు, తినలేడు, ఉండలేడు అనుకుంటుంది. పెండ్లయిన తర్వాత కొడుకు మనసులో తన స్థానం ఎక్కడ పోతుందోననే భయం కూడా తల్లిని చుట్టుముడుతుంది. కానీ ఇలాంటి సందర్భాల్లోనే తల్లులు విజ్ఞతతో, వివేకంతో మసలుకోవాలి. కొడుకును పెంచి పెద్ద చేయడం, విద్యాబుద్ధులు చెప్పించడం, మంచి, చెడుల విచక్షణ నేర్పించడం, కుటుంబాన్ని నడిపించేలా తీర్చిదిద్దడం వరకే తన బాధ్యతని గ్రహించాలి. అంతే కాదు ఏదో ఒకరోజు వేరే స్త్రీని పెండ్లి చేసుకుని తనదైన కుటుంబ జీవితాన్ని కొడకు ఏర్పరచుకుంటాడని, అతడి కుటుంబ వ్యవహారాల్లో తను తలదూర్చకూడదని ఆమె గ్రహించాలి. అలాగే కోడలు కూడా తన భర్తను పెంచి పెద్దచేసిన తల్లికి ఇచ్చే ప్రాధాన్యతలో ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలి. అత్తకు తగిన గౌరవం కచ్చితంగా ఇచ్చి తీరాలి. ఆ గౌరవాన్ని అత్త తన పెద్దరికంతో, అనుభవంతో నిలబెట్టుకోవాలి. అప్పుడు ఎలాంటి సమస్యలూ వుండదు.

ప్రతి పనినీ విమర్శించకూడదు

కొడుకు, కోడలు జీవితాల్లో అత్త కలగజేసుకోకూడదు. ఇలా చేసుకోవడం వల్ల చాలా సందర్భాలలో భార్యాభర్తల మధ్య కీచులాటలు మొదలవుతాయి. అలాగే కోడలు చేసే ప్రతి పనిని అత్త విమర్శించడం వల్ల కూడా అత్తాకోడళ్ల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరతాయి. అయినదానికి కానిదానికీ విమర్శించే గుణం వల్ల అత్తంటే కోడలికి పడని పరిస్థితి తలెత్తుతుంది. అందుకే అత్త, కోడలు, కొడుకు ఈ ముగ్గురూ తమ తప్పొప్పులను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ ముందుకు సాగితేనే వారి మధ్య బంధం బలపడుతుంది. ఆదిపత్యం చూపించాలనుకుంటే మాత్రం శత్రువులుగా మిగిలిపోతారు.

అధిగమించడమెలా?



మోనోపాజ్... జీవితంలో ప్రతి మహిళా ఎదుర్కొనే ఓ దశ. సహజంగా 50 నుంచి 55 యేండ్లలోపు ఈ దశ ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి ప్రతినెలా క్రమం తప్పకుండా వచ్చే రుతుక్రమం నుంచి తప్పించుకునే అవకాశం లభిస్తుంది. అయితే ఈ దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు నియమాల గురించి చాలామందికి అవగాహన ఉండదు. అలాంటి వారు ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే..

మోనోపాజ్ దశ రావడానికి ప్రధాన కారణం హార్మోన్లే. రుతుక్రమం ప్రారంభం అయినప్పటి నుంచి విడుదలయ్యే అండాలు హార్మోన్లు విడుదల క్రమంగా తగ్గిపోవడం ఈ దశ లక్షణం. ఈ దశకు ముందు రుతుక్రమం అస్తవ్యస్తమవుతుంది. కొందరికి నాలుగైదు నెలల వరకు రుతుక్రమం రాకపోవచ్చు. మరికొందరికి యేడాది వరకు రాకపోవచ్చు. అది వారి వారి శరీరతత్వం మీద ఆధారపడి ఉంటుంది.

ఈ దశ ప్రారంభం కావడానికి యేడాది రెండేండ్ల ముందు నుంచే లక్షణాలు ఒక్కొక్కటిగా బయట పడుతుంటాయి. అవన్నీ తాత్కాలిక సమస్యలుగానే గుర్తించాలి. వాటిని అధిగమిం చడానికి మందుల కన్నా ఆహారంలోనూ, జీవన విధానంలోనూ కొన్ని మార్పులు చేసుకోవాలంటున్నారు నిపుణులు. ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్లకు పీరియడ్స్‌ను నియంత్రించే శక్తి ఉంటుందట. అందుకే అవి ఎక్కువగా ఉండే ఆహారం మోనోపాజ్‌పై ప్రభావం చూపుతుందట. అందుకే టమాటా, నల్లద్రాక్ష, గ్రీన్‌టీ, నిమ్మ ఆపిల్, ఉల్లిగడ్డ, క్యారెట్ లాంటివి కచ్చితంగా ఆహారంలో వుండేలా చూసుకోవాలి.

ఆస్తుల్లో బీజేపీ...అప్పుల్లో కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

21.17% పెరిగింది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ఆస్తుల విలువ 2020-21లో రూ.691.11 కోట్లు కాగా గత ఏడాది 16.58% పెరిగింది. ఇక పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆస్తుల విలువ భారీగా పెరిగింది. ఆ పార్టీకి 2020-21లో రూ.182 కోట్ల విలువైన ఆస్తులు ఉండగా 2021-22లో ఒకేసారి 151.70% పెరిగి రూ.458.10 కోట్లకు చేరింది.

ఇతర జాతీయ పార్టీల ఆస్తుల విలువ పెరుగుతుంటే బీఎస్పీ ఆస్తుల విలువ మాత్రం తగ్గుతోంది. 2020-21లో ఆ పార్టీ ఆస్తుల విలువ రూ.732.79 కోట్లు కాగా గత ఏడాది రూ.690.71 కోట్లకు తగ్గిపోయింది. ఎనిమిది జాతీయ పార్టీల ఆస్తుల విలువ కలిపి 2020-21లో రూ.7,297.618 కోట్లు ఉండగా గత సంవత్సరం రూ.8,829.158 కోట్లకు పెరిగింది.

అప్పుల విషయానికి వస్తే కాంగ్రెస్ మొదటి స్థానంలో ఉంది. 2021-22లో ఆ పార్టీ తన అప్పులను రూ.41.95 కోట్లుగా చూపింది. అదే కాలంలో బీజేపీ అప్పులు కేవలం ఐదు కోట్ల రూపాయలు మాత్రమే. ఎనిమిది జాతీయ పార్టీలకూ కలిపి గత సంవత్సరంలో రూ.62.67 కోట్ల అప్పులు ఉన్నాయి.

సంస్కరణల సంఘం సూచనలు

ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీల నుండి తీసుకున్న రుణాల వివరాలను ప్రకటించాలంటూ భారత ఛార్టర్డ్ అకౌంటెంట్ల సంస్థ జాతీయ పార్టీలకు మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ అవి పట్టించుకోలేదని ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం తెలిపింది. 1951వ సంవత్సరపు ప్రజా ప్రాతినిధ్య చట్టంలో సెక్షన్ 78-ఏను ప్రవేశపెట్టాలని, ఖాతాలు సరిగా నిర్వహించని రాజకీయ పార్టీలకు జరిమానాలు విధించాలని 170వ లా కమిషన్ నివేదిక సిఫారసు చేసిందని గుర్తు చేసింది. ఈ సిఫారసులను అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని సూచించింది. కాగ్ ప్యానల్‌లోని అర్హత కలిగిన, ప్రాక్టీస్ చేస్తున్న ఛార్టర్డ్ అకౌంటెంట్లతో రాజకీయ పార్టీల ఖాతాలను ఆడిట్ చేయించాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం రాజకీయ పార్టీలు తమంత తామే ఛార్టర్డ్ అకౌంటెంట్లను నియమించుకుంటూ ఖాతాలు ఆడిట్ చేయించుకుంటున్నాయని ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం తెలిపింది.

కనీస వేతనాల సవరణ ఎప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

అభిరుచులు కూడా మారుతుంటాయి. వాటికి తగినట్లుగానే ఖర్చు కూడా పెరుగుతుంది. అందువల్ల కనీస వేతనాన్ని నిర్ణయించేటప్పుడు ఈ విషయాలను కూడా దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది. 2022-23 ఆర్థిక సర్వే ప్రకారం మన దేశంలో కార్మికులు పొందుతున్న వేతనంలో (అసలైన వేతనం) కొనుగోలు శక్తి ప్రతికూల వృద్ధి నమోదు చేసింది. కనీస వేతనాలు పెరుగుతున్నప్పటికీ ఇలా జరగడం గమనార్హం. 2022 ఏప్రిల్-నవంబర్ మధ్యకాలంలో వ్యవసాయ రంగంలో పురుషుల కనీస వేతన రేటు 5.1%, మహిళల కనీస వేతన రేటు 7.5% పెరిగింది. వ్యవసాయేతర కార్యకలాపాలలో ఈ రేటు 4.7%, 3.7% చొప్పున పెరిగింది. అయితే ద్రవ్యోల్బణం పెరగడంతో వాస్తవంగా గ్రామీణ వేతనాలు తగ్గాయని ఆర్థిక సర్వే తెలిపింది.

జమిలిపై ఏం చేద్దాం..!

(మొదటిపేజీ తరువాయి)

అర్జున్ రామ్ మేఘ్వాల్ కలిశారు. బుధవారం రామ్‌నాథ్ కోవింద్ నివాసంలో ఈ భేటీ జరిగింది. ప్రభుత్వం ప్యానెల్‌ను నోటిఫై చేసిన కొద్ది రోజుల ఈ భేటీ జరిగింది. దాదాపు గంటపాటు జరిగిన ఈ సమావేశాన్ని నేతలు మర్యాదపూర్వక భేటీ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఉన్నతస్థాయి కమిటీ తొలి సమావేశాన్ని నిర్వహించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసి వేదికను ఖరారుపై చర్చించారు. భవిష్యత్తులో సమావేశాలు కూడా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించవచ్చని తెలిపారు. ప్యానెల్‌కు సహాయం చేసే, సెక్రెటేరియల్ సహాయం అందించే అధికారులను నామినేట్ చేసే ప్రక్రియలో న్యాయమంత్రిత్వ శాఖ ఉన్నట్టు తెలిసింది.లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించే అంశంపై పరిశీలించి సిఫారసులు చేయడానికి ప్రభుత్వం రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీకి నోటిఫై చేసిన విషయం విదితమే.

తెలంగాణ ఎన్నారైలకు క్షమాభిక్ష ..!

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

దుబాయ్‌లోని అవీర్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న తెలంగాణ ఎన్నారైల విడుదల కోసం మంత్రి కేటీఆర్ మరోసారి ప్రయత్నిస్తున్నారు. దుబాయ్ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ సిరిసిల్ల జిల్లాకు చెందిన ఐదుగురు ఖైదీల విడుదల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పెట్టుబడుల కోసం దుబాయ్‌లో పర్యటిస్తున్న కేటీఆర్ ఖైదీల విడుదల అంశాన్ని అక్కడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీల కుటుంబ సభ్యులు, బంధువులు, ఈ కేసును వాదిస్తున్న అరబ్ లాయర్, దుబాయ్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయ అధికారులు, దుబాయ్ ప్రభుత్వ అధికారులతో మంత్రి కేటీఆర్ మాట్లాడారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన శివరాత్రి రవి, శివరాత్రి మల్లేష్, గొల్లెం నాంపల్లి, దుండగుల లక్ష్మణ్, శివరాత్రి హనుమంతులు ఒక కేసులో భాగంగా దుబాయ్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్నారు. దాదాపు 15ఏండ్లకు పైగా శిక్ష పూర్తి చేసుకున్నారు. ఇప్పటికే ఈ నేరంలో ప్రాణం కోల్పోయిన నేపాల్‌కు చెందిన బాధిత కుటుంబం దగ్గరికి గతంలో వెళ్లిన మంత్రి కేటీఆర్.. దియ్య సొమ్ము(బ్లడ్ మనీ) అందించారు. ఆ తర్వాత ఆ కుటుంబం క్షమాభిక్ష పత్రాన్ని దుబాయ్ ప్రభుత్వానికి సమర్పించారు. అయితే ఇతర కారణాలు, నేరం తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం క్షమాభిక్షను ఇప్పటిదాకా ఇవ్వలేదు. ఆరు నెలల కింద మరోసారి మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా దుబాయ్ లాయర్‌కు అవసరమైన ఫీజులు చెల్లించి, తన కార్యాలయ అధికారులను దుబాయ్ పంపించి మరీ ఈ వ్యవహారం తాలూకు పురోగతిని సమీక్షించారు. ఇప్పటికే బాధిత కుటుంబానికి రూ.15లక్షల నష్టపరిహాన్ని షరియా చట్టం ప్రకారం దియ్య(బ్లడ్ మనీ) రూపంలో అందించినట్టు తెలిపారు. 2013లో నేపాల్ విదేశాంగ శాఖతో సమన్వయం చేసుకొని క్షమాభిక్షకు అవసరమైన అన్ని రకాల పత్రాలను దుబాయ్ ప్రభుత్వానికి భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం ద్వారా అందించామని తెలిపారు. అయినా, నిందితులకు ఉపశమనం లభించలేదని మంత్రి కేటీఆర్ బుధవారం భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయ అధికారులకు, దుబాయ్ ప్రభుత్వాధికారులకు తెలియజేశారు. సుదీర్ఘ కాలం శిక్ష అనుభవించి మంచి ప్రవర్తన కలిగిన ఖైదీలుగా నివేదిక కూడా కలిగి ఉన్న తెలంగాణ ఎన్నారైలకు వెంటనే క్షమాభిక్ష ప్రసాదించాలని కోరారు.

అంతకుముందు జరిగిన బిజినెస్ సమావేశాల సందర్భంగా రాజ కుటుంబానికి అత్యంత దగ్గర ఉన్న పలువురు వ్యాపారవేత్తలతో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించి, మానవతా దృక్పథంతో తెలంగాణ ఎన్నారైల క్షమాభిక్ష కోసం సహకరించాలని కోరారు. మంత్రి కేటీఆర్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, దుబాయ్ ప్రభుత్వంతో ఈ విషయాన్ని స్థానిక చట్టాల మేర చర్చించేందుకు పనిచేస్తామని మంత్రికి వారు హామీ ఇచ్చారు.

ఆచితూచి మాట్లాడండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని మోడీ మాట్లాడుతూ "భారత్" అంశాన్ని ప్రస్తావించారు. భారత్ అంశంపై అతిగా స్పందించొద్దని కేంద్ర మంత్రులకు సూచించారు. ఇండియా వర్సెస్ భారత్ వివాదంపై వ్యాఖ్యలు చేయవద్దని చెప్పారు. కేవలం సంబంధిత వ్యక్తులు మాత్రమే దీనిపై మాట్లాడాలని స్పష్టం చేశారు. సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలకు దీటుగా సమాధానం చెప్పాలని మంత్రులను ఆదేశించారు. చరిత్ర లోతుల్లోకి వెళ్లవద్దని,ఈ అంశంలో ప్రస్తుత, సమకాలిక పరిస్థితి గురించి మాత్రమే మాట్లాడాలని స్పష్టం చేశారు.

జీ20 సదస్సుకు వచ్చే విదేశీ అతిథులకు రెండు రోజుల పాటు ఎలాంటి లోటు రాకుండా చూసుకోవాలని సహచర కేంద్రమంత్రులకు సూచించారు. మంత్రులంతా తమ అధికారిక వాహనాలను పక్కన పెట్టాలని తెలిపారు. ఎక్కువ మంది వీఐపీ వాహనాల్లో తిరిగితే ప్రోటోకాల్ సమస్యలు రావొచ్చని ఆయన అన్నారు.

అందుకే కేంద్రమంత్రులు భారత్ మండపం, ఇతర వేదికల వద్దకు చేరుకోవడానికి షటిల్ సర్వీసులను వినియోగించాలని కోరారు. జీ20 ఇండియా మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విదేశీ ప్రముఖులతో సంభాషించే సమయంలో అందులోని అనువాదం ఉపయోగపడుతుందని అన్నారు.

16న పాలమూరు-రంగారెడ్డి వెట్ రన్

(మొదటిపేజీ తరువాయి)



కష్ణా జలాలను ఎత్తిపోయనున్నారు. ప్రపంచంలోనే మరెక్కడా లేని అత్యంత భారీ పంపులతో నిర్మితమైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి దక్షిణ తెలంగాణ ప్రజల తాగునీరు, సాగునీరు అవసరాలను తీర్చనున్నామని సీఎం తెలిపారు. ఉమ్మడి పాలనలో నిర్లక్ష్యానికి గురైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి స్వరాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వ దార్శనికతతో అనేక అడ్డంకుల నుంచి మోక్షం లభించడం చారిత్రక సందర్భమని స్పష్టం చేశారు. దశాబ్దాల కల సాకారమవుతున్న నేపథ్యంలో దక్షిణ తెలంగాణ ప్రజలకు ఇది గొప్ప పండుగ రోజనీ సీఎం వ్యాఖ్యానించారు. అందుకోసం ప్రారంభమైన తెల్లారి ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లోని పల్లెల్లో ఊరేగింపులతో ఈ విజయాన్ని పెద్ద ఎత్తున సంబురాలతో జరుపుకోవాలని సూచించారు. ప్రారంభానికి గ్రామాల నుంచి సర్పంచులు సహా తరలివచ్చే ప్రజలు కలషాలు తెచ్చుకుని వాటితో తీసుకెళ్లిన కష్ణా జలాలతో ఆయా గ్రామాల్లో దైవాల పాదాలను అభిషేకించి మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బుధవారం డా బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టుల పనులను సమీక్షించారు. ప్రాజెక్టు పరిధిలో కాల్వల తవ్వకంతోపాటు దానికి సంబంధించి భూ సేకరణ సహా అనుబంధ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఇప్పటికే డ్రైరన్ ట్రయల్స్‌ను పూర్తి చేసుకుని వెట్‌రన్‌ను సిద్ధంగా ఉన్నట్టు సమావేశంలో పాల్గొన్న ఇంజినీరింగ్ అధికారులు సీఎంకు వివరించారు. ఇంజినీర్ల సూచనల మేరకు ఈ నెల 16న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల వెట్‌రన్ ప్రారంభం కానున్నది. కష్ణా నదికి అనుసంధానించి, (శ్రీశైలం ఫోర్ ఫ్లో వద్ద) నార్లాపూర్ వద్ద నిర్మించిన ఇన్‌టేక్ వద్దకు చేరుకుని అక్కడ స్విచ్ ఆన్ చేసి పంపులను ప్రారంభిస్తారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న తెలంగాణను సస్యశ్యామలం చేసే పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించుకుంటున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రతి పల్లెనుంచీ సర్పంచులు గ్రామస్థులు ఈ బహిరంగ సభకు హాజరుకావాలని చెప్పారు.

మీ అజెండా ఏంటి..?

(మొదటిపేజీ తరువాయి)

ఎస్పీ, జేఎంఎం వంటి పార్టీలు పాల్గొన్నాయి. ఎలాంటి అజెండానూ ప్రకటించకుండానే మోడీ ప్రభుత్వం సమావేశాలను నిర్వహిస్తున్నదని మల్లిఖార్జున్ ఖర్గే తెలిపారు. ఈ సమావేశాల్లో ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని భేటీ అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఈనెల 18 నుంచి 22 వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి.ఈ ప్రత్యేక సమావేశాల్లో మోడీ సర్కారు కొన్ని వివాదాస్పద బిల్లులను తీసుకొచ్చే అవకాశమున్నదని రాజకీయ వర్గాల్లో ఇప్పటికే చర్చ నడుస్తున్నది. ఇందులో 'వన్ నేషన్-వన్ ఎలక్షన్', ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) అమలు వంటివి ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, ఇంత జరుగుతున్నా.. మోడీ ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలి అజెండా ఏంటో చెప్పకపోవటం గమనార్హం.

కొత్త భవనంలో పార్లమెంట్ సమావేశాలు..!

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అవుతాయని, వినాయక చవితిని పురస్కరించుకొని సెప్టెంబర్ 19 నుంచి ఈ సమావేశాలు కొత్త భవనంలోకి మార్చనున్నారని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. అయితే వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు కూడా కొత్త భవనంలోనే జరుగుతాయని తొలిత చెప్పినప్పటికీ, ఆ తరువాత పాత భవనంలోనే జరిపారు.

బీజేపీది అపరిపక్వత

(మొదటిపేజీ తరువాయి)

లౌకిక శక్తులు ఇండియా పేరుతో ఏకమయ్యాయి. అది వారికి ఇబ్బందిగా ఉంది. అందుకే వాళ్లు భారత్ అంటున్నారు. ప్రతిపక్షాలు ఇండియా అని అంటుంటే బీజేపీ వణికిపోతోంది" అని సీతారాం ఏచూరి అన్నారు. ఇండియా పేరును మార్చడం రాజ్యాంగాన్ని అవమానించడమే అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

మూడోవారంలో మొదటి జాబితా

అందించనుంది. సెప్టెంబర్ మూడోవారంలో కాంగ్రెస్ మొదటి జాబితా విడుదల చేయనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అక్టోబర్ రెండోవారంలో రెండో జాబితా ప్రకటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నది.


అసైన్డ్ ల్యాండ్ చట్ట సవరణపై హైకోర్టులో పిల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టంలో సవరణలు తీసుకొచ్చి వాటిని కొన్న వారికి యాజమాన్య హక్కు కల్పించే ప్రయత్నం చేస్తోందంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిని ప్రధాన న్యాయమూర్తి ఆలోక్ ఆరాదే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. అసైన్డ్ భూములు కొన్న వారికి మేలు జరిగేలా చట్ట సవరణ చేయడాన్ని అడ్డుకోవాలనీ, ప్రభుత్వ చర్య అమలును నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ రిపబ్లికన్ పార్టీ నేత ఆనంద్ వేసిన పిల్‌లో ప్రతివాదులకు నోటీసులిచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి ఇతరులను ఆదేశించింది. విచారణను ఈ నెల చివరి వారానికి వాయిదా వేసింది. ప్రతివాదుల జాబితా నుంచి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌లను చేర్చడానికి హైకోర్టు నిరాకరించింది.

మెడికల్ లోకల్ సీట్లపై ముగిసిన వాదన

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పెట్టిన మెడికల్ కాలేజీలో స్థానిక కోటా సీట్లు తెలంగాణ వారికే చెందేలా ప్రభుత్వం ఇచ్చిన జీవో 72ను సవాలు చేస్తూ దాఖలైన రిట్లపై బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును వాయిదా వేస్తున్నట్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ వెల్లడించింది. ఏపీ విద్యార్థులు వేసిన రిట్‌ను కొట్టేయాలని ప్రభుత్వం, కాళోజీ యూనివర్సిటీలు వాదించాయి. తెలంగాణ ఏర్పాటయ్యేనాటికి ఉన్న కాలేజీ సీట్లల్లో 85 శాతం ఏపీ, తెలంగాణ విద్యార్థులు స్థానికులుగా పరిగణిస్తున్నట్లు చెప్పాయి.



నేహా శెట్టి, కిరణ్ అబ్బవరం

విందు భోజనం లాంటి సినిమా

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'రూల్స్ రంజన్'. నిర్మాత ఏ.ఎం. రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రింకు కుక్రెజ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'నాలో నేనే లేను', 'సమ్మోహనుడా', 'ఎందుకురా బాబు' పాటలు ఒక దానికి మించి ఒకటి అన్నట్లుగా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని, సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్‌ను ఈనెల 8న ఉదయం 11:22 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలుపుతూ ఒక కొత్త పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. హీరో కిరణ్ అబ్బవరం గత చిత్రాలకు, ఇమేజ్‌కు భిన్నంగా ఈ చిత్రం సరికొత్తగా ఉండటంతో పాటు, పూర్తి స్థాయి వినోద భరితంగా ఉంటుందని నిర్మాతలు తెలిపారు.

భావోద్వేగాలు, ప్రేమ, హాస్యం, అద్భుతమైన సంగీతం కలగలిసిన ఈ విందుభోజనం లాంటి చిత్రం కుటుంబ ప్రేక్షకులను, యువతను ఆకట్టుకుని ఘన విజయం సాధిస్తుందని చిత్రబృందం నమ్మకం వ్యక్తం చేసింది. ఈనెల 28న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

నవచిత్రం

వైట్ మనీని బ్లాక్ మనీగా మారిస్తే..?



నివేదా పేతురాజ్, రిత్విక్ ముఖర్జీ, అవినాష్ తివారీ తదితరులు నటించిన క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'కాలా'. హాట్‌స్టార్ స్పెషల్స్ లాంగ్ ఫారమ్ స్టోరీ టెల్లింగ్‌లోకి టి-సిరీస్ తమ మొదటి వెంచర్ 'కాలా'తో ఎంట్రీ ఇచ్చింది. బిజోయ్ నంబియార్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఈనెల15 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో మాత్రమే ప్రసారం కానుంది.

ఇప్పటికే విడుదలైన ట్రైలర్ అందర్నీ ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు బిజోయ్ నంబియార్ మాట్లాడుతూ, 'నల్లధనాన్ని తెల్లగా మార్చుకునే వ్యక్తుల గురించి మనమందరం విన్నాము - కానీ ఎవరైనా తెల్లధనాన్ని నల్లగా మార్చే పరిస్థితిని మీరు ఎప్పుడైనా ఊహించారా? ప్రతీకారం, అధికారం డబ్బును జయించే ప్రపంచంలో అబద్ధాలు, మోసాల వల ద్వారా జీవితం అనే ఆటలో గెలవడానికి ఏకైక మార్గం. డిస్నీం హాట్‌స్టార్‌లో రాబోయే ఈ ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ ది వరల్డ్ ఆఫ్ కాలాలో 'కాలా'తో మీరు ఇంతకు ముందెన్నడూ చూడని నేరాలను చూడబోతున్నారు' అని తెలిపారు.

భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్‌తో కలిసి బిజోయ్ నంబియార్ దీన్ని నిర్మించిన దీనికి బిజోయ్ నంబియార్, ఫ్రాన్సిస్ థామస్, ప్రియస్ గుప్తా, మిథిలా హెగ్డే, శుభ్ర స్వరూప్ రచయితలు.

నయా స్పై థ్రిల్లర్



99 సినిమాస్ బ్యానర్‌పై బిష్ణు అధికారి, అదితి శర్మ, ఆంచల్ శర్మ హీరో, హీరోయిన్లుగా బిష్ణు దర్శకత్వంలో దీపక్ అధికారి నిర్మిస్తున్న స్పై థ్రిల్లర్ 'హిట్ మ్యాన్'. ఈ సినిమా నవంబర్‌లో రిలీజ్ కానుంది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను నిర్మాత ఎ.ఎం.రత్నం విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు తెలియ జేశారు.

ఈ సందర్భంగా హీరో, డైరెక్టర్ బిష్ణు అధికారి మాట్లాడుతూ, 'ఇదొక స్పై థ్రిల్లర్. దీనికి స్క్రిప్ట్ నేనే రాసి, డైరెక్ట్ చేయటంతో పాటు హీరోగానూ నటించాను. మన దేశంతోపాటు పారిస్, దుబాయ్, ఆమ్స్టర్డామ్, నేపాల్, శ్రీలంక.. ఇలా 6 వేర్వేరు దేశాల్లో చిత్రీకరించాం. ఈ సినిమాను మూడు భాగాలుగా చిత్రీకరిస్తున్నాం. ఛాప్టర్ 1 నవంబర్‌లో రిలీజ్ కానుంది. 'రాంబో' సినిమా తర్వాత విల్లు, బాణాలతో కూడిన యాక్షన్ మూవీ మరోటి రాలేదు. ఈ సినిమాలో అలాంటి యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించాం. ఛాప్టర్1కి సంబంధించిన షూటింగ్ పూర్తయ్యింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. 'ఐరన్ మ్యాన్' సినిమాలో జార్విస్ టెక్నాలజీ ఉన్నట్లు ఈ సినిమాలో ఓ కొత్త టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సినిమాను విడుదల చేయటానికి ప్లాన్ చేస్తున్నాం. హిందీలోనూ రిలీజ్ చేయటానికి చర్చలు జరుపుతున్నాం. త్వరలోనే ట్రైలర్ విడుదల చేసి, రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాం' అని అన్నారు.

'బిష్ణు మాకు మంచి స్నేహితుడు. రెండేళ్ల ముందు మా ప్రయాణం మొదలైంది. ఇప్పుడు అవుట్ పుట్ చూశాక చాలా హ్యాపీగా ఉంది' అని కో ప్రొడ్యూసర్ సిప్రా మిశ్రా చెప్పారు.

మెగాస్టార్ ప్రశంసించారు



మహేష్ బాబు

'రారా కృష్ణయ్య' తర్వాత దర్శకుడు పి.మహేష్ బాబు తెరకెక్కించిన సినిమా 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. నవీన్ పోలిశెట్టి, అనుష్క జంటగా నటించిన ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ నిర్మించింది. నేడు (గురువారం) ఈ సినిమా పాన్ ఇండియా రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు పి.మహేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ, 'జీవితంలో పెళ్లి చేసుకోకూడదు అనే ఆలోచన ఉన్న ఒక అమ్మాయి పెళ్లి కాకుండా తల్లి అవడంలో సంతోషాన్ని కోరుకుంటుంది. అందుకోసం ఒక అబ్బాయి హెల్ప్ తీసుకుంటుంది. ఇలా మొదలైన ప్రయాణం ఎక్కడ ముగిసింది?, అనేది ఈ సినిమా. ట్రైలర్‌లోనే మేము ఈ పాయింట్ చెప్పి ఆడియెన్స్‌ను ప్రిపేర్ చేశాం. ట్రైలర్‌ను ఎలా ఎంజాయ్ చేశారో రేపు మూవీని కూడా అలాగే ఎంజాయ్ చేస్తారనే నమ్మకం నాకు ఉంది. నవీన్ పోలిశెట్టి, అనుష్క సిద్ధు, అన్విత క్యారెక్టర్స్‌లో నేచురల్‌గా నటించారు. చిరంజీవి మా సినిమా చూసి అప్రిషియేట్ చేశారు. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో టెన్షన్‌గా ఉన్న మాకు ఆయన ప్రశంస పెద్ద సక్సెస్ కొట్టిన ఫీలింగ్ ఇచ్చింది' అని తెలిపారు.

క్రిమినల్‌గా తనీష్



తనీష్

చైల్డ్ ఆర్టిస్ట్‌గా, తర్వాత హీరోగా తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్నారు తనీష్. 'నచ్చావులే' సినిమాతో హీరోగా అందర్నీ ఆకట్టుకున్న ఆయన పలు చిత్రాల్లోని భిన్న పాత్రలతో మెప్పించారు. ఆ తర్వాత ప్రతినాయకుడిగానూ నటించించారు. అయితే కొద్దిరోజులుగా నటనకు దూరంగా ఉంటున్నప్పటికీ మధ్యలో బిగ్ బాస్ సీజన్2లో టాప్ 5 కంటెస్టెంట్‌గా మెరిసిన తనీష్ ఇప్పుడు సరికొత్తగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. నేడు(గురువారం) తనీష్ బర్త్‌డే. ఈ సందర్భంగా ఆయన కిశోర్‌వర్మ దర్శకత్వంలో నటిస్తున్న 'క్రిమినల్' మూవీ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో తనీష్ కొత్తగా కనిపించడంతోపాటు ఒక్క పోస్టర్‌లోనే రెండు వేరియేషన్స్‌తో డిఫరెంట్‌గానూ ఉన్నారు. క్రియేటివ్ ఫ్రెండ్స్ ప్రొడక్షన్ బ్యానర్ పై రూపొందుతున్న ఈ చిత్ర విశేషాలను త్వరలోనే తెలియచేస్తామని చిత్ర బృందం పేర్కొంది.

ఆటలు

సెమీస్‌లో జకోవిచ్

- క్వార్టర్స్‌లో టేలర్‌పై గెలుపు
- యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

న్యూయార్క్

సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్ చరిత్ర సృష్టించాడు. ఓపెన్ శకంలో గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో అత్యధిక సార్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్న ఆటగాడిగా స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ రికార్డును బద్దలు కొట్టాడు. 16 ఏండ్ల క్రితం 2007లో యు.ఎస్ ఓపెన్ వేదికగా కెరీర్ తొలి గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్స్‌కు చేరుకున్న జకోవిచ్.. తాజాగా మెన్స్ సింగిల్స్‌లో టేలర్‌పై విజయంతో ఏకంగా 47వ సారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. రోజర్ ఫెదరర్ (46) రికార్డును బద్దలు కొట్టాడు. లోకల్ స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌పై 6-1, 6-4, 6-4తో వరుస సెట్లలో విజయం సాధించిన నొవాక్ జకోవిచ్.. న్యూయార్క్‌లో మరో గ్రాండ్ విక్టరీ దిశగా దూసుకెళ్తున్నాడు.

ఎదురులేని జకోవిచ్

మూడు సెట్లలోనే ముగిసిన మెన్స్ సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ ఏకపక్ష విజయం నమోదు చేశాడు. ఏడు ఏస్‌లు సంధించిన జకోవిచ్.. ఐదు డబుల్ ఫాల్ట్స్ చేసినా అద్భుత విజయం అందుకున్నాడు. టేలర్ సర్వ్‌ను ఆరు సార్లు బ్రేక్ చేసిన జకోవిచ్.. ప్రత్యర్థిని చిత్తు చేశాడు. జకోవిచ్ సర్వ్‌ను టేలర్ రెండు సార్లు బ్రేక్ చేసినా.. సెర్బియా స్టార్‌కు పెద్దగా పోటీ ఇవ్వలేకపోయాడు. పాయింట్ల పరంగా 102-81తో జకోవిచ్ పైచేయి సాధించాడు. టేలర్ 9 గేములు గెలుపొందగా.. జకోవిచ్ 18 గేములు గెల్చుకున్నాడు. స్వీయ సర్వ్‌లో టేలర్ 7 గేములు నెగ్గగా.. జకోవిచ్ ఏకంగా 12 గేములు సాధించాడు. పురుషుల సింగిల్స్ మరో క్వార్టర్‌ఫైనల్లో బెన్ షెల్టన్ విజయం సాధించాడు. ఆల్ అమెరికన్ల పోరులో బెల్ షెల్టన్ 6-2, 3-6, 7-6(9-7), 6-2తో నాలుగు సెట్ల మ్యాచ్‌లో సహచర ఆటగాడు ఫ్రాన్సెస్ టియాఫోపై విజయం సాధించాడు.

మహిళల సింగిల్స్‌లో పదో సీడ్ కరోలినా ముచోవా వరుస సెట్లలో గెలుపొంది సెమీఫైనల్లోకి చేరుకుంది. చెక్ రిపబ్లిక్ స్టార్ ముచోవా 6-0, 6-3తో సోరాన సిరస్టీయ (రోమానియా)ను చిత్తు చేసింది. ఆరు ఏస్‌లు కొట్టిన ముచోవా.. ఆరు బ్రేక్ పాయింట్లతో తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది. పాయింట్ల పరంగా ముచోవ 73 సాధించగా.. సోరాన 49 పాయింట్లతో సరిపెట్టుకుంది.



టైటిల్ దిశగా.. రోహన్ బోపన్న జోడీ

మెరిసిన బోపన్న జోడీ

భారత వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్న మెన్స్ డబుల్స్‌లో సత్తా చాటుతున్నాడు. ఆస్ట్రేలియా భాగస్వామి మాథ్యూ ఎడెన్‌తో కలిసి యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో పోటీపడుతున్న రోహన్ బోపన్న.. పురుషుల డబుల్స్‌లో సెమీఫైనల్లో ప్రవేశించాడు. క్వార్టర్‌ఫైనల్లో 7-6(12-10), 6-1తో 15వ సీడ్, అమెరికా జోడీ లామ్మోన్స్, జాక్సన్‌లపై మెరుపు విజయమ నమోదు చేశారు. నేడు సెమీఫైనల్లో ఫ్రాన్స్ జోడీ నికోలస్, హెర్బర్ట్‌లతో రోహన్ బోపన్న జోడీ తలపడనుంది.



సెమీస్ నం.47 : నొవాక్ జకోవిచ్



ఫ్లే.. నిరాశే : సాత్విక్, చిరాగ్ జోడీ

పోరాటం ముగిసింది

- సాత్విక్, చిరాగ్ జోడీ ఓటమి
- చైనా ఓపెన్ సూపర్ సిరీస్

చాంగ్జౌ (చైనా) : చైనా ఓపెన్ సూపర్ సిరీస్‌లో టీమ్ ఇండియా పోరాటం ముగిసింది. ప్రపంచ నం.2 జోడీ, మెన్స్ డబుల్స్ స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు నిరాశపరిచారు. బిడబ్ల్యూఎఫ్ 1000 టోర్నీలో టైటిల్ ఫేవరేట్స్‌గా బరిలో నిలిచిన సాత్విక్, చిరాగ్.. మెన్స్ డబుల్స్ తొలి రౌండ్లోనే చతికిల పడ్డారు. వరల్డ్ నం.13 ఇండోనేషియా జోడీ చేతిలో మూడు గేముల మ్యాచ్‌లో అనూహ్య పరాజయం చవిచూశారు. 68 నిమిషాల మ్యాచ్‌లో 17-21, 21-11, 17-21తో భారత స్టార్స్ వెనుకంజ వేశారు. తొలి గేమ్‌లో విరామ సమయానికి 9-11తో వెనకబడిన సాత్విక్, చిరాగ్‌లు.. 12-12తో స్కోరు సమం చేశారు. కానీ ఆ తర్వాత ఇండోనేషియా జోడీ వరుస పాయింట్లు సాధించింది. అదే జోరులో 21-17తో తొలి గేమ్ ప్రత్యర్థి సొంతమైంది. కీలక రెండో గేమ్‌లో భారత స్టార్స్ పంజా విసిరారు. ఇండోనేషియా షట్లర్లను చిత్తు చేశారు. 11-2తో విరామ సమయానికి భారీ ఆధిక్యం సాధించిన సాత్విక్, చిరాగ్‌లు.. ద్వితీయార్థంలోనూ దుమ్మురేపారు. 21-11తో రెండో గేమ్‌ను అలవోకగా నెగ్గారు. కానీ నిర్ణయాత్మక మూడో గేమ్‌లో మనోళ్లకు మళ్లీ నిరాశే ఎదురైంది. ఆరంభం నుంచీ ఆధిక్యం నిలుపుకున్న ఇండోనేషియా షట్లర్లు మహ్మద్ ఫిక్రి, మౌలానా బగాస్‌లు ఒత్తిడిలో మెరుగైన ప్రదర్శన చేశారు. వరల్డ్ నం.2 జోడీపై విజయంతో ప్రీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలుగు తేజం సిక్కి రెడ్డి, రోహన్ కపూర్‌లు పరాజయం పాలయ్యారు. తొలి రౌండ్లో 15-21, 16-21తో మలేషియా జోడీ చెన్, వీల చేతిలో ఓడారు. దీంతో ఈ ఏడాది చైనా ఓపెన్‌లో టీమ్ ఇండియా టైటిల్ వేటకు తొలి రౌండ్లోనే తెరపడింది. హెచ్.ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్‌లు సైతం మెన్స్ సింగిల్స్‌లో తొలి రౌండ్లోనే ఓటమి చవిచూడగా.. మహిళల సింగిల్స్‌లో పి.వి సింధు ఆఖరు నిమిషంలో పోటీ నుంచి తప్పుకుంది.



భారత్‌కు కాంస్యం

- సెమీస్‌లో చైనీస్ తైపీ చేతిలో ఓటమి
- టేబుల్ టెన్నిస్ ఆసియా చాంపియన్‌షిప్స్



భారత మెన్స్ టేబుల్ టెన్నిస్ జట్టు (ఫైల్)

పియాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా) : ప్రతిష్టాత్మక టేబుల్ టెన్నిస్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత్ కాంస్య పతకం సాధించింది. రెండేండ్ల క్రితం దోహాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్స్‌లో మూడో స్థానంలో నిలిచి పతకం సాధించిన పురుషుల జట్టు.. తాజాగా పియాంగ్‌చాంగ్‌లో అదే ప్రదర్శన పునరావృతం చేసింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో చైనీస్ తైపీ చేతిలో 0-3తో పరాజయం పాలైన టీమ్ ఇండియా పురుషుల జట్టు.. కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. మూడో సీడ్ భారత్ వరుసగా మూడు మ్యాచుల్లో రెండో సీడ్ చైనీస్ తైపీకి తలొగ్గింది. వెటరన్ ప్యాడ్లర్ అచంట శరత్ కమల్ 6-11, 6-11, 9-11తో, జ్ఞానశేఖరన్ సతియన్ 5-11, 6-11, 10-12తో, హర్మీత్ దేశాయ్ 6-11, 7-11, 9-11తో వరుస మ్యాచుల్లో ఓటమి పాలయ్యారు. శరత్ కమల్, జి. సతియన్ చేతులెత్తేయగా.. యువ ఆటగాడు హర్మీత్ దేశాయ్ ప్రతిఘటించే ప్రయత్నం చేశాడు. మహిళల జట్టు విభాగంలో క్లాసిఫికేషన్ మ్యాచుల్లో మనిక బత్ర బృందం నిరాశపరిచింది. థాయ్‌లాండ్ చేతిలో 0-3తో పరాజయం పాలై ఆరో స్థానంతో సరిపెట్టుకుంది.

శ్రీలంక క్రికెటర్ సచిత్ర అరెస్టు

2020 ఎల్‌పీఎల్‌లో ఫిక్సింగ్‌కు ప్రయత్నం



పోలీసుల అదుపులో శ్రీలంక క్రికెటర్ సచిత్ర సేననాయకె

కొలంబో : శ్రీలంక మాజీ క్రికెటర్, 2014 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించిన స్పిన్నర్ సచిత్ర సేననాయకెను శ్రీలంక పోలీసులు అరెస్టు చేశారు. 2020 శ్రీలంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్)లో ఫిక్సింగ్‌కు పాల్పడేందుకు కొందరు క్రికెటర్లను సచిత్ర సేననాయకె సంప్రదించినట్టు ప్రధాన ఆరోపణ. 2020 ఎల్‌పీఎల్‌లో ఆటగాడిగా సచిత్ర భాగస్వామ్యం లేదు. ఆ సమయంలో విదేశాల్లో ఉన్న సచిత్ర.. ఇతర క్రికెటర్లను ఫిక్సింగ్ కోసం సంప్రదింపులు జరిపాడు. ఆ క్రికెటర్లు విషయాన్ని లీగ్ అవినీతి నిరోధక విభాగం అధికారులకు చేరవేశారు. దీంతో క్రీడా సంబంధిత నేరాల నియంత్రణ చట్టం 2019 ప్రకారం సచిత్ర సేననాయకెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రానున్న 24 గంటల్లో సచిత్రను న్యాయస్థానంలో హాజరు పరుస్తామని పోలీసులు వెల్లడించారు. ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యంలో సచిత్ర దేశం విడిచి వెళ్లకుండా న్యాయస్థానం ఆంక్షలు విధించింది. శ్రీలంక తరఫున 49 వన్డేలు, 24 టీ20లు, ఓ టెస్టు మ్యాచ్ ఆడిన సచిత్ర సేననాయకె.. 2014 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 2013 ఐపీఎల్ వేలంలో కోల్‌కత నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ సచిత్రను భారీ ధరకు కొనుగోలు చేసింది. చివరగా 2016లో శ్రీలంక జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సచిత్ర.. క్రీడా సంబంధిత నేరాల నియంత్రణ చట్టం 2019 ప్రకారం అరెస్టు కాబడిన తొలి వ్యక్తి కావటం గమనార్హం.

భలే మంచి ఆతిథ్యం!

పీసీబీపై బీసీసీఐ బాస్ ప్రశంసలు



లాహోర్‌లోని గవర్నర్ హౌస్ విందులో రోజర్ బిన్నీ, రాజీవ్ శుక్లా

న్యూఢిల్లీ : 'పాకిస్థాన్ మమ్మల్ని చాలా బాగా చూసుకుంది. మాకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రతలు తీసుకుంది. పంజాబ్ ప్రావిన్స్ గవర్నర్ హౌస్‌లో పీసీబీ గొప్ప ఆతిథ్యం ఇచ్చింది' అంటూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), ఆ దేశ ఆతిథ్యంపై బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ప్రశంసలు కురిపించారు. ఆసియా కప్ ఆతిథ్య దేశంగా పీసీబీ ఆహ్వానం మేరకు రోజర్ బిన్నీ, రాజీవ్ శుక్లాలు రెండు రోజుల పర్యటన నిమిత్తం పాకిస్థాన్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. క్రికెట్ ప్రధాన అజెండా సాగిన పర్యటనలో పీసీబీ ప్రతినిధులతో బిన్నీ, శుక్లాలు విలువైన చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. 17 ఏండ్ల విరామం అనంతరం భారత క్రికెట్ ప్రతినిధులు పాక్ గడ్డపై అడుగు పెట్టగా.. పీసీబీ ఘనంగా ఆహ్వానించి, ఆతిథ్యం అందించి.. వీడ్కోలు పలికింది. అటారి-వాఘా సరిహద్దు నుంచి బుధవారం భారత్‌కు చేరు కున్న రోజర్ బిన్నీ, రాజీవ్ శుక్లాలు పాక్ పర్యటనపై సంతృప్తి వ్యక్తం చేశారు. 'ఇరు దేశాల నడుమ క్రికెట్ సంబంధాలు ప్రభుత్వ పరిధిలోని అంశం. ప్రభుత్వమే ఓ నిర్ణయం తీసుకోవాలి. ఆసియా క్రికెట్ కౌన్సిల్‌లో భారత్ అన్ని దేశాలతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉంది. శ్రీలంక, పాక్‌లో పర్యటనలో అందులో భాగమే' అని రోజర్ బిన్నీ తెలిపారు. '2004లో పాక్‌లో పర్యటిం చిన ఫ్రెండ్ షిప్ సిరీస్‌లోనూ నేను ఉన్నాను. క్రికెట్ ఎప్పుడూ మైత్రి బంధా నికి వారధిగా నిలుస్తుంది. ఆ సమయంలో స్థానిక వ్యాపారులు భారత ప్రతినిధుల వద్ద డబ్బులు తీసుకునేందుకు నిరాకరించారు. అంత గొప్ప వాతావరణం కల్పించే శక్తి క్రికెట్‌కు ఉంది' అని రాజీవ్ శుక్లా అన్నారు. రెండు దేశాల నడుమ ఉద్రిక్తలు తగ్గించేందుకు ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలు దౌత్య వారధిగా నిలుస్తాయనే అభిప్రాయం బిన్నీ, శుక్లా వ్యక్తం చేశారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.